సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 ఈరోజు సంచికతో సాక్షి కేలండర్ (*On Demand) వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 280

SUNDAY Special ఆదివారం 31-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



రిచా పోరాటం వృథా

ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలోనూ భారత మహిళల జట్టు ఓడిపోయింది. భారత బ్యాటర్ రిచా ఘోష్ (117 బంతుల్లో 96; 13 ఫోర్లు) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది.

- వివరాలు 12లో



త్రివిధ దళ ప్రతిభావంతుల ప్రథమ అడుగు

త్రివిధ దళాలలో పురుషులు మాత్రమే నాయకత్వ స్థానంలో ఉండే విభాగాలలో ఈ సంవత్సరం మహిళా అధికారులు నాయకత్వ స్థానాల్లోకి రావడంపై ప్రత్యేక కథనం

- వివరాలు 11లో



రాజీనామా ఊహాగానమే

గవర్నర్‌గా రాజీనామా చేసి మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెళ్తున్నట్లు వస్తున్న వార్తలు ఊహాగానాలేనని తమిళిసై స్పష్టం చేశారు.

- వివరాలు 2లో



ఏజీగా ఎ.సుదర్శన్‌రెడ్డి

రాష్ట్ర హైకోర్టు అడ్వొకేట్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 5లో

ఇంటింటా రామజ్యోతి

జనవరి 22న అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ట సందర్భంగా వెలిగించండి

దేశ ప్రజలకు మోదీ పిలుపు

- ప్రపంచమంతా ఎదురుచూసింది ఈ రోజు కోసమే... గుడారంలో గడిపిన రామునికి 'పక్కా ఇల్లు'
- అయోధ్య ర్యాలీలో ప్రధాని వ్యాఖ్యలు
- విమానాశ్రయం, రైల్వే జంక్షన్ ప్రారంభం
- రూ.15,700 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన



శనివారం అయోధ్యలో చేపట్టిన రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్టను దీపావళి పర్వదినంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆ సందర్భంగా జనవరి 22న ఇంటింటా శ్రీరామజ్యోతి వెలిగించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ రోజు కోసం ప్రపంచమంతా ఏళ్ల తరబడి ఎదురుచూసిందన్నారు. ఏళ్ల తరబడి గుడారంలో గడిపిన రామునికి ఎట్టకేలకు 'పక్కా ఇల్లు' సాకారమైందన్నారు. అయోధ్యలో ఆయన శనివారం పర్యటించారు. నూతన విమానాశ్రయంతోపాటు ఆధునీకరించిన రైల్వే జంక్షన్‌ను ప్రారంభించారు. రూ.15,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధి, వారసత్వం రెండు పట్టాలుగా దేశం ప్రగతి పథంలో పరుగులు తీయాలని ఆకాంక్షించారు. జనవరి 22న అయోధ్యకు పోటెత్తొద్దని, ఎక్కడివారక్కడే రామాలయ ప్రారంభ వేడుకలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయోధ్యలో ఉజ్వల్ పథక 10 కోట్లవ లబ్ధిదారు ఇంట్లో మోదీ చాయ్ ఆస్వాదించారు.

- వివరాలు 6లో

> రామాలయ ప్రాణప్రతిష్ట క్రతువును ప్రత్యక్షంగా తిలకించేందుకు జనవరి 22నే అయోధ్యకు పోటెత్తాలని అసంఖ్యాకులు భావిస్తున్నట్లు తెలిసింది. దయచేసి ఆ రోజున మాత్రం అయోధ్యకు రాకండి. చేతులు జోడించి వేడుకుంటున్నా. ఎందుకంటే అందరికీ అదే రోజున దర్శనభాగ్యం సాధ్యపడదు. ఆ రోజు చాలా మంది విశిష్ట అతిథులు విచ్చేస్తున్నారు. కనుక యావత్ ప్రజానీకం జనవరి 23 నుంచి జీవితాంతం అయోధ్య రామున్ని దర్శించుకోవచ్చు.
>
> - మోదీ

రాముడే బీజేపీ ఎన్నికల అభ్యర్థి! శివసేన నేత సంజయ్ రౌత్ విమర్శ

6 లో

ఉజ్వల లబ్ధిదారు ఇంట్లో టీ తాగిన ప్రధాని మోదీ

అపోహలొద్దు.. అర్హులందరికీ లబ్ధి

రైతు భరోసా, పింఛన్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

- వివరాలు 2లో



త్వరలో మెగా డీఎస్సీ

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టండి

విద్యా శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- రాష్ట్రంలో బడి లేని పంచాయతీ, తండా ఉండొద్దు
- విద్యార్థులు లేరని మూసేసిన పాఠశాలలు మళ్లీ తెరవండి
- టీచర్ల ప్రమోషన్లు, బదిలీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి... 'మన ఊరు– మన బడి'కింద నిధుల వినియోగంపై విచారణకు ఆదేశం...
- పది ఉమ్మడి జిల్లాల్లో నైపుణ్య యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటన



సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువు కోసం ఇతర గ్రామాలకు, పట్టణాలకు పోయే పరిస్థితి ఉండొద్దు.. విద్యార్థులు లేరంటూ మూసివేసిన అన్ని బడులను తెరిపించాలి. ఎంతమంది పిల్లలున్నా ప్రభుత్వ పాఠశాలను నడపాల్సిందే. దీనికోసం వెంటనే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీకి చర్యలు తీసుకోండి..''అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని సూచించారు. శనివారం సచివాలయంలో విద్యాశాఖపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పాఠశాల లేని గ్రామ పంచాయతీ ఉండొద్దని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంత మారుమూల గ్రామమైనా, తండా అయినా కూడా తప్పకుండా ప్రభుత్వ పాఠశాల ఉండాలని.. పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి రానీయొద్దని సూచించారు. విద్యార్థులు లేరనే నెపంతో పాఠశాలలు మూతపడొద్దన్నారు.

ఉత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దాలి

మన ఊరు, మన బడి కార్యక్రమంలో జరిగిన పనుల పురోగతిని

మిగతా 2వ పేజీలో ▶

మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు

రెండు పార్టులుగా సైన్స్ పేపర్... టైం టేబుల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షలను మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పదవ తరగతి పరీక్షల విభాగం ప్రకటించింది. శనివారం ఇందుకు సంబంధించిన టైం టేబుల్‌ను విడుదల చేసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పేర్కొంది. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 కాంపోజిట్ కోర్సు మాత్రం మధ్యాహ్నం 12.50 (అదనంగా 20 నిమిషాలు) వరకూ ఉంటుందని తెలిపింది. కాగా, సైన్స్ సబ్జెక్టును రెండు పార్టులుగా విడగొట్టారు. ఉదయం 9.30 నుంచి 11 వరకూ ఈ పరీక్ష ఉంటుందని బోర్డు తెలిపింది. ఇక ఆబ్జెక్టివ్ పేపర్ (పార్ట్-బీ)ని ఆఖరి అరగంటలో విద్యార్థులకు ఇస్తారు.

తేదీ	పరీక్ష
18-3-24	మొదటి భాష (గ్రూప్-ఏ) మొదటి భాష పార్ట్-1, పార్ట్-2 (కాంపోజిట్ కోర్సు)
19-3-24	ద్వితీయ భాష
21-3-24	తృతీయ భాష (ఇంగ్లిష్)
23-3-24	గణితం
26-3-24	సైన్స్, పార్ట్-1 (ఫిజికల్ సైన్స్)
28-3-24	సైన్స్, పార్ట్-2 (బయోలాజికల్ సైన్స్)
30-3-24	సాంఘిక శాస్త్రం
1-4-24	ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్) ఎస్సెస్సీ ఒకేషనల్ కోర్సు (థియరీ)
2-4-24	ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్)

ఇదండీ సంగతి



ఎంజీఎంలో అర్ధరాత్రి పవర్‌కట్

- వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న రోగి మృతి
- కోతుల చేష్టలతో షార్ట్ సర్క్యూట్
- అత్యవసర వార్డులకు సైతం నిలిచిన విద్యుత్ సరఫరా
- వ్యాధి తీవ్రతతోనే రోగి చనిపోయినట్లు వైద్యుల ప్రకటన

5 లో

నా రాజీనామా ఊహాగానమే

నా రాజకీయ భవిష్యత్తు శ్రీరాముడు, మోదీ చేతుల్లో ఉంది: గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్/కంటోన్మెంట్: తాను గవర్నర్‌గా రాజీనామా చేసి మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు వస్తున్న వార్తలు ఊహాగానాలేనని గవర్నర్ తమిళిసై స్పష్టం చేశారు. శనివారం ఆమె హైదరాబాద్‌లోని అనురాధా టింబర్స్‌ను సందర్శించినప్పుడు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం గవర్నర్‌గా సంతృప్తిగా ఉన్నానని తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తు శ్రీరాముడితో పాటు ప్రధాన మంత్రి మోదీ చేతుల్లో ఉందన్నారు. తాను రాజకీయాల్లోకి వెళ్లాలనుకుంటే స్వయంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తానని తెలిపారు.

పూల బొకేలు వద్దు.. బుక్స్ తీసుకురండి

నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సోమవారం ఉదయం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు రాజ్‌భవన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులను గవర్నర్ ఆహ్వానించినట్టు తెలిసింది. కాగా, ఈ కార్యక్రమానికి హాజరయ్యేవాళ్లు పూల బొకేలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోట్ బుక్స్, పెన్నులను తీసుకురావాలని గవర్నర్ విజ్ఞప్తి చేసినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా...

ఎస్టీయూటీఎస్ డైరీని ఆవిష్కరించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్టీయూటీఎస్) రూపొందించిన నూతన సంవత్సర డైరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎంకు ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని హామీ ఇచ్చారని ఎస్టీయూ టీఎస్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్‌రెడ్డి, జి.సదానందంగౌడ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.కరుణాకర్ రెడ్డి, డైరీ కన్వీనర్ సుధాకర్, జాతీయ సభ్యులు ఎన్.పరమేశ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు దారిచ్చిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తన కాన్వాయ్ కోసం అంబులెన్స్‌ను ఆపకుండా దారి ఇచ్చారు. శనివారం తన నివాసం నుంచి సచివాలయానికి వెళ్తుండగా, కేబీఆర్ పార్క్ వద్ద అంబులెన్స్‌ను గమనించారు. తన కాన్వాయ్ కోసం అంబులెన్స్‌ను ఆపకుండా దారి ఇవ్వాలని భద్రత సిబ్బందికి సూచించారు. దీంతో ముఖ్యమంత్రి కాన్వాయ్ అంబులెన్స్‌కు దారిచ్చింది. అటుగా వెళుతున్న కొందరు ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తన కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దంటూ ముఖ్యమంత్రి రేవంత్ ఇటీవల పోలీస్ అధికారులకు సూచించిన విషయం తెలిసిందే.

ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోండి

టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న సంక్షేమ ఫలాల కోసం అర్హులైన వారంతా ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ కోరారు. బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మవద్దని, వారి మాటలు నమ్మి దరఖాస్తు చేసుకోకపోతే అర్హులు నష్టపోతారని వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేర్చడంలో భాగంగానే దరఖాస్తులను తీసుకుంటున్నామని చెప్పారు. డిప్యూటీ సీఎం హోదాలో పనిచేసిన కడియం శ్రీహరి లాంటి నేతలు కూడా ఈ విషయంలో నోరు జారి మాట్లాడుతున్నారని అన్నారు. కడియంకు ఎలాంటి అనుమానం అవసరం లేదని, ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చి తీరుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని, నిజంగా ప్రజలపట్ల చిత్తశుద్ధి ఉంటే వారు ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గాల్లో దగ్గరుండి ప్రజాపాలన దరఖాస్తులు చేయించాలని బెల్లయ్య నాయక్ అన్నారు.

రాష్ట్రంలో 'ఇండస్ట్రీ 4.0' ప్రాజెక్టు

ఉపాధి ఆధారిత పారిశ్రామిక శిక్షణకు ముందుకొచ్చిన టాటా టెక్నాలజీస్

రూ.1,500-2,000 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలకు యంత్ర పరికరాలు, శిక్షణ

- ఐదేళ్లపాటు ఉచితంగా అందించనున్న సంస్థ
- స్వాగతించిన సీఎం రేవంత్ రెడ్డి
- టాటా టెక్నాలజీస్ ప్రతినిధులతో సచివాలయంలో సమావేశం



శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌తో సమావేశమైన టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 50 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ల్లో రూ. 1,500 – 2,000 కోట్లతో ఉపాధి ఆధారిత పారిశ్రామిక శిక్షణ అందించడానికి టాటా టెక్నాలజీస్ ముందుకొచ్చింది. 'ఇండస్ట్రీ 4.0' ప్రాజెక్టు పేరుతో ఐటీఐల ద్వారా యువతకు ఇండస్ట్రియల్ ఆటోమేషన్, రోబోటిక్స్ తయారీ, అధునాతన సీఎస్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, ఈవీ మెకానిక్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్ వంటి కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందించడానికి టాటా సంస్థ ముందుకు రాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. రాష్ట్రంలో 'ఇండస్ట్రీ 4.0' స్కిల్ సెంటర్లను ఏర్పాటుచేయడంతోపాటు వాటి నిర్వహణకు కావాల్సిన పరికరాలు, సాఫ్ట్‌వేర్‌ను టాటా సంస్థ అందిస్తుంది. దాదాపు లక్ష మంది విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక శిక్షణ అందించడంతోపాటు పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా వారి నైపుణ్యాలను మెరుగుపరచడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులతో శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. నైపుణ్యాభివృద్ధిలో టాటా సంస్థతో ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని, ఇందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. టాటా టెక్నాలజీస్‌తో పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకోవడానికి ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

ఐదేళ్ల పాటు ఉచిత సహకారం

'ఇండస్ట్రీ 4.0' ప్రాజెక్టులోని కోర్సుల నిర్వహణకు అవసరమైన యంత్రాలు, సాఫ్ట్‌వేర్ అందించడంతో పాటు ప్రతీ ఐటీఐకి ఇద్దరు మాస్టర్ ట్రెయినర్లను టాటా సంస్థ అందిస్తుంది. ఈ ప్రాజెక్టును ఐదేళ్లపాటు టాటా సంస్థ ఉచితంగా నిర్వహించనుంది. ఆధునిక సాంకేతిక వర్క్‌షాపులు, తయారీ రంగంలో అత్యధిక డిమాండ్ కలిగి ఉపాధికి అవకాశాలున్న 22 స్వల్పకాలిక, 5 దీర్ఘకాలిక కోర్సులను పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ అందిస్తుంది. ఎంఓయూ విధివిధానాల ఖరారుకు ఉపాధికల్పన, కార్మిక శాఖ టాటా సంస్థతో సంప్రదింపులు జరుపుతోంది. దీని ఆధారంగానే రాష్ట్రంలో 50 ప్రభుత్వ ఐటీఐలను గుర్తిస్తారని అధికారులు చెప్పారు.

ప్రపంచంతో పోటీపడేలా..: సీఎం

ప్రపంచంతో పోటీపడేవిధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ యువతకు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. కోర్సులు పూర్తైన వెంటనే ఉద్యోగం, ఉపాధి, సొంతంగా పరిశ్రమ లను ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదిగే విధంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. కాలం చెల్లిన కోర్సులతో యువత సమయాన్ని, విద్యను వృథా చేయకుండా ఆధునా తన కోర్సుల్లో శిక్షణ కోసం చర్యలు తీసుకోవాల న్నారు. ఈ సమావేశంలో టాటా టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కౌల్గుడ్, గ్లోబల్ హెడ్ వైస్ ప్రెసిడెంట్ సుశీల్ కుమార్, కార్మిక, ఉపాధికల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎంఓ అధికారులు శేషాద్రి, షానవాజ్, అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే కామ్రేడ్లు!

- లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎంలతో కలసి వెళ్లనున్న అధికార పార్టీ
- ఇండియా కూటమిలో భాగంగా రాష్ట్రంలో పొత్తు కుదరడం లాంఛనమే
- సీపీఎం నేతలు తనను కలసిన సందర్భంగా ఈ అంశం ప్రస్తావించిన సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ మాత్రమే పొత్తుతో ముందుకు వెళ్లగా, లోక్‌సభ ఎన్నికల వేళ సీపీఎం కూడా జతచేరనుందా? మొత్తంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలసి పనిచేస్తాయా? పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని నిలువరించడమే ధ్యేయంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు అధికారికంగా పొత్తు కుదుర్చుకోనున్నాయా? అంటే అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. ఇప్పటికే జాతీయ స్థాయిలోని ఇండియా కూటమిలో భాగస్వాములైన ఈ మూడు పార్టీలు.. తెలంగాణలోనూ కలసి పనిచేస్తామని అధికారికంగా ప్రకటించడం లాంఛనమే కానుందని తెలుస్తోంది. ఇందుకు శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌తో రాష్ట్ర సీపీఎం నేతల భేటీ వేదికయిందనే చర్చ జరుగుతోంది.

కలసి పనిచేద్దాం..

సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి తదితరులు కలసిన సందర్భంగా యాదృచ్ఛికంగా ఈ చర్చ వచ్చినట్టు తెలుస్తోంది. తమతో కలసి పనిచేయనప్పటికీ.. ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకునే క్రమంలో మీ అభిప్రాయాలు కూడా తీసుకుంటామని, ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సీఎం రేవంత్ సీపీఎం నేతలతో అన్నారని విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కలసి పనిచేయనంత మాత్రాన వేర్వేరు కాబోమని, లోక్‌సభ ఎన్నికల సమయంలో పొంచి ఉన్న బీజేపీ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ఐక్యంగా పనిచేద్దామని ముఖ్యమంత్రి వ్యూహాత్మక ప్రతిపాదన చేశారు. ఇందుకు స్పందించిన సీపీఎం నేతలు బీజేపీని ఎదుర్కొనే విషయంలో తమకు వేరే ఆలోచన ఉండబోదని, అయితే కాంగ్రెస్‌తో కలసి పనిచేసే అంశాన్ని పార్టీలో చర్చించి అధికారికంగా ప్రకటిస్తామని చెప్పినట్టు సమాచారం. అలాగే చేద్దామని, త్వరలోనే మళ్లీ కలసి అన్ని విషయాలు మాట్లాడుకుందామని సీఎం రేవంత్ చెప్పడంతో మరోమారు సమావేశమవుదామని వారు ఈ చర్చను ముగించినట్టు తెలిసింది. సీపీఎం నాయకులు తనను కలసిన సందర్భంగా సీఎం రేవంత్ వ్యూహాత్మకంగానే ఈ అంశాన్ని ప్రస్తావనకు తెచ్చారని తెలుస్తోంది. సీపీఎంతో తెలంగాణలో జట్టుకట్టే విషయంలో కాంగ్రెస్ సిద్ధంగా ఉందనే సంకేతాలను ఆయన ఇచ్చారని, ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో ఉభయ వామపక్షాల సహకారంతో కాంగ్రెస్ పార్టీ బరిలోకి దిగడం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అపోహలొద్దు.. అర్హులందరికీ లబ్ధి

రైతు భరోసా, పింఛన్లపై సీఎం స్పష్టీకరణ

- పాత లబ్ధిదారులందరికీ యథాతథంగా లబ్ధి
- దరఖాస్తుల అమ్మకాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు, పింఛన్ల పథకం కింద పాత లబ్ధిదారులందరికీ ఆ పథకాలు వర్తిస్తాయని వారు కొత్తగా రైతు భరోసా, చేయూత పథకాల కింద మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతుభరోసా, పింఛన్లపై అనవసర అపోహలు వద్దని, కొత్తగా ఈ పథకాల కింద లబ్ధి పొందాలనుకునే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురి కావద్దని కోరారు. ప్రజాపాలనకు సంబంధించి అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయిలో కార్యక్రమం అమలవుతున్న తీరుపై శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రితో సమీక్షించారు. ప్రజాపాలన దరఖాస్తులను కొంతమంది విక్రయిస్తుండడంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల కొరత లేకుండా చూడండి

దరఖాస్తుదారులకు అవసరమైనన్ని దరఖాస్తులు అందుబాటులో ఉంచాల్సిందేనని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలు, దరఖాస్తుల వివరాలు, ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న విధానం, ప్రజల్లో స్పందనకు సంబంధించి పూర్తి వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కొరత లేకుండా చూడాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారికి ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తులను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు విధిగా భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజాపాలన క్యాంపుల్లో దరఖాస్తుదారులకు తాగునీరు, సరైన నీడ కోసం టెంట్లు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోటురానీయొద్దని అధికారులకు మరోసారి స్పష్టం చేశారు.

ప్రాధాన్యం ప్రకారం | సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం

- ధరణి పోర్టల్‌ను సవరించాలి
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి
- రోజు కూలీ రూ.600 ఉండాలి
- సీఎంకు సీపీఎం నేతల వినతి



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తమ్మినేని, వీరయ్య, జూలకంటి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో నిర్మించాలని, ధరణి పోర్టల్‌ను సవరించి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, సుప్రీం తీర్పు నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఎం నేతలు కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, టి.జ్యోతి, పి.సుదర్శన్, నర్సింహారావు, జాన్‌వెస్లీ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పేద రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులకు 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. తొమ్మిదేళ్లలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాల జీవో సవరించలేదని, రోజు కూలీ రూ.600 ఉండేలా జీవోను సవరించాలని సూచించారు. అర్హులైన పేదలందరికీ 120 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ఉద్యమాల సందర్భంగా ప్రజలు, కార్యకర్తలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలన్నారు. రాష్ట్రంలో సీలింగ్, మిగులు తదితర సాగుకు ఉపయోగపడే భూములను భూమిలేని పేదలకు పంచాలన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, ఖాళీ పోస్టులు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరారు. చేతి వృత్తుల సంక్షేమ పథకాల్లో లోపాలను సవరించి, అవినీతిని అరికట్టాలని సీపీఎం నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎంపీ మాలోతు కవిత

హన్మకొండ/ ఎస్ఎస్ తాడ్వాయి: దక్షిణ భారత కుంభమేళా అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మేడారం వనదేవతల దర్శనానికి వెళ్తూ హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ మంజూరు చేసి సమ్మక్క- సారక్క పేరు పెట్టడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీ లిచ్చిందని, రాష్ట్రంలో 45 లక్షల మందికి పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పిన మేరకు జనవరి 1 నుంచి రూ.4 వేల చొప్పున చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. డిసెంబర్‌లో పెన్షన్, రైతుబంధు సకాలంలో అందించడంలో ప్రభు త్వం విఫలమైందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం నివేదిక రాకముందే ఆగమాగం చేస్తున్నారని, దీనిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇప్పటికే మాట్లాడారని గుర్తు చేశా రు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాక ర్‌రావు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, శంకర్ నాయక్ పాల్గొన్నారు. కాగా, ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మలను ఎమ్మెల్సీ కవిత, ఎంపీ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు దర్శించుకున్నారు.

రెవెన్యూ శాఖలో ఆరేళ్ల పెండింగ్ ఫైళ్లకు మోక్షం

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలన్న మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్ ఫైళ్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం మోక్షం కల్పించారు. వివిధ హోదాల్లో పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఉద్యోగులు చికిత్స కోసం అయిన వ్యయాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా ప్రభుత్వానికి నివేదించారు. అందులో 2017 నుంచి పలు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పటి నుంచి తమకు రావాల్సిన రీయింబర్స్‌మెంటు కోసం ఎదురుచూస్తున్నారు. శనివారం ఉద్యోగుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి వెంటనే ఈ ఫైళ్లను తెప్పించుకుని కొన్నింటిని ఆమోదించారు. తక్కువ మొత్తం ఉన్న ఉద్యోగులకు ఇన్నాళ్లు చెల్లించకపోవటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

బీఆర్ఎస్ సీనియర్లకు | కీలక బాధ్యతలు

- లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగస్వామ్యం
- కేటీఆర్, హరీశ్‌రావు, కేకే తదితరులతో కోర్ టీమ్
- ఎన్నికల వ్యూహంపై ఇప్పటికే కేసీఆర్ సూచనలు
- జనవరి 3 నుంచి జరిగే భేటీల్లో కార్యాచరణ ఖరారు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా కార్యాచరణపై దృష్టిపెట్టిన బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించారు. శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌తోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు కీలక పాత్ర పోషించారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం మరికొందరు పార్టీ కీలక నేతలకూ బాధ్యతలు అప్పగించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ కోర్ టీమ్‌లో కేటీఆర్, హరీశ్‌లతోపాటు పార్టీ సెక్రెటరీ జనరల్ కే.కేశవరావు, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మాజీ స్పీకర్‌లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు సభ్యులుగా ఉన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో కోర్‌టీం నుంచి ఆయనను మినహాయించారు.

సన్నాహక సమావేశాల బాధ్యతలు కూడా..

వచ్చే నెల మూడో తేదీ నుంచి 21వ తేదీ వరకు రెండు విడతల్లో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలు లేదా లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా కోర్‌టీమ్ సభ్యులకు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మొదలుకుని మండల స్థాయి నాయకులదాకా ఈ భేటీలకు ఆహ్వానించినందున వారిని సమన్వయం చేసే బాధ్యతను సీనియర్ నేతలకు అప్పగించారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే కేటీఆర్, హరీశ్, ఇతర నేతలకు దిశానిర్దేశం చేశారు.

బూత్ స్థాయి నుంచీ భాగస్వాములను చేసి..

2014, 2019 లోక్‌సభ ఎన్నికలు, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారీగా వివిధ పార్టీలకు లభించిన ఓట్లపై ఇప్పటికే ఓ ప్రైవేటు ఏజెన్సీ పోస్ట్‌మార్టం చేసి నివేదికను అందజేసింది. మరోవైపు బూత్‌స్థాయి మొదలుకుని అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వరకు క్రియాశీలకంగా పనిచేసిన పార్టీ నేతల వివరాలను కూడా ఇప్పటికే క్రోడీకరించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం కింది స్థాయి నేతలు పనిచేసిన తీరును మదింపు చేశారు. అసెంబ్లీ ఎన్నికల వ్యూహానికి భిన్నంగా బూత్ స్థాయి నేతలను కూడా లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను పార్టీ ఇప్పటికే సిద్ధం చేసింది. జనవరి 3 నుంచి లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా జరిగే సన్నాహక సమావేశాల్లో వారికి ముఖ్య నేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

త్వరలో మెగా డీఎస్సీ

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం సమీక్షించారు. ఆ కార్యక్రమంలో ఇంకా మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తిచేసి, రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను ఉత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని సూచించారు. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) నిధులతో మన ఊరు-మన బడి కింద ఖర్చు చేసిన నిధులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కాంట్రాక్టుల్లో అవినీతి జరిగిందనే ఫిర్యాదుల నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. ఇక ఉపాధ్యాయుల పదోన్నతులు. బదిలీలలో ఉన్న అవాంతరాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బదిలీల విషయంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపాలని.. అవాంతరాలను అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. విద్యా సంస్థల విద్యుత్ బిల్లుల కేటగిరీ మార్పునకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యాలయాలకు వ్యాపార, పారిశ్రామిక కేటగిరీ కింద బిల్లులు వసూలు చేయడంపై తగిన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. పాఠశాలల్లో స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయడానికి ఉన్న మార్గాలను సూచించాలని కోరారు.

ఉమ్మడి జిల్లాకో నైపుణ్య విశ్వవిద్యాలయం

రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో నైపుణ్య యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు తగిన నైపుణ్యాలు సాధించి, ఉద్యోగాలు పొందగలిగేలా ఈ స్కిల్ యూనివర్సిటీలు ఉండాలని అధికారులకు సూచించారు. వాటిలో ఉపాధి ఆధారిత స్వల్పకాల, దీర్ఘకాల కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ఈ విషయంలో గుజరాత్, హరియాణా, రాజస్తాన్, ఒడిశా, ఏపీ తదితర రాష్ట్రాల్లో ఉన్న స్కిల్ యూనివర్సిటీలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంతోపాటు తొమ్మిది జిల్లాల్లో ఈ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశంపై విద్యాశాఖ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖల కార్యదర్శులతో ప్రత్యేక కమిటీ వేసి తగిన ప్రతిపాదనలను సమర్పించాలని సీఎస్‌ను ఆదేశించారు. సీఎం సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్య కమిషనర్ దేవసేన, సీఎంవో అధికారులు శేషాద్రి, షానవాజ్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలు పరిశీలన


రాజ్యాంగబద్ధమైన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేయకుండా ప్రైవేటు యూనివర్సిటీలు నడవడం సరికాదని విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్ పేర్కొన్నారు. ప్రైవేటు యూనివర్సిటీల మార్గదర్శకాలపై సమగ్రంగా పరిశీలన జరపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రైవేటు వర్సిటీల్లో రిజర్వేషన్ల అమలు కోసం అవసరమైతే అసెంబ్లీలో చట్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కాగా ఉన్నత విద్యా మండలి ప్రక్షాళన అంశంపైనా సమీక్షలో చర్చ జరిగినట్టు సమాచారం. అయితే ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, వైస్ చైర్మన్ వెంకటరమణలను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా.. తిరిగి వారిని సమావేశానికి ఆహ్వానించడం చర్చనీయాంశంగా మారింది.

ప్రైవేటు వర్సిటీలపై విచారణ!

రాష్ట్రంలోని ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులు, మార్గదర్శకాలు, ప్రభుత్వం నుంచి పొందుతున్న సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వసూలు చేసిన ఫీజులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, టీచింగ్ సిబ్బంది, నాన్ టీచింగ్ సిబ్బంది వంటి అన్ని అంశాలపై పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సరైన మౌలిక వసతులు, అర్హతలున్న సిబ్బంది లేకుండానే ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని ప్రైవేటు వర్సిటీలు ఎలా చెప్తున్నాయో పరిశీలించాలన్నారు. ఇండ్ల ప్లాట్ల కింద రిజిస్ట్రేషన్లు అయిన భూములను, ధరణిలో వివాదంలో ఉన్న భూముల్లో ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతి ఇచ్చారని.. దీనివల్ల ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపైనా సమగ్ర నివేదికను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీకి అనుమతులు రాకుండానే అడ్మిషన్లు నిర్వహించిన ఒక కాలేజీ వల్ల గత విద్యాసంవత్సరంలో చాలామంది విద్యార్థులు ఇబ్బందిపడ్డారని గుర్తు చేశారు.

కాళేశ్వరం అవినీతిని | చిన్నదిగా చూపే ప్రయత్నం

కాంగ్రెస్ తీరు అనుమానాలకు తావిస్తోంది: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పెద్ద స్థాయిలో అవినీతి జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని చిన్నదిగా చూపే ప్రయత్నం చేస్తోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. మేడిగడ్డ తదితర ప్రాంతాలకు గుంపుగా మంత్రులు వెళ్లి, గుప్పెడు మట్టిని తీసుకొచ్చినట్టుగా వారి వ్యవహారముందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ప్రజల కళ్లలో మట్టి కొట్టేందుకు చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ సర్కార్ దారిలోనే కాంగ్రెస్ వెళ్తోందని మండిపడ్డారు. శనివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని, లేని పక్షంలో కాంగ్రెస్‌ను కూడా ప్రజలు దోషిగా నిలబెడతారని హెచ్చరించారు. కాళేశ్వరం నిర్మాణంలో అనేక తప్పిదాలు, పొరపాట్లు జరిగాయని, ప్లానింగ్, డిజైన్‌కు విరుద్ధంగా నిర్మాణం జరిగిందన్నారు. గతంలో కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరిన రేవంత్‌రెడ్డి ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కావొస్తున్నా కాళేశ్వరం, మేడిగడ్డ ఘటనలో ఏ ఒక్కరిపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతుందని లక్ష్మణ్ నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ 23 అంశాల్లో జవాబు చెప్పమని అడిగితే కేవలం 11 అంశాలకు మాత్రమే జవాబులు చెప్పి తప్పించుకుందని చెప్పారు.

క్లుప్తంగా...

సీఎం రేవంత్‌ను కలిసిన మాజీ డీఎస్పీ నళిని



సాక్షి, హైదరాబాద్: అప్పట్లో తెలంగాణ రాష్ట్రసాధన కోసం తన ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసిన మాజీ డీఎస్పీ నళిని శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు తిరిగి ఉద్యోగం ఇవ్వడంలో ఉన్న అడ్డంకులేంటని గతంలో పోలీసు అధికారులతో జరిగిన సమీక్షాసమావేశంలో సీఎం ప్రశ్నించారు. తిరిగి డీఎస్పీగా ఉద్యోగం ఇవ్వలేకపోతే అదేస్థాయిలో మరేదైనా ఉద్యోగం ఇచ్చే అంశంపైనా ఆలోచించాలని సీఎం సూచించిన సంగతి తెలిసిందే. అవసరమైతే తనను కలిసేందుకు నళినికి అవకాశం కల్పించాలని కూడా సీఎం అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలోనే నళిని శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు.

సీఎంతో ప్రముఖుల భేటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం నివాసంలో నటుడు అక్కినేని నాగార్జున, అమల దంపతులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సచివాలయంలో వేర్వేరుగా కలిసి అభినందించారు. సచివాలయంలో పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రులు నారాయణ స్వామి, వైద్య లింగం తదితరులు కూడా సీఎంను కలిసి అభినందించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కుటుంబ సభ్యులతో సీఎంను కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ రాకేశ్ మనోచా సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

స్విగ్గీ బాయ్ కుటుంబానికి సీఎం చేయూత

సాక్షి, హైదరాబాద్: ఫుడ్ డెలివరీ సందర్భంగా ప్రమాదవశాత్తు మృతిచెందిన స్విగ్గీ బాయ్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. నాలుగు నెలల కిందట స్విగ్గీ బాయ్ ఫుడ్ డెలివరీకోసం వెళ్లిన సమయంలో కుక్క వెంటపడటంతో భవనంపైనుంచి పడి అతను మృతిచెందిన విషయం తెలిసిందే. గతవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన గిగ్ వర్కర్స్ సమావేశంలో.. చనిపోయిన స్విగ్గీ డెలివరీ బాయ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించిన సీఎం, శనివారం మృతుని కుటుంబ సభ్యులను సచివాలయానికి పిలిపించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆ కుటుంబానికి ఏదైనా సాయం చేస్తుందని తాను ఎదురు చూశానని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వం రావడంతో ఆ కుటుంబ వివరాలు తెలుసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించగా, బాధిత కుటుంబాన్ని తీసుకువచ్చారని ఆయన వివరించారు. కాగా, ముఖ్యమంత్రికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం ప్రత్యేక కార్యదర్శిగా బి.అజిత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఓఎస్డీగా నియమితులైన బి.అజిత్‌రెడ్డి హోదాను సీఎంకు ప్రత్యేక కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు పెంపు

జనవరి 31 వరకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: విద్యాసంవత్సరం 2023-24కు సంబంధించి విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువును ఈ నెల 31 నుంచి జనవరి 31వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వకార్యదర్శి రాహుల్ బొజ్జ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్‌ల రెన్యువల్, కొత్త స్కాలర్‌షిప్‌ల కోసం ఈపాస్ వెబ్‌సైట్ http://telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

1 నుంచి దేశవ్యాప్తంగా జనసంపర్క్ అభియాన్

సాక్షి, హైదరాబాద్: జనవరి 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి పల్లె, ప్రతి పట్టణంలో జనసంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు శ్రీ పండరీనాథ్ చెప్పారు. ఆయన జనసంపర్క్ అభియాన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వర్ రెడ్డి, కో-కన్వీనర్ జగదీశ్వర్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్ సింగ్, నరసింహమూర్తితో కలిసి శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జనవరి 1 నుంచి 15 వరకు జనసంపర్క అభియాన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలు, రాములవారి చిత్రపటం, మందిరం నమూనా కరపత్రాన్ని ప్రతి ఇంటికి అందజేసేందుకు సర్వం సిద్ధం చేశామని వివరించారు.

మెట్రో రెండో దశకు ఐదేళ్లయినా రెడ్ సిగ్నలే!

లక్డీకాపూల్- బీహెచ్ఈఎల్, నాగోల్-ఎల్బీనగర్ పొడిగింపు పనులకు లభించని కేంద్రం అనుమతి

- 2018 నవంబర్‌లో డీపీఆర్ అయినప్పటికీ కేంద్రం కొర్రీలు
- కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా రూ. 8,453 కోట్లతో రెండోదశ మెట్రో
- ఇంకా మదింపు దశలోనే ఉందంటున్న కేంద్రం



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పనులకు ఇప్పట్లో మోక్షం లభించేలా లేదు. ప్రస్తుతం నడుస్తున్న మెట్రో రైలుకు రెండోదశ కింద చేపట్టే 26 కి.మీ. కారిడార్‌తోపాటు మరో 5 కి.మీ. పొడిగింపు పనులకే ఇంకా అనుమతి ఇవ్వకుండా కేంద్రం ఐదేళ్లుగా నాన్చుతోంది. కేంద్రం కొర్రీలకు బదులివ్వడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల అలసత్వం కూడా ఉండటంతో ఈ ప్రాజెక్టు ఎప్పటికి కార్యరూపం దాలుస్తుందో తెలియని పరిస్థితి. హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో ఓ వైపు మెట్రో అలైన్‌మెంట్‌ను పొడిగించాలనే డిమాండ్లు పెద్దఎత్తున వస్తుండగా, ప్రతిపాదిత అలైన్‌మెంట్లకే అనుమతి రాకపోవడంతో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ తల పట్టుకుంటోంది. రెండో దశ కింద లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ (26 కి.మీ) వరకు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ (5 కి.మీ)కు ప్రతిపాదించిన పొడిగింపు పనుల డీపీఆర్‌ను 2018 నవంబర్‌లోనే కేంద్రం ఆమోదానికి పంపగా, ఐదేళ్లయినా అతీగతీ లేదు. దీంతో రూ. 8,453 కోట్లతో రూపొందించిన ప్రాజెక్టు అంచనా రెండింతలు పెరిగిందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టాలని అప్పట్లో నిర్ణయించారు. రూ. 8,453 కోట్ల ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40% భరిస్తే, 60% మొత్తాన్ని రుణంగా తీసుకోవాలని నిర్ణయించారు. దీనిపై ఇటీవల సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం కింద సామాజిక కార్యకర్త ఇనగంటి రవికుమార్ సమాచారం కోరితే.. ఇంకా మదింపు దశలోనే ఉన్నట్లు కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ వెల్లడించడం గమనార్హం.

ఆది నుంచీ కొర్రీలే

2018 నవంబర్‌లో ఈ రెండోదశ పనులకు సంబంధించిన డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. 2021 వరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలో ఈ ఫైల్ ఏమాత్రం ముందుకు కదల్లేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రానికి లేఖ రాయగా.. కేంద్రం ఫీజబిలిటీ, రైడర్‌షిప్‌లను సరిచేసేందుకు 15 అంశాలను ప్రస్తావిస్తూ వాటికి వివరణ ఇవ్వాలంటూ 2022 డిసెంబర్ 1న లేఖ రాసింది. ఈ వివరాలు పంపితేనే డీపీఆర్‌ను ఆమోదిస్తామని తేల్చిచెప్పింది. కేంద్రం అడిగిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2023, ఫిబ్రవరి 28న కేంద్రానికి పంపింది. ఎస్‌పీవీ ఏర్పాటు, మినిమమ్ లోకల్ కంటెంట్, సమగ్ర రవాణా సర్వే, సవరించిన డీపీఆర్ అంచనాలను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ బెంచ్ మార్క్ ప్రకారం పూర్తి చేసి నివేదించారు. కానీ రాష్ట్ర కేబినెట్ ఆమోదం, దాని తీర్మానం కాపీని మాత్రం ఈ ఏడాది ఆగస్టు 8న అంటే కేంద్రం అడిగిన 9 నెలలకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది.

ఎయిర్‌పోర్టు మెట్రో ఇప్పట్లో లేనట్లే..

రెండో దశ డీపీఆర్‌కు ఇప్పటివరకు ఆమోదం లభించకపోవడంతో కొత్త మెట్రో ప్రతిపాదనలు అటకెక్కినట్టేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రూ. 6,250 కోట్ల నిధులతో పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలని నిర్ణయించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన కూడా చేశారు. కానీ కాంగ్రెస్ సర్కార్ పగ్గాలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత అలైన్‌మెంటును మార్చనున్నట్లు ప్రకటించారు. రాయదుర్గం నుంచి కాకుండా ఓల్డ్‌సిటీ నుంచి ఎల్బీనగర్ మీదుగా ఎయిర్‌పోర్టుకు కొత్త అలైన్‌మెంట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు మొదటిదశలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు పనులు చేపట్టని నేపథ్యంలో ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అలైన్‌మెంట్ ఎలా రూపొందిస్తారో వేచిచూడాల్సిందే.

ఇప్పటికీ కదలని ఫైలు

రెండో ప్రాజెక్టుకు సంబంధించి 2023-24 బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదని, 60 శాతం రుణం కోసం ఏజెన్సీని కూడా ఎంపిక చేయలేదని ఆర్టీఐ కింద కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికైనా రెండోదశ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం లభిస్తుందో లేదో తెలియడం లేదని మెట్రో వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఆమోదం లభించాక టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసేందుకు ఇంకెన్నేళ్లు పడుతుందోనని అంటున్నారు.



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు

త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు

- ఇప్పుడు అన్ని బస్సుల్లో 88 నుంచి వంద శాతం ఆక్యుపెన్సీ
- ఆర్టీసీ ఉద్యోగుల పీఎఫ్, సీసీఎస్ బకాయిలు త్వరలో విడుదల
- కొత్త బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎక్స్‌ప్రెస్, స్లీపర్ కమ్ సీటర్, రాజధాని ఏసీ బస్సులు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే 1000 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ బస్సుల్లో 500 గ్రేటర్ పరిధిలో, మరో 500 బస్సులు జిల్లాల్లో నడుపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించడంతో పాటు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల పీఎఫ్, సీసీఎస్ బకాయిలను వీలైనంత త్వరగా విడుదల చేస్తామని హామీనిచ్చారు. అత్యాధునిక హంగులతో అందుబాటులోకి తెచ్చిన కొత్త ఎక్స్‌ప్రెస్, లహరి స్లీపర్ కమ్ సీటర్, రాజధాని ఏసీ బస్సులను శనివారం ఎన్టీఆర్ మార్గ్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రారంభించారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి., హైదరాబాద్ సీపీ శ్రీనివాస రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్‌తో కలిసి ఆయన జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అందరూ కలిసి కొత్త బస్సులో కొద్దిసేపు ప్రయాణించారు.

జనవరి తర్వాత మరిన్ని బస్సులు

ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రస్తుతం 50 కొత్త బస్సులు అందుబాటులోకి రాగా, మిగతా ఏసీ, నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, రాజధాని బస్సులు జనవరి చివరి నాటికి, ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సులు జూన్ నాటికి అందు బాటులోకి వస్తాయని చెప్పారు. ఇప్పుడు అన్ని బస్సుల్లో 88 నుంచి వంద శాతం ఆక్యుపెన్సీ పెరి గిందని, మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి ఇప్పటి వరకు 20 రోజుల్లో 6 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో 92 ఏసీ, నాన్‌ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు, 46 ఏసీ రాజధాని, 912 ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులతో మొత్తం 1,050 బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

'కష్టపడి మంచిపేరు తెండి'

సాక్షి, హైదరాబాద్: కష్టపడి పనిచేసి నీటిపారుదలశాఖకు మంచి పేరు తేవాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. సచివాలయంలో శనివారం తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కీసర' భూములపై విచారణ జరిపించండి: వీహెచ్


సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండలం కీసర దాయర గ్రామంలోని ఎస్సీ పేదలకు కేటాయించిన భూములను సంపన్నులకు ధారాదత్తం చేయడంపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఇందిరాగాంధీ హయాంలో గ్రామంలోని 10 మంది దళిత పేద కుటుంబాలకు 94 ఎకరాల భూమిని కేటాయించారని పేర్కొన్నారు. సదరు పట్టాదారులు మరణించిన తర్వాత ఆ భూముల రికార్డులు మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాజేశారని వివరించారు. ఆ భూమిలో నిర్మించిన విల్లాలను ఒక్కొక్కటి రూ.రెండున్నర కోట్లకు అమ్ముకుంటుంటే అసలైన పట్టాదారుల కుటుంబాలు పూట గడవక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

గుండెపోటు ముప్పు పెంచిన కరోనా

కోవిడ్ సమయంలో పెరిగిన 18-45 మధ్య వయస్కుల మరణాలు

ఆల్కహాల్, సిగరెట్, కుటుంబ నేపథ్యం.. ఆపై కోవిడ్

- 19 రాష్ట్రాల్లోని 47 మెడికల్ కాలేజీల్లో ఐసీఎంఆర్ అధ్యయనం
- కరోనాతో ఆసుపత్రులపాలైన యువతకు రిస్క్ ఎక్కువున్నట్లు గుర్తింపు
- వ్యాక్సిన్ తీసుకున్న అనేకమంది గుండెపోటు నుంచి బయటపడిన వైనం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా 18-45 మధ్య వయస్కుల గుండెపోటు మరణాలు సాధారణంగా ఏడాదికి లక్షకు నాలుగు ఉంటాయి. కానీ కరోనా కాలంలో ఈ సంఖ్య పెరిగింది. సాధారణ రోజులతో పోలిస్తే కరోనా కాలంలో యువతీ యువకులు అత్యధికంగా ఆకస్మిక గుండెపోటుకు గురై చనిపోయారు. దీనిపై భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) శాస్త్రీయ అధ్యయనం చేసింది. దీని ప్రకారం కరోనా రాని యువకులతో పోలిస్తే వైరస్ సోకిన వారు మొదటి వారంలో గుండెపోటుకు గురయ్యే అవకాశం మూడు రెట్లు ఎక్కువ ఉంది. అదే రెండో వారంలో రెండున్నర రెట్లు, 30 రోజుల తర్వాత రెండు రెట్లు ఎక్కువ అవకాశం ఉన్నట్లు తేలింది. ఆల్కహాల్, సిగరెట్, డ్రగ్స్, మితిమీరిన వ్యాయామం లాంటి కారణాలతో పాటు కరోనా సోకడం యువతకు ముప్పు పెంచిందని నిర్ధారించింది. ముఖ్యంగా కోవిడ్ వ్యాక్సిన్ వల్ల మరణాలు సంభవించలేదని అధ్యయనం తేల్చింది. పైగా వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకున్నవారిలో ఆకస్మిక మరణాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించింది.

31.6% మంది వ్యాక్సిన్ తీసుకోలేదు

మరణించిన 729 యువకుల్లో 31.6 శాతం మంది అసలు వ్యాక్సిన్ తీసుకోలేదు. కోవిడ్‌తో ఆసుపత్రుల్లో చేరినవారు 2.3 శాతం మంది ఉన్నారు. అందులో పొగతాగేవారు 26 శాతం ఉన్నారు. ఆల్కహాల్ తీసుకునేవారు 27 శాతం ఉన్నారు. చనిపోవడానికి 48 గంటలకు ముందు మితిమీరి ఆల్కహాలు తీసుకున్నవారు 7 శాతం ఉన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్ తీసుకున్నవారు 1.7 శాతం ఉన్నారు. ఏ రకమైన వ్యాయామం చేయనివారు 81 శాతం, 48 గంటలకు ముందు మితిమీరిన శారీరక శ్రమ లేదా అధిక వ్యాయామం చేసినవారు 3.5 శాతం ఉన్నారు. సాధారణ వ్యాయామం చేసినవారు 16 శాతం ఉన్నారు. ఆకస్మికంగా మరణించిన ఆ యువకులకు చెందిన 10 శాతం మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు. అంటే గుండెపోటుకు సంబంధించి కుటుంబ చరిత్ర ఉన్నవారు అన్నమాట. కుటుంబ సభ్యులంటే తల్లి, తండ్రి, తోబుట్టువులని ఐసీఎంఆర్ పేర్కొంది. కోవిడ్‌తో ఆసుపత్రిలో చేరిన యువకుల్లో సాధారణ పరిస్థితులతో పోలిస్తే ఆకస్మిక మరణాలు నాలుగు రెట్లు అధికంగా సంభవించాయి. 48 గంటలకు ముందు మితిమీరిన మద్యం తీసుకుంటే మరణాలు ఆరు రెట్లు ఎక్కువ. విపరీతమైన శారీరక శ్రమ చేయడం వల్ల మూడు రెట్లు రిస్క్ ఎక్కువగా ఉంది. డ్రగ్స్‌తో నాలుగు రెట్లు, పొగతాగడం వల్ల రెండు రెట్లు రిస్క్ ఎక్కువగా ఉంది. వ్యాయామం చేస్తున్నప్పుడు సాధారణంగా రెండు నిమిషాల్లోనే శ్వాస అదుపులోకి వస్తుంది. కానీ 10 నిమిషాల పాటు కొనసాగితే దాన్ని మితిమీరిన వ్యాయామం అంటారు. అటువంటి వారిలో మరణాలు సంభవించాయి.

వ్యాక్సిన్ వల్ల గుండెపోట్లు తగ్గాయి...

కోవిడ్ వ్యాక్సిన్ వల్ల యువకులు ఆకస్మిక మరణాలకు గురైనట్లు మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఐసీఎంఆర్ వీటిపైనా అధ్యయనం చేసింది. వార్తల్లో కథనాలను ఆధారంగా చేసుకొని పరిశోధన కొనసాగించింది. కోవిడ్ వ్యాక్సిన్ వల్ల మరణాలు సంభవించలేదని తేల్చింది. పైగా వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకున్నవారిలో ఆకస్మిక మరణాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించింది.

ఆకస్మిక మరణాలపై అధ్యయనం

దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లోని 47 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆసుపత్రుల పరిధిలో ఐసీఎంఆర్ పరిశోధన చేసింది. 2021 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు కరోనా కాలంలో యువకుల ఆకస్మిక మరణాలపై అధ్యయనం చేసింది. ఆయా కాలేజీల పరిధిలో 18-45 ఏళ్ల వయస్సులో గుండెపోటుతో మరణించిన 29,171 మంది యువకుల్లో 729 మందిపై ప్రత్యేకంగా పరిశోధన చేసింది. వారి మరణాలకు కారణాలపై డేటా సేకరించి విశ్లేషించింది. నాలుగింట మూడొంతుల మంది మరణాల వివరాలను ప్రత్యక్ష సాక్షుల నుంచే తీసుకుంది.

కరోనా సామాజికంగా కూడా దెబ్బతీసింది



అలవాటు లేని శారీరక శ్రమ, వ్యాయామం అతిగా చేయడం వల్ల యువకుల్లో ఆకస్మిక మరణాలు సంభవించాయి. తీవ్రమైన ఒత్తిడి, దీర్ఘకాలిక జబ్బులు కూడా దోహదపడ్డాయి. కోవిడ్ అనేది సాధారణ జబ్బే కాదు. అది సామాజికంగా కూడా దెబ్బతీసింది. ఉద్యోగం కోల్పోవడం లాంటివి పరోక్షంగా ప్రభావం చూపించాయి. మరోవైపు మానసిక రుగ్మతలు 25 శాతం పెరిగాయి. వదంతులు, ప్రచారాలు కూడా ప్రజలపై మానసికంగా ప్రభావం చూపాయి. – డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

షకీల్ కుమారుడి కేసులో సీఆర్‌పీసీని పాటించండి: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌కు సంబంధించి నమోదైన హిట్ అండ్ రన్ కేసులో సీఆర్‌పీసీ చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 29వ తేదీకి వాయిదా వేసింది. గతవారం ప్రగతిభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీకొన్న కేసులో సాహిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఆయన పరారీలోనే ఉన్నాడు. దుబాయ్ పారిపోయి ఉంటాడనే అనుమానంతో లుక్‌ఔట్ నోటీసు జారీచేశారు. ఈ కేసులో సాహిల్ స్నేహితులైన తమను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి వేధిస్తున్నారని సయ్యద్ జక్రియా రెహమాన్, మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. దీనికి సంబంధించిన వివరాలను తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ ప్లీడర్‌ని ఆదేశించింది.

రాహుల్‌ను ప్రధానిగా చేయడమే లక్ష్యం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల అనంతరం రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 స్థానాల్లో గెలుపే ధ్యేయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేయాలని ఆయన కోరారు. శనివారం గాంధీభవన్‌లో మల్కాజ్‌గిరి, చేవెళ్ల, హైదరాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గాల యూత్ కాంగ్రెస్ నేతలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం పనితీరుపై కూడా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామస్థాయికి వెళ్లి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

15 మంది బీజేపీ జిల్లా అధ్యక్షుల మార్పు?

బీజేపీలో సంస్థాగత మార్పు చేర్పులపై కిషన్‌రెడ్డి కసరత్తు

- ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి షోకాజ్‌లు
- పదవుల్లో ఉండి బాధ్యతలు నిర్వహించని వారికి కూడా..
- ఆరోపణల తీవ్రతను బట్టి సస్పెన్షన్లు ఉంటాయన్న వాదనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పార్టీలో సంస్థాగతంగా చేపట్టాల్సిన మార్పుచేర్పులపై కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దృష్టి పెట్టారు. దీర్ఘకాలికంగా కొనసాగుతుండడంతో పాటు ఎప్పటికప్పుడు పార్టీ అప్పగించిన బాధ్యతలను సరిగ్గా నిర్వహించని జిల్లా అధ్యక్షుల మార్పు దిశగా కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ పరంగా రాష్ట్రాన్ని 38 జిల్లాలుగా విభజించినందున, వీటిలో 15 నుంచి 20 జిల్లాలకు చురుగ్గా పనిచేసే కొత్త అధ్యక్షుల నియామకం దిశగా చర్యలు చేపట్టనున్నట్టు సమాచారం. పలువురు జిల్లా అధ్యక్షులు దాదాపు నాలుగేళ్ల పాటు కొనసాగుతున్నందున పనితీరు, అప్పగించిన విధులు, బాధ్యతల నిర్వహణ, ఎన్నికల సందర్భంగా నిర్వహించిన పాత్ర తదితర అంశాల ప్రాతిపదికన మార్పు చేర్పులకు శ్రీకారం చుట్టనున్నట్టు చెబుతున్నారు. శనివారం పార్టీనాయకులతో కిషన్‌రెడ్డి సమావేశమైన సందర్భంగా సంస్థాగత మార్పులకు సంబంధించిన కసరత్తును మొదలుపెట్టినట్టు సమాచారం.

ఇక కిషన్‌రెడ్డి టీం?

వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో...పకడ్బందీగా పనిచేసి మంచి ఫలితాలు సాధించేందుకు తన టీమ్‌ను నియమించుకునే దిశగా కిషన్‌రెడ్డి చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా 17 ఎంపీ స్థానాల పరిధిలో పార్లమెంట్ కమిటీలను నియమించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలసమయంలో పార్టీ కోసం సరిగ్గా పనిచేయని వారు, బీజేపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, దీర్ఘకాలికంగా జిల్లా అధ్యక్షులు, ఇతర బాధ్యతల్లో ఉన్న వారు, పార్టీ కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని మార్చాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి షోకాజ్‌లు..

శాసనసభ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారితో పాటు అప్పగించిన బాధ్యతలు సరిగా నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించిన పలువురికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు జారీచేసింది. వీరిలో ఇద్దరు ముగ్గురు జిల్లా అధ్యక్షులతో పాటు పదిమంది వరకు రాష్ట్ర స్థాయి నాయకులు ఉంటారని తెలుస్తోంది. ఈ నోటీసులపై వారం, పదిరోజుల్లో వివరణ అందాక ఆరోపణల తీవ్రతను బట్టి సస్పెన్షన్లు, ఇతర చర్యలు ఉంటాయని చెబుతున్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో కమిటీ చైర్మన్ ఎం.ధర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కన్వీనర్ రవీందర్ విశ్వనాథ్, సభ్యులు నాగూరావు నామాజీ, పద్మజా రెడ్డి, బోసుపల్లి ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల నాయకులపై వచ్చిన ఫిర్యాదులను ఈ కమిటీ పరిశీలించింది.



అడుగుడి... మీకియ్యబడును!
వెదకుడి... మీకు దొరకును!!
తట్టుడి... మీకు తీయబడును!!
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.చవితి ఉ.10.11 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మఖ పూర్తి (24 గంటలు). **వర్జ్యం:** సా.6.01 నుండి 7.45 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.08 నుండి 4.56 వరకు, **అమృతఘడియలు:** తె.4.36 నుండి 6.22 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.28
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీశ్ కుమార్ (బిహార్ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

పాత స్నేహమే ఇద్దరి మధ్య కొత్తగా గాఢం అవుతోందంటే, ఆ ఇద్దరిలో ఒకరికి మునుపు వేరెవరితోనో ఉన్న గాఢమైన స్నేహం ఎక్కడో పెళుసు బారిందనే!

మనుమలు ఊరికే స్నేహాన్ని వెతుక్కుంటూ పోతారా గౌతమ బుద్ధుడు ఇల్లొదిలి వెళ్లినట్లు? లేదంటే, ఊరికే స్నేహాన్ని వెతుక్కుంటూ వస్తారా ఇంట్లో అందర్నీ కాదనుకుని వచ్చేసినట్లు? వెనుక ఏదో ఉంటుంది. ఎవరో ఉంటారు.

లలన్‌జీ, లాలూజీల మధ్య పాత స్నేహమే మళ్లీ కొత్తగా వికసించి, విప్పారడాన్ని నేను గమనించాను కానీ అనుమానించలేదు. ఎందుకు అనుమానించాలి?! లలన్‌జీ నా పార్టీకి జాతీయ అధ్యక్షుడు. లాలూజీ నేను సీఎం కావడానికి తన పార్టీ చేత మద్దతు ఇప్పించిన వారు.

కానీ ఇప్పుడనిపిస్తోంది! నాయకుడికి తనవాళ్లపై నమ్మకం ఎంతుండాలో అనుమానమూ అంతుండాలి. లాలూజీ తన కొడుకుని సీఎంని చేయడానికి లలన్‌జీతో కొత్తగా స్నేహం చెయ్యడం తప్పు కాదు.



లలన్‌జీ నన్ను సీఎంగా తప్పించడానికి లాలూజీతో రహస్యంగా స్నేహం చెయ్యడం తప్పు. అంతకన్నా తప్పు... ఇంట్లో మనిషే కదా అని లలన్‌జీని నేను అనుమానించక పోవటం!

ఆర్జేడీకి 75 మంది ఎమ్మెల్యేలు ఉన్నా కూడా 45 మంది మాత్రమే ఎమ్మెల్యేలు ఉన్న జేడీయూకి సీఎం పోస్టు ఇచ్చారు కనుక లాలూజీ నాకు వ్యతిరేకంగా లలన్‌జీతో చేయి కలపడం రాజకీయమే తప్ప ద్రోహం కాదు.

జేడీయూకి ఉన్న 45 మంది ఎమ్మెల్యేల నుంచి 10–12 మంది ఎమ్మెల్యేలను ఆర్జేడీలోకి లీల్చి, లాలూజీ కొడుకుని సీఎం చేయడానికి లలన్‌జీ లాలూజీ చేయి అందుకోవటం ద్రోహమే తప్ప రాజకీయం కాదు.

"నితీశ్‌జీ! 18 ఏళ్లుగా మీరు సీఎంగా ఉంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి 74 ఏళ్లు. ఆ పై ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 వచ్చేస్తాయి మీకు. ఇకనైనా మీరు మీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌ని సీఎంని చేసి, మీరు తేజస్వీ యాదవ్‌కి డిప్యూటీ సీఎంగా ఉంటే బాగుంటుందని మన వాళ్లంతా అభిప్రాయ పడుతున్నారు..." అని లలన్‌జీ అన్నప్పుడే నేను ఆయన్ని అనుమానించాల్సింది!

తేజస్వీయాదవ్‌కి సీఎం సీటును అప్పగించడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ పద్దెనిమిదేళ్లుగా నేను సీఎంగా ఉంటూ రావడం అన్నది లలన్‌జీకి ఎందుకు అభ్యంతరం అయినట్లు?!

"ఎందుకిలా మారిపోయారు లలన్‌జీ!" అని ఆవేదనగా అడిగాను.

రఫీ మార్గ్‌లోని విఠల్‌భాయ్ హౌస్‌లో ఉన్న 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్' లో కూర్చొని ఉన్నాం... నేను, లలన్ సింగ్. పట్నా ఫ్లయిట్‌కి మాకింకా సమయం ఉంది.

రాత్రి 11.30 వరకు ఉంటుంది కాన్‌స్టిట్యూషన్ క్లబ్. మీటింగ్‌లు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, కార్యవర్గ సమావేశాలు, ఈవెంట్‌లు జరుగుతుంటాయి అక్కడ.

అంతక్రితమే క్లబ్‌లో జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశంలోనే లాలూజీతో తన తాజా స్నేహపు గాఢతకు పరిహారంగా లలన్‌జీ తన పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది.

"బాగానే ఉన్నాం కదా లలన్‌జీ! లాలూజీతో కలిసి ఎందుకలా ప్లాన్ చేశారు? ఎందుకు మనిద్దరం కూర్చున్న కొమ్మను నేనున్న వైపు నరకబోయారు?!" అని అడిగాను.

ఆయనేం మాట్లాడలేదు! పట్నా ఫ్లయిట్‌లో మాట్లాడలేదు. పట్నాలో దిగాకా మాట్లాడలేదు. నేను ఇంటికి చేరుకున్నాక ఆయన్నుంచి ఫోన్ వచ్చింది!

"దేశానికి మీరొక కొత్త ముఖం అవాలని ఆశిస్తున్నట్లే, బిహార్‌కి కూడా మీరొక కొత్త ముఖం ఇస్తే బాగుంటుందని నేను ఆశపడ్డాను నితీశ్‌జీ. కొత్త సంవత్సరం అంటే లోపలికి కొత్త ముఖం రావటం మాత్రమే కాదు, అంతకంటే ముందు పాత ముఖం బయటికి పోవడం కూడా..." అన్నారు లలన్ సింగ్!!

ఆ పేరే ప్రభంజనం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఆ పేరే ఇప్పుడొక సూపర్ బ్రాండ్. జగనన్న అనే నాలుగక్షరాలు ప్రభంజనానికి పర్యాయపదంగా మారిన వైనాన్ని మనం ఆంధ్రప్రదేశ్‌లో చూడవచ్చు. గనిలో వనిలో కార్ఖానాలో... అన్నట్టుగా ప్రతి జీవనరంగంలోనూ ఈ ప్రభంజనపు వికాసాన్ని మనం కాంచవచ్చు. ఊరూవాడ, పొలమూ పుట్ర, బడీగుడి, ఆస్పత్రీ ఆఫీసూ... ఇలా ప్రతిచోటా మారాకు తొడుగుతున్న మార్పులను మనం గమనించవచ్చు.

ఈ మార్పులు నిస్సహాయులను నిటారుగా నిలబెడుతున్నాయి. పేదవర్గాల భుజాలకు హక్కుల అమ్ములపొదులను తొడిగి సాయుధం చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని కబ్జా చేసి తమను దగా చేసిన పెత్తందార్లపై యుద్ధానికి పేద వర్గాలను సమాయత్తపరిచేవిగా ఉన్నాయి. నాటి విప్లవకారులు పాడుకున్న పాటొకటి గుర్తుకొస్తున్నది. ''విప్పపూల చెట్ల సిగల దాచిన విల్లమ్ములు నీకిస్త తమ్ముడా, నీకిస్తా తమ్ముడా... రాయలసీమ రాళ్లలోని రతనాలను మాలలల్లి నీకిస్త తమ్ముడా, నీకిస్తా తమ్ముడా.'' ఈ స్ఫూర్తిని ఇప్పుడు మనం ఆంధ్రప్రదేశ్‌లో రాజ్య ప్రాయోజిత సాధికార రథయాత్రల్లో వీక్షించవచ్చు.

''వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే నేను''... అంటూ ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి నాలుగు సంవత్సరాల ఏడు మాసాలు గడిచాయి. ముఖ్యమంత్రి హోదాలో వందలాది సభల్లో ఆయన పాల్గొన్నారు. జనం సమక్షంలోనే సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేస్తున్నారు. వేలాదిమంది సహాయార్థులను విడివిడిగా కలిసి వారి బాధలు విన్నారు. వారి కన్నీళ్లు తుడిచారు. ఇంతగా నిరంతరం జనంలో తిరుగాడినప్పటికీ ఆయన జనాకర్షణ చెక్కుచెదరలేదు. పైగా పెరిగింది. ఆయన జనంతో మమేకమయ్యే వీడియో ఫుటేజీలు సోషల్ మీడియాలో విస్తారంగా దొరుకుతాయి. సెల్ఫీలకోసం ఎగబడేవారు, లాఠీల నెదిరించి బ్యారికేడ్లు దూకేవాళ్లు, 'జగనన్నా' అంటూ ఎలుగెత్తేవాళ్లు, కిలోమీటర్ల పొడవునా రోడ్ల పక్కన, మిద్దెల మీద నిలబడి కేరింతలు కొట్టేవాళ్లు ఇప్పుడింకా పెరిగారు. వేలాదిమంది పాల్గొన్న సభల్లో జనతరంగ విన్యాసాలు, మెక్సికన్ వేవ్స్ ఇంకా కనిపిస్తున్నాయి.

సాధారణంగా ఐదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రభుత్వాల మీద అంతో ఇంతో అసంతృప్తి కనిపిస్తుంది. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉన్నది. మరోసారి టిక్కెట్ దొరకదని ఖాయంగా తెలిసినవాళ్లలో, సొంత పనులు చక్క బెట్టుకోవడం కుదరని నాయకుల్లో అసంతృప్తి కనిపిస్తున్నది కానీ, జనబాహుళ్యంలో మాత్రం పాజిటివ్ వైబ్రేషన్స్ ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ఈ పిడికెడుమంది అసంతృప్తిపై వైడ్ యాంగిల్ వేసి చూపెడుతున్న యెల్లో మీడియా లక్షలాదిమంది సంతృప్తిపై సిరా మరకలు రుద్ది దాచేసే ప్రయత్నం చేస్తున్నది.

ప్రజాదరణ రేటింగ్ విషయంలో జాతీయ సంస్థల సర్వేల్లో జగన్‌మోహన్‌రెడ్డి దరిదాపుల్లో కూడా మన 'ఫార్టీ ఫైవ్ ఇయర్స్ ఇండస్ట్రీ' లేరు. 'ఇండియా టుడే' వారు గత జనవరిలో చేసిన సర్వేలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ 56 శాతంగా ఉంటే, ఈ డిసెంబర్‌లో 58 శాతానికి పెరిగింది. తాజా సర్వేల్లో మన విజనరీ లీడర్‌కు 36 శాతం, క్వశ్చన్ మార్క్ లీడర్‌కు 7 శాతం జనాదరణ ఉన్నట్టు తేలింది. క్షేత్రస్థాయిలో పర్యటించి జనం గుండెచప్పుళ్లు వింటే ఈ తేడా ఇంకా ఎక్కువగా తెలుస్తుంది.

371 కోట్ల రూపాయల ధనాన్ని సర్కారు ఖజానా నుంచి సొంతానికి దారి మళ్లించిన స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు యాభై రెండు రోజులు జైల్లో గడిపారు. ఈ జైలు జీవితం వల్ల రాష్ట్రంలో సానుభూతి గంగ ఉప్పొంగి ప్రవహిస్తుందని తెలుగుదేశం, యెల్లో మీడియాలు బోలెడు ఆశలు పెట్టుకున్నాయి. 'టైమ్స్ నౌ' వాళ్లు ఆయన జైల్లో ఉన్న సమయంలోనే సర్వే చేసి రాష్ట్రంలోని 25 లోక్‌సభ సీట్లకు గాను వైసీపీ 24 నుంచి 25 గెలుచుకుంటుందని తేల్చేశారు. టీడీపీకి సున్నా నుంచి వస్తేగిస్తే ఒక సీటు రావచ్చని చెప్పారు. ఎన్నికల భాషలో దాన్నే 'ఊడ్చేయడం' అంటారు. ఇదీ వాస్తవ రాజకీయ పరిస్థితి.

కేవలం తెలుగుదేశం – జనసేన కలిసి పోరాడినంత మాత్రాన వైసీపీని ఓడించడానికి బలం చాలదు. సమస్త రాజకీయ శక్తుల ఓట్లు చీలకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడేలా చూడాలి. 50 శాతానికి పైగా ఉన్న వైసీపీ ఓట్లలో సాధ్యమైనంత మేరకు కోత పెట్టాలి. ఇప్పుడు బాబు కూటమి ఆ ప్రయత్నాల్లో తల మునకలై ఉన్నది. వీళ్లెంతటి వికృతమైన, జుగుప్సాకరమైన ఆలోచనలో పరిశీలించండి. తెలుగుదేశం – జనసేన కూటమికి బీజేపీ తోడవ్వాలి. మరోపక్క కాంగ్రెస్ – కమ్యూనిస్టులు కలిసి వీరి సలహాల మేరకు అవగాహనతో పని చేయాలి. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కర్ణాటక, గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహకారం అందించిన సంగతి బహిరంగ రహస్యమే. అందువల్ల రాహుల్‌తో ఏర్పడిన సత్సంబంధాలను ప్రస్తుత అవసరాలకు బాబు వినియోగించుకుంటున్నారని సమాచారం. 22 మంది ఏపీ కాంగ్రెస్ నాయకులను ఢిల్లీకి పిలిపించుకొని కాంగ్రెస్ పెద్దలు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ పదేళ్లలో ఢిల్లీ పెద్దలు ఏపీ కాంగ్రెస్ మీద ఈ మాత్రం శ్రద్ధ పెట్టడం ఇదే ప్రథమం.

ఏపీలో గెలవడం గురించి కంటే ఓట్ల శాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని ఈ సమావేశంలో రాహుల్ రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఆదేశించారట! ఈ సందేశాన్ని చంద్రబాబు రాజకీయ భాషలోకి తర్జుమా చేస్తే వైసీపీ ఓట్లను చీల్చడం మీద దృష్టి పెట్టాలి. సీనియర్ మోస్ట్ నాయకుడైన చంద్రబాబు రాజకీయ ఆలోచనలు ఈ విషయంతో పట్టాలు తప్పినట్టు మనకు బోధపడుతున్నది. ఎందుకంటే రెండు మూడు బలమైన ప్రతిపక్షాలున్నప్పుడు ప్రభుత్వ నెగెటివ్ ఓటు చీలుతుంది. ఆ చీలికను నివారించడం కోసం ప్రతిపక్షాలు ప్రయత్నిస్తాయి. కానీ ప్రభుత్వ పాజిటివ్ ఓటు ఎట్టి పరిస్థితుల్లో చీలదు. అలా చీలిన దాఖలాలూ లేవు. కాంగ్రెస్ ద్వారా పాజిటివ్ ఓటును చీల్చాలనే బాబు ఆలోచన ఆయన నిస్పృహకు నిదర్శనంగానే భావించాలి.

ఢిల్లీ సమావేశంలో రాహుల్‌గాంధీ మరో సూచన కూడా చేశారు. పార్టీలోకి ఎవరు చేరుతానన్నా ఆహ్వానించాలనీ, అలా ఆహ్వానించకపోతే నష్టపోతామనీ హితవు చెప్పారట! ఏపీ ప్రజల దృష్టిలో రాష్ట్ర విభజన పాపాన్ని మూటగట్టుకొని ఒక్క శాతం ఓటు కూడా లేని దుస్థితికి చేరుకున్న పార్టీలో చేరడానికి పరుగు పరుగున వస్తున్న వారెవరో? ఎక్కడా టిక్కెట్ దొరక్క ఏదో ఒక బీ–ఫామ్ కోసం ఎవరైనా వస్తే రావచ్చు. ఇంకేదైనా తెర వెనుక వ్యూహంలో భాగంగా మరెవరైనా రావచ్చు. వారు చూపగలిగే ప్రభావం శూన్యం.

ఇక బీజేపీ కూడా తమ పొత్తులో భాగస్వామి కావాలన్న కోర్కె టీడీపీ – జనసేనలదే తప్ప బీజేపీది కాదు. పొత్తు కుదిరి పోయిందన్న ప్రచారం వెనుక తెలుగుదేశం పార్టీ హస్తమున్నదని బీజేపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. రాష్ట్ర బీజేపీలోని ఒక వర్గం పొత్తుకు అనుకూలంగా పనిచేస్తున్న మాట వాస్తవమే. వారు అధిష్ఠానానికి ఈ మేరకు పిటిషన్లు పెడుతున్న మాట కూడా నిజమే! అయితే చంద్రబాబు నమ్మదగిన వ్యక్తి కాదని బీజేపీ జాతీయ నాయకుల నిశ్చితాభిప్రాయం. పొత్తును వారు ఇంత వరకూ ఆమోదించలేదు. కానీ చంద్రబాబు పార్టీ మాత్రం పొత్తు కుదిరిపోయిందన్న కథనాన్ని తయారుచేసింది. యెల్లో మీడియా విశ్వసనీయత అడుగంటిన నేపథ్యంలో ఈ కథనాన్ని నడపడానికి ఇంకో తటస్థ ఛానల్‌ను ఆ పార్టీ ఎంచుకున్నదని బీజేపీ వారి పరిశీలనలో తేలింది.

స్కోరింగ్‌ల మీద, బ్రేకింగ్‌ల మీద న్యూస్ ఛానెళ్లకు సహజంగా ఉండే ఆసక్తిని అవకాశంగా తీసుకుని, ఇది పక్కా సమాచారమని నమ్మబలికి, ఓ ప్రముఖ ఛానల్‌లో టీడీపీ కథనం ప్రసారమయ్యేట్లు వ్యూహాన్ని రచించారు. దీని వెనకో పిట్ట కథ ఉన్నది. మొన్న బెంగళూరు ఎయిర్‌పోర్టులో కర్ణాటక కాంగ్రెస్ స్ట్రాంగ్ మ్యాన్ డీకే శివకుమార్, చంద్రబాబు తారసపడ్డారు. పక్కనున్న సెక్యూరిటీ, వ్యక్తిగత సిబ్బందికి దూరంగా వెళ్లి ఇద్దరే చాలాసేపు మాట్లాడుకున్నారు. బాబు గ్రహచారం బాగాలేక ఈ వార్త, ఫోటో మీడియాలో ప్రముఖంగా వచ్చేసింది. దాంతో బాబుకు ముచ్చెమటలు పట్టాయట! దీన్ని పూర్వపక్షం చేయడం కోసం బీజేపీతో పొత్తు కహానీని సిద్ధంచేసి ఒక తటస్థ ఛానెల్‌పైకి గురిపెట్టి విసిరారు. ఈ కథనం ప్రకారం ఏపీ బీజేపీ కార్యకర్తల అభిప్రాయ సేకరణలో టీడీపీతో పొత్తు వుండాలనే అంశానికి మద్దతు లభించిందట! దీనిపై రాష్ట్ర నాయకత్వం ఒక రిపోర్టు తయారుచేసి జాతీయ నాయకత్వానికి పంపించిందట! ఇందులో బీజేపీకి పది నుంచి పన్నెండు, జనసేనకు 20 సీట్లు ఇవ్వాలని ప్రతిపాదించారట! కన్నపు దొంగలు ఇక్కడే దొరికి పోయారు. నిజంగానే బీజేపీ వాళ్లు లేఖ రాస్తే జనసేనకు, తమకూ కలిపి ముచ్చెంగా 30 సీట్లే అడుగుతారా! కనీసం 70 సీట్లు అడిగేవారు. జనసేనకు 20 సీట్లే అని చెబుతున్న టీడీపీ వైఖరికి తగినట్టుగానే 'బీజేపీ లేఖ' ఉండటం ఆసక్తికరం.



సాధారణంగా ఐదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రభుత్వాల మీద అంతో ఇంతో అసంతృప్తి కనిపిస్తుంది. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉన్నది. మరోసారి టిక్కెట్ దొరకదని ఖాయంగా తెలిసిన వాళ్లలో, సొంత పనులు చక్క బెట్టుకోవడం కుదరని నాయకుల్లో అసంతృప్తి కనిపిస్తున్నది కానీ, జనబాహుళ్యంలో మాత్రం పాజిటివ్ వైబ్రేషన్స్ ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ఈ పిడికెడుమంది అసంతృప్తిపై వైడ్ యాంగిల్ వేసి చూపెడుతున్న యెల్లో మీడియా లక్షలాదిమంది సంతృప్తిపై సిరా మరకలు రుద్ది దాచేసే ప్రయత్నం చేస్తున్నది.

ప్రజాదరణ రేటింగ్ విషయంలో జాతీయ సంస్థల సర్వేల్లో జగన్‌మోహన్‌రెడ్డి దరిదాపుల్లో కూడా మన 'ఫార్టీ ఫైవ్ ఇయర్స్ ఇండస్ట్రీ' లేరు. 'ఇండియా టుడే' వారు గత జనవరిలో చేసిన సర్వేలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ 56 శాతంగా ఉంటే, ఈ డిసెంబర్‌లో 58 శాతానికి పెరిగింది. తాజా సర్వేల్లో మన విజనరీ లీడర్‌కు 36 శాతం, క్వశ్చన్ మార్క్ లీడర్‌కు 7 శాతం జనాదరణ ఉన్నట్టు తేలింది. క్షేత్రస్థాయిలో పర్యటించి జనం గుండెచప్పుళ్లు వింటే ఈ తేడా ఇంకా ఎక్కువగా తెలుస్తుంది.

బీజేపీ కూడా తమ పొత్తులో భాగస్వామి కావాలన్న కోర్కె టీడీపీ – జనసేనలదే తప్ప బీజేపీది కాదు. పొత్తు కుదిరి పోయిందన్న ప్రచారం వెనుక తెలుగుదేశం పార్టీ హస్తమున్నదని బీజేపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. రాష్ట్ర బీజేపీలోని ఒక వర్గం పొత్తుకు అనుకూలంగా పని చేస్తున్న మాట వాస్తవమే. వారు అధిష్ఠానానికి ఈ మేరకు పిటిషన్లు పెడుతున్న మాట కూడా నిజమే! అయితే చంద్రబాబు నమ్మదగిన వ్యక్తి కాదని బీజేపీ జాతీయ నాయకుల నిశ్చితాభిప్రాయం. పొత్తును వారు ఇంత వరకూ ఆమోదించలేదు. కానీ చంద్రబాబు పార్టీ మాత్రం పొత్తు కుదిరిపోయిందన్న కథనాన్ని తయారుచేసింది. యెల్లో మీడియా విశ్వసనీయత అడుగంటిన నేపథ్యంలో ఈ కథనాన్ని నడపడానికి ఇంకో తటస్థ ఛానల్‌ను ఆ పార్టీ ఎంచుకున్నదని బీజేపీ వారి పరిశీలనలో తేలింది.

స్కోరింగ్‌ల మీద, బ్రేకింగ్‌ల మీద న్యూస్ ఛానెళ్లకు సహజంగా ఉండే ఆసక్తిని అవకాశంగా తీసుకుని, ఇది పక్కా సమాచారమని నమ్మబలికి, ఓ ప్రముఖ ఛానల్‌లో టీడీపీ కథనం ప్రసారమయ్యేట్లు వ్యూహాన్ని రచించారు. దీని వెనకో పిట్ట కథ ఉన్నది. మొన్న బెంగళూరు ఎయిర్ పోర్టులో కర్ణాటక కాంగ్రెస్ స్ట్రాంగ్ మ్యాన్ డీకే శివ కుమార్, చంద్రబాబు నాయుడు తారసపడ్డారు. పక్కనున్న సెక్యూరిటీ, వ్యక్తిగత సిబ్బందికి దూరంగా వెళ్లి ఇద్దరే చాలాసేపు మాట్లాడుకున్నారు. చంద్రబాబు గ్రహచారం బాగాలేక ఈ వార్త, ఫోటో మీడియాలో ప్రముఖంగా వచ్చేసింది. దాంతో బాబుకు ముచ్చెమటలు పట్టాయట! దీన్ని పూర్వపక్షం చేయడం కోసం బీజేపీతో పొత్తు కహానీని సిద్ధంచేసి ఒక తటస్థ ఛానెల్‌పైకి గురిపెట్టి విసిరారు.

ఎన్నికల్లో గెలుపు కోసం తెలుగుదేశం పార్టీ ఇన్ని ఆపసోపాలు పడటానికీ, అగచాట్ల పాలవడానికీ కారణం క్షేత్రస్థాయి వాస్తవికత. నాలుగేళ్లలోనే ప్రజాజీవనంలో వైఎస్ జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొని రాగలిగింది. ఒకప్పుడు వ్యవసాయంలో చిన్న కమతాలు లాభదాయకం కాదనే వాదన ఉండేది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చిన్న కమతాల రైతులు లాభాలు పండిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని దేవీందర్‌శర్మ జాతీయ పత్రిక 'ట్రిబ్యూన్'లో ఒక ప్రత్యేక వ్యాసాన్ని రాశారు. రైతు భరోసా కేంద్రాలపై జాతీయ స్థాయిలో ప్రశంసలు కురుస్తున్నాయి. పరిపాలనలో సంపూర్ణ వికేంద్రీకరణ, పారదర్శకత సాధించడంలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. బలహీనవర్గాలకూ, మహిళలకూ అధికార హోదాలను కట్టబెట్టడంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది.

దేశంలో అత్యంత ఖరీదైన ప్రైవేట్ స్కూళ్లలో అందజేస్తున్న విద్యను ఏపీ ప్రభుత్వం ఉచితంగా పేద బిడ్డలకు అందజేయగలుగుతున్నది. ప్రజారోగ్య వ్యవస్థ ప్రతి ఇంటినీ పరామర్శిస్తున్నది. రైతులకు వారి భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కుకు గ్యారంటీ కల్పిస్తూ దేశంలోనే తొలి అడుగును ఆంధ్రప్రదేశ్ వేసింది. మద్య నియంత్రణను అమలులోకి తెచ్చి బెల్టు షాపుల తాట తీసింది. నడివయసు దాటిన మహిళలకు చేయూతనిచ్చి వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసింది. లక్ష ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగు నీరిచ్చి మరో నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరపరిచింది.

వైఎస్ జగన్ పరిపాలనలో బలహీనవర్గాల ప్రజలు, మహిళలు వెనుకబాటుతనాన్ని ఛేదించుకొని ముందడుగు వేస్తున్నారు. ఇది గిట్టని పెత్తందారీ వర్గాలు ఏకం కావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే చంద్రబాబు చేస్తున్న రాజకీయ అవకాశవాద ప్రయోగాలను చూడాలి. ఇక పేదల ప్రభుత్వం మీద యెల్లో మీడియా విష వాయువులను ప్రయోగిస్తున్నది. కష్టజీవులందరూ పేదల ప్రభుత్వం వెనుక మరింత బలంగా సంఘటితం కావడమే ఈ విష ప్రచారాలకు విరుగుడు.

ప్రతి ఉదయం ఒక కొత్త రోజును ఆవిష్కరిస్తుంది. రేపటి ఉదయం మరో కొత్త సంవత్సరాన్ని ఆవిష్కరించబోతున్నది. సామాజిక – ఆర్థిక న్యాయ సాధనలో నాలుగేళ్లుగా పడుతున్న అడుగులకు కొత్త సంవత్సరం మరింత ఉత్తేజాన్నివ్వాలని కోరుకుందాం. పెత్తందారీ శక్తుల అవకాశవాద రాజకీయాలను చిత్తుచేస్తూ పేదల ప్రభుత్వానికి మరో అఖండ విజయం ఈ కొత్త సంవత్సరం ప్రసాదించాలని కాలచక్రాన్ని ముందుకు నడిపే ఉదయార్కుడైన సూర్యభగవానుని ప్రార్థిద్దాం. సప్తాశ్వ రథమారూఢం... ప్రచండం కశ్యపాత్మజం... శ్వేతపద్మధరం దేవం... తం సూర్యం ప్రణమామ్యహమ్!

vardhelli1959@gmail.com

వెలుగులు చిమ్మిన నందులు

'కళలు ఉన్నంతకాలం
నా గుండెను వేదిక చేస్తా
కళాకారుణ్ణి బతికిస్తా...'

ఇది ఏపీ సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కళాకారులకు ఇచ్చిన భరోసా. డిసెంబర్ 23 నుంచి 29 వరకు గుంటూరు నగరంలో రాష్ట్ర ప్రభుత్వ 2022 వ సంవత్సర 'నంది' నాటకోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండీ వందల సంఖ్యలో కళాకారులు ఏడురోజులూ ఉత్సాహంగా వీటిలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 'చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో స్వర్గీయ బలిజేపల్లి లక్ష్మీకాంతం కళాప్రాంగణం (శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం – ఎ.సి.) ఇందుకు వేదికైంది. ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి పర్యవేక్షణలో విజయ కుమార్ రెడ్డి, శేషసాయి ఇత్యాది ఉన్నతాధికారులు, సిబ్బంది చేసిన ఏర్పాట్ల పట్ల కళాకారులు సంతుష్టి వ్యక్తం చేశారు. కళాకారులకు, అతిథులకు, ప్రదర్శనలకు చేసిన ఏర్పాట్లు తదితర అంశాల్లో ఈ ఉత్సవాలకూ గతంలో జరిగిన ఉత్సవాలకూ హస్తిమశకాంతరం ఉందనీ, ఇంత ఘనంగా, ఎంతో పారదర్శకంగా... మరీ ముఖ్యంగా టైమ్ ప్రకారం – గతంలో ఎన్నడూ జరగలేదని పలువురు కళాకారులు అన్నారు. ఆర్టిస్టులకు, అతిథులకు స్టార్ హోటళ్లలో బస ఏర్పాటుచేశారు. అల్పాహార, భోజన సదుపాయం పట్ల కూడా అందరూ ఆనందం వ్యక్తం చేయడం విశేషం.

రెండు మూడు తరగతులు చదువుతున్న బుడతల నుండి... జీవితాన్ని కాచి వడపోసిన... డెబ్బైలు దాటిన సీనియర్ మోస్ట్ కళాకారుల వరకూ పాల్గొనడం ఈ ఉత్సవాల ప్రత్యేకత. కరోనా మహమ్మారి కారణంగా వాయిదా పడిన '2022 నంది నాటక ఉత్సవా'లను ఇప్పుడు నిర్వహించారు.

వివిధ విభాగాలకు సంబంధించి 115 ఎంట్రీలు రాగా ప్రాథమిక పరిశీలన అనంతరం– పద్య నాటకాలు 10 (ప్రదర్శన పారితోషికం రూ. 50 వేలు), సాంఘిక నాటకాలు 6 (రూ. 40 వేలు); సాంఘిక నాటికలు 12 (రూ. 25 వేలు); బాలల విభాగంలో 5 (రూ. 25 వేలు); కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థుల విభాగంలో 5 (రూ. 25 వేలు) మొత్తం 38 నాటక, నాటికలను ప్రదర్శించారు. మొత్తం 72 బహుమతుల కోసం దాదాపు పన్నెండొందల మంది కళాకారులు హోరాహోరీ తలపడ్డారు.

పద్య నాటక విభాగంలో మాధవవర్మ – విజయవాడ (ప్రథమ రూ. 80 వేలు, బంగారు నంది), శ్రీకాంత కృష్ణమాచార్య – విశాఖ (ద్వితీయ రూ. 60



వేలు, రజత నంది); వసంతరాజీయం – హైదరాబాద్ (తృతీయ రూ. 40 వేలు, కాంస్య నంది) విజేతలుగా నిలిచాయి.

అలాగే.. సాంఘిక నాటకాల విభాగంలో ఇంద్రప్రస్థం – గుంటూరు (రూ 70 వేల నగదు, బంగారు నంది), ఇంపోస్టర్స్ – హైదరాబాద్ (రూ. 50 వేల నగదు, రజత నంది); కలనేత – హైదరాబాద్ (రూ. 30 వేల నగదు, కాంస్య నంది); సాంఘిక నాటికల విభాగంలో అస్త్రికలు – పెదకాకాని (రూ. 40 వేల నగదు, బంగారు నంది), కమనీయం – గుంటూరు (రూ. 30 వేల నగదు, రజత నంది), చీకటిపువ్వు – కరీంనగర్ (రూ. 20 వేల నగదు, కాంస్య నంది); బాలల విభాగంలో ప్రపంచతంత్రం – విజయవాడ (రూ. 40 వేల నగదు, బంగారు నంది), బాధ్యత – రాప్తాడు (రూ. 30 వేల నగదు, రజత నంది), మూడు ప్రశ్నలు – విజయవాడ (రూ. 20 వేల నగదు, రజత నంది); యువజన విభాగంలో ఇంకానా..? – విజయవాడ (రూ. 40 వేల నగదు, బంగారు నంది), కపిరాజు – గుంటూరు (రూ. 30 వేల నగదు, రజత నంది), ఉద్ధంసింగ్ – తిరుపతి (రూ. 20 వేల నగదు, కాంస్య నంది) బహుమతులను గెలుచుకున్నాయి.

నాటకరంగంపై రచనల్లో 'రాయలసీమ నాటక రంగ వికాసం' (రచయిత డా. మూల మల్లికార్జునరెడ్డి) ఉత్తమ రచనగా ఎంపికైంది. 'ఎన్టీఆర్ స్మారక రంగస్థల పురస్కారా'న్ని డా. మీగడ రామలింగస్వామి – విశాఖకు (రూ. 1.5 లక్షల నగదు, ప్రత్యేక జ్ఞాపిక), 'వైఎస్సార్ స్మారక రంగస్థల అవార్డ్'ను యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్–కాకినాడ (రూ. 5 లక్షల నగదు, ప్రత్యేక జ్ఞాపిక)ను అందించారు. దర్శకత్వం, రచన సహా పలు అంశాల్లో వ్యక్తిగత అవార్డులు, నగదు బహుమతులు అందజేశారు.

వ్యక్తిగత బహుమతుల నగదు మొత్తాన్ని ఐదురెట్లు పెంచుతున్నట్లు చైర్మన్ పోసాని ప్రకటించడంతో కళాకారుల ఆనందానికి అవధుల్లేవు. మైక్, లైటింగ్ సిస్టం అద్భుతంగా పనిచేయడం ఉత్సవాల విజయానికి దోహదపడింది.

పక్కా ప్రణాళికతో... ఎప్పటికప్పుడు ప్రాక్టికల్ సమీక్షలతో మొత్తం కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారంటూ పోసాని టీమును ఆర్టిస్టులు, అతిథులు మనఃపూర్వకంగా అభినందించడం ఈసారి 'నంది' పండగ హైలైట్.

– జి.వి. రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

ఇది లీపు సంవత్సరం!

క్రీ.పూ. 45వ సంవత్సరం నుండి జనవరి 1వ తేదీని నూతన సంవత్సర మొదటి దినంగా ఆచరించాలని జూలియస్ సీజర్ ఆదేశించాడు. పూర్వం నుండి సూర్యమాన (సోలార్), చాంద్రమాన (లూనార్) క్యాలెండర్లు ప్రాచుర్యంలో ఉన్నాయి. జూలియస్ క్యాలెండర్ సూర్యమాన పద్ధతిలో రూపొందించడం జరిగింది. జూలియస్ సీజర్ పేరును బట్టి జూలియన్ క్యాలండర్ అన్నారు. 1582లో గ్రెగరీ ఆదేశాల మేరకు జూలియన్ క్యాలెండర్‌ను అలోసియస్ లివియస్ సవరించి అందరికి ఆమోదయోగ్యంగా ఉండే క్యాలండర్‌ను రూపొందించాడు. ఈ క్యాలండర్‌లో 365 రోజులు, 12 నెలలు, 52 వారాలు, లీపు సంవత్సరంలో ఒక అదనపు రోజు ఉండేటట్లు రూపొందించారు. దీనిని గ్రెగరీ ప్రవేశపెట్టడం వల్ల దీనికి 'గ్రెగోరియన్ క్యాలండర్' అని అంటారు. దీని ప్రకారం ఇప్పుడు ప్రపంచమంతా జనవరి 1వ తేదీని మొదటి నెల మొదటి రోజుగా ఆచరిస్తున్నారు.

సాధారణంగా సంవత్సరానికి 365 రోజులుంటాయి. లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. ఫిబ్రవరి మాసంలో 28కి బదులు 29 రోజులు వస్తాయి. భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమించడానికి 365 రోజుల 6 గంటల సమయం పడుతుంది. అదనంగా ఉండే ఈ ఆరు గంటలను నాలుగు సంవత్సరాలకు గణించగా వచ్చిన 24 గంటలను ఒక రోజుగా పరిగణిస్తున్నారు. ఆ రోజును ఫిబ్రవరికి కలిపి దానిని లీపు సంవత్సరం అంటున్నారు. ఆ విధంగా 2024వ సంవత్సరం లీపు సంవత్సరం అయ్యింది. హిందూ క్యాలండర్ సోలార్, లూనార్ (సూర్య మాన, చాంద్రమాన) పద్ధతుల్లో రూపొందించడం జరిగింది.

సంవత్సరంలోని పన్నెండు నెలలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో తెలుసుకొందాం. రోమన్ల దేవుడు జానస్ నుండి జనవరి, వారి పండుగ ఫెబ్రువా నుండి ఫిబ్రవరి, రోమన్లు గ్రీకులు పూజించే మార్స్ నుండి మార్చి, అందానికి దేవతయైన అఫ్రొడైట్ నుండి ఏప్రిల్, ఇటలీ దేవత మైయా నుండి మే, గ్రీకుల దేవత జూన్ నుండి జూన్, జూలియస్ సీజర్ పేరున జూలై, అగస్టీన్ పేరుతో ఆగస్టు వచ్చిందని చరిత్ర కారులు వివరించారు. జూలియస్ సీజర్, అగస్టీన్‌లకు సమాన ప్రాధాన్యం ఇవ్వడానికి జూలై, ఆగస్ట్ నెలలకు 31 రోజులుగా నిర్ణయించారు.

ప్రాచీన కాలంలో రోమీయులు మార్చి 1వ తేదీని సంవత్సరం మొదటి నెల మొదటి రోజుగా భావించేవారు. లాటిన్ భాషలో సెప్టెంబర్ అంటే ఏడు, అక్టోబర్ అంటే ఎనిమిది, నవంబర్ అనగా తొమ్మిది, డిసెంబర్ అనగా పది అని అర్థాలున్నాయి. కానీ, పై నాలుగు నెలలను ఆగస్ట్ తర్వాత తొమ్మిది, పది, పదకొండు, పన్నెండు నెలలకు ఈ పేర్లు పెట్టడం జరిగింది. ఈ విధంగా పన్నెండు నెలలకు పేర్లు పెట్టడం జరిగింది. ప్రతి రోజూ మొదటి సూర్య కిరణాలు మధ్య పసిఫిక్ మహా సముద్రంలోని 'కెరోలినా' అనే దీవిపై ప్రసరిస్తాయి. కానీ అక్కడ మనుష్యులు ఎవరూ ఉండరు అనేది కొసమెరుపు.

సాక్షి పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– పులుకూరి లాబాను ప్రభుదాసు, కావలి

క్లుప్తంగా...

రేపు రేవంత్ చేతుల మీదుగా నుమాయిష్ ప్రారంభం

- ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



అబిడ్స్ (హైదరాబాద్): 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)ను జనవరి ఒకటవ తేదీన ప్రారంభించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సంవత్సరం 2,400 స్టాళ్లతో ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. శనివారం ఇక్కడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి బి.హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్, పబ్లిసిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డితో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. జనవరి ఒకటవ తేదీన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలలా 20 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయని, 30 వేలమంది విద్యార్థులకు విద్యను అందిస్తోందని, రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తోందని వివరించారు. ఎగ్జిబిషన్ సందర్శకులు కోవిడ్ నిబంధనలు పాటించాలని, ఉచితంగా మాస్కులు కూడా అందించే విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా మారం జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈనెల 28, 29, 30 తేదీల్లో కోల్‌కతాలో జరిగాయి. అందులో తెలంగాణ ఎన్జీవోల సంఘం పక్షాన దాదాపుగా 200 మంది నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌కు టీఎన్జీవోలు అభినందనలు తెలియజేశారు.

పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలను నిర్వహించండి

- డీజీపీని కోరిన పోలీస్ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘాన్ని రద్దు చేసి.. కొత్త సంఘం ఎన్నిక నిర్వహించాలని కోరుతూ పలువురు పోలీస్ సిబ్బంది శనివారం డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత సంఘం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోందని వారు వివరించారు. ఐజీ పర్సనల్ చంద్రశేఖర్‌రెడ్డికి సైతం వినతిపత్రం అందజేసినట్టు వారు పేర్కొన్నారు. అధికారులను కలిసిన వారిలో పోలీస్ బెటాలియన్ల తరపున జంగయ్య, సంగారెడ్డి నుంచి జనార్దన్, సుభాష్, హైదరాబాద్ నుంచి అప్పలసూరి, నరేందర్, ఖమ్మం నుంచి చంద్రశేఖర్ రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి శ్రీనివాస్ గౌడ్, సైబరాబాద్ నుంచి మల్లేశ్ ఉన్నారు.

గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రమాద బీమా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రవాణా, రవాణాయేతర ఆటో డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టుల కోసం రూ.ఐదు లక్షల కవరేజీతో అమలు చేస్తున్న సామాజిక భద్రత పథకాన్ని ప్రభుత్వం గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫాం కార్మికులకు కూడా విస్తరించింది. ఈ మేరకు కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదిని శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాద బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆ ఉత్తర్వుల్లో ఆమె స్పష్టం చేశారు.

మ్యాన్‌పవర్ కంపెనీ పన్ను ఎగవేత

- 'బిగ్‌లీప్' కంపెనీ డైరెక్టర్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: పన్ను చెల్లిస్తున్నట్టు ఐదేళ్లుగా రిటర్నులు దాఖలు చేస్తూ, ఎలాంటి టర్నోవర్ లేకుండానే ఇతర రాష్ట్రాల్లోని పలు కంపెనీలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ని దఖలు పరుస్తూ ప్రభుత్వ ఖజానాకు పన్ను ఎగవేస్తున్న ఓ కంపెనీ మోసం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ బేగంపేట డివిజన్ పరిధిలో బిగ్‌లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మ్యాన్‌పవర్‌ను అందించేందుకు గాను ఓ కంపెనీ రిజిస్టర్ అయింది. ఈ సంస్థ ఇతర కంపెనీలకు సిబ్బందిని సరఫరా చేసినందుకు గాను ఆయా కంపెనీలు చెల్లించే మొత్తం నుంచి ప్రభుత్వానికి జీఎస్టీని చెల్లించడం లేదు. అలా చెల్లించకపోవడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పన్నులు కట్టి వ్యాపారం చేసినట్టు రికార్డులు సృష్టించి రిటర్నులు దాఖలు చేసింది. ఇలా దాఖలు చేయడం ద్వారా 2018–19 నుంచి 2022–23 వరకు రూ. 27.07 కోట్ల పన్ను ఎగవేయడమే కాకుండా ఐటీసీ రూపేణా మరో అనుబంధ కంపెనీ అయిన బిగ్‌లీప్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాకు ఆ డబ్బును మళ్లించింది. దీనిని గుర్తించిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కుంభకోణానికి సూత్రధారి అయిన బిగ్‌లీప్ కంపెనీ డైరెక్టర్ వినయ్ కోట్రాను అరెస్టు చేశారు. అతనిపై జీఎస్టీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేశామని, తదుపరి విచారణ కొనసాగుతోందని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టి.కె.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

'విద్యుత్' డైరెక్టర్లకు ఉద్వాసన?

అపరిమిత పదవీ కాలానికి త్వరలో బ్రేక్

- ఇంటి బాట పట్టనున్న 27 మంది డైరెక్టర్లు
- కొత్త డైరెక్టర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్
- ఇంధన శాఖ కార్యదర్శి రిజ్వీ నేతృత్వంలో కసరత్తు
- అర్హతలు, అనుభవం ఉన్న వారికి అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో సుదీర్ఘకాలం నుంచి డైరెక్టర్లుగా కొనసాగుతున్న వారికి ఉద్వాసన పలికేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వారి స్థానంలో కొత్త డైరెక్టర్ల నియామకానికి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు విద్యుత్ శాఖపై ప్రత్యేకంగా ఫోకస్ చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ తదితర సంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లు (సీఎండీ)గా ఐఏఎస్ అధికారులను నియమించింది. విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని సైతం విడుదల చేసింది. తదుపరి చర్యగా కొత్త డైరెక్టర్ల నియామకం కోసం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. సంబంధిత విభాగాల్లో అనుభవం, పరిజ్ఞానం కలిగిన అర్హులైన ఇన్‌సర్వీస్, రిటైర్డ్ విద్యుత్ అధికారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించనుంది. 2012 మే 14న ఇంధన శాఖ జారీ చేసిన జీవో 18 ప్రకారం నియామకాలు చేపట్టనున్నారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోల ఇన్‌చార్జి సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేసి.. ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురి పేర్లతో షార్ట్ లిస్టును రూపొందించి ప్రభుత్వానికి అందించనుంది. ఈ సెలక్షన్ కమిటీలో ఆయా విద్యుత్ సంస్థల సీఎండీలు కన్వీనర్లుగా, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వం నామినేట్ చేసే విద్యుత్ రంగ స్వతంత్ర నిపుణుడు సభ్యులుగా ఉంటారు. కమిటీ సిఫార్సు చేసినవారి నుంచి డైరెక్టర్లను ప్రభుత్వం నియమించనుంది.

అర్హతలు ఉంటేనే కొలువు

గతంలో కనీస అర్హతలు లేనివారిని విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్లుగా నియమించడంతోపాటు అడ్డగోలుగా పదవీ కాలాన్ని పొడిగించినట్టు ఆరోపణలున్నాయి. డైరెక్టర్‌గా ఎంపికయ్యే వారికి కనీసం చీఫ్ ఇంజనీర్‌గా మూడేళ్ల అనుభవం ఉండాల్సి ఉన్నా.. డీఈలుగా రిటైరైన వారిని సైతం నియమించి కీలక విభాగాలను అప్పగించినట్టు విమర్శలున్నాయి. దీంతో ఈసారి పక్కాగా నిబంధనలను అనుసరించి నియామకాలు జరపాలని నిర్ణయించి, పాత ఉత్తర్వులను వెలికితీశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం డైరెక్టర్ పదవికి ఎంపిక కావాలంటే.. సంబంధిత విద్యుత్ విభాగాల కార్యకలాపాల్లో కనీసం 15 ఏళ్ల అనుభవంతోపాటు మొత్తంగా కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ప్రభుత్వ రంగ సంస్థల్లో కనీసం 25 ఏళ్లు పనిచేసి ఉండాలి. కనీసం మూడేళ్లపాటు చీఫ్ ఇంజనీర్/చీఫ్ జనరల్ మేనేజర్/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లేదా తత్సమాన హోదాల్లో పనిచేసి ఉండాలి. నోటిఫికేషన్ నాటికి వయసు 65 ఏళ్లకు మించరాదు.

పదవీకాలం రెండేళ్లే..

నిబంధనల ప్రకారం డైరెక్టర్ పదవీకాలం రెండేళ్లు మాత్రమే. పనితీరును మదింపు చేయడం ద్వారా సెలక్షన్ కమిటీ సిఫార్సులతో ఏడాది చొప్పున రెండుసార్లు పదవీకాలాన్ని పొడిగించడానికి వీలుంది. ప్రస్తుతం ట్రాన్స్‌కోలో నలుగురు, జెన్‌కోలో ఏడుగురు, టీఎస్ఎస్పీడీసీఎల్‌లో 8 మంది, ఎన్పీడీసీఎల్‌లో 8 మంది కలిపి మొత్తం 27 మంది డైరెక్టర్లు కొనసాగుతున్నారు. వీరిలో కొందరు ఉమ్మడి రాష్ట్రం నుంచీ, మరికొందరు తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచీ కొనసాగుతున్నారు. తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు వీరే డైరెక్టర్లుగా కొనసాగుతారంటూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఇలా సుదీర్ఘంగా కొనసాగుతున్నారు. కొందరి వయసు 85ఏళ్లకు చేరినా డైరెక్టర్లుగా ఉండటం గమనార్హం. ఇప్పుడు వీరంతా ఇంటిబాట పట్టనున్నారు.

ట్రాన్స్‌కో కొత్త జేఎండీకి అందని బాధ్యతలు

ఇటీవల ట్రాన్స్‌కో జేఎండీగా ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ ఝాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అయితే సంస్థ సీఎండీ ముర్తుజా రిజ్వీ ఇంకా సందీప్‌కుమార్ ఝాకు అధికారికంగా ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. ఆయన విద్యుత్ సౌధలోని రెండో అంతస్తులో ఖాళీగా కూర్చుంటున్నారు. గత ప్రభుత్వహయాంలో ట్రాన్స్‌కో జేఎండీగా ఆర్థిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన సి.శ్రీనివాసరావునే ఆ పోస్టులో కొనసాగిస్తున్నారు. శ్రీనివాసరావు పదవీకాలం వచ్చే ఏప్రిల్‌లో ముగియనుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లావాదేవీలన్నీ శ్రీనివాసరావుకు తెలిసి ఉండటంతో.. ఆయనను పదవీకాలం ముగిసేవరకు కొనసాగించవచ్చనే అభిప్రాయం ఉంది. తర్వాత కూడా శ్రీనివాసరావును కొనసాగించాలని భావిస్తే.. కొత్త జేఎండీ సందీకుమార్ ఝాకు రెండో జేఎండీగా హెచ్‌ఆర్ వంటి విభాగాల బాధ్యతలు అప్పగించవచ్చని అంటున్నారు.

ఎంజీఎంలో అర్ధరాత్రి పవర్‌కట్

- వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న రోగి మృతి
- కోతుల చేష్టలతో షార్ట్ సర్క్యూట్
- వ్యాధి తీవ్రతతోనే ఆ రోగి చనిపోయినట్లు వైద్యుల ప్రకటన

ఎంజీఎం: షార్ట్ సర్క్యూట్‌తో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రి చీకటి మయం కావడంతో రోగులతోపాటు వారివెంట ఉన్న బంధువులు ఆందోళనకు గురయ్యారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఓ రోగి చనిపోయాడు. అయితే ఆ రోగి వ్యాధి తీవ్రతతోనే చనిపోయినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రకటించారు.

అసలేం జరిగిందంటే..: ఎంజీఎం ఆస్పత్రిలో ఏఎంసీ వార్డు వెనుకాల ఉన్న విద్యుత్ తీగలపై కోతులు చేసిన ఆగడాలతో వైర్లు ఒక్కొటి పరస్పరం తాకాయి. షార్ట్ సర్క్యూట్ జరిగి వైర్లు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రిలో సాధారణ వార్డుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినా.. జనరేటర్ ద్వారా అత్యవసర వార్డుల(ఏఎంసీ, ఐఎంసీ, ఆర్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, ఎంఓటీ, ఈఓటీ)కు విద్యుత్ సరఫరా జరిగేది. కానీ జనరేటర్‌తో లింక్ ఉన్న ఉన్న విద్యుత్‌వైర్లు కూడా కాలిపోవడంతో గంటపాటు అంధకారం నెలకొంది.

విద్యుత్ సరఫరా లేకపోవడంతో మృతి: రోగి బంధువుల ఆరోపణ

ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి ఏర్పడిన విద్యుత్ అంతరాయం కారణంగా ఆర్ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్న బొజ్జ భిక్షపతి(45) మృతి చెందినట్లు రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజేశ్వర్‌రావు పల్లె గ్రామానికి చెందిన భిక్షపతి ఆల్కహాల్ లివర్ సిరోసిస్ సమస్యతో శుక్రవారం తెల్లవారుజామున ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు అతనికి ఆర్ఐసీయూలో వెంటిలేటర్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో భిక్షపతికి అమర్చిన వెంటి లేటర్ నిలిచి శ్వాస తీసుకోవడం తీవ్రమైనట్లు మృతుడి బంధువులు చెబుతున్నారు. దీంతో చనిపోయాడని వాపోతున్నారు. ఈ విషయంపై ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన విషయం వాస్తవమేనని తెలిపారు. బాధితుడి మృతిచెందిన సమయంలో వెంటిలేటర్ బ్యాటరీ బ్యాకప్‌తో కొనసాగుతోందని పేర్కొన్నారు. భిక్షపతి మృతికి విద్యుత్ అంతరాయం కాదని, వ్యాధి తీవ్రతే కారణమని స్పష్టం చేశారు.

అడ్వొకేట్ జనరల్‌గా ఎ.సుదర్శన్‌రెడ్డి

సమర్థ వాదనలు వినిపిస్తారన్న పేరు • గతంలోనూ ఏజీగా బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా సీనియర్ న్యాయవాది ఏ.సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వారమే ఈయన పేరును సూచిస్తూ ప్రభుత్వం గవర్నర్ కార్యాలయానికి పంపినా.. గవర్నర్ బిజీగా ఉండటంతో ఆమోదానికి సమయం పట్టింది. గవర్నర్ ఆమోదం తర్వాత ప్రభుత్వం ఏజీ నియామకానికి సంబంధించి జీవో 636ను విడుదల చేసింది. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఏజీ పదవి కోసం చాలామంది సీనియర్ న్యాయవాదుల పేర్లు వినిపించాయి. అయితే, గతంలో ఏజీగా పని చేసిన సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చింది. 2011లో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఉమ్మడి హైకోర్టులో సుదర్శన్‌రెడ్డి ఏజీగా విధులు నిర్వర్తించారు. అడ్వొకేట్ జనరల్ పదవి చేపట్టిన తొలి తెలంగాణ న్యాయవాది ఆయనే కావడం గమనార్హం. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వ పదవీ కాలం ముగిసే నాటికి ఏజీగా ఉన్న సుదర్శన్‌రెడ్డే మళ్లీ ఏజీ కావడం విశేషం. వివాదరహితుడైన సుదర్శన్‌రెడ్డికి.. క్రిమినల్, సివిల్‌తోపాటు రాజ్యాంగపరమైన కేసుల్లో సమర్థవంతంగా వాదనలు వినిపిస్తారన్న పేరు ఉంది.

1985లో ఎన్‌రోల్‌మెంట్

ఏ.సుదర్శన్‌రెడ్డి 1959, మే 25న జగిత్యాల జిల్లా రాచేపల్లిలో జన్మించారు. 1985లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగ, సివిల్, కార్పొరేట్, ఆర్బిట్రేషన్, క్రిమినల్, సర్వీస్‌కు సంబంధించిన కేసుల్లో హైకోర్టు, సిటీ సివిల్‌కోర్టు, రంగారెడ్డి జిల్లా తదితర కోర్టుల్లో వాదనలు వినిపించారు. ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్యానెల్ అడ్వొకేట్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ విద్యావిధాన్ పరిషత్‌కు న్యాయవాదిగా విధులు నిర్వహించారు. 2011లో ఏజీ బాధ్యతలు చేపట్టి.. తెలంగాణ వచ్చే వరకు కొనసాగారు. 2009–10లో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, సుదర్శన్‌రెడ్డి నియామకాన్ని వారం ముందే 'సాక్షి' చెప్పడం గమనార్హం. ఆయన నియామకం పట్ల హెచ్‌సీఏఏ సీనియర్ కార్యవర్గ సభ్యుడు కృష్ణ కుమార్‌గౌడ్, మాజీ జాయింట్ సెక్రెటరీ డీఎల్ పాండు, మాజీ సెక్రెటరీ గడిపల్లి మల్లారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రెండో అదనపు ఏజీగా ఇమ్రాన్‌ఖాన్!

- వచ్చే వారం ఉత్తర్వులు వెలువడే అవకాశం
- ఇప్పటికే అదనపు ఏజీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రజనీకాంత్‌రెడ్డి
- ఏజీపై పని భారం తగ్గించేందుకు రెండో ఏఏజీ నియామకానికి ప్రభుత్వం మొగ్గు



సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో తమ తరఫున వాదనలు వినిపించేందుకు మరో అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. సీనియర్ న్యాయవాది మహ్మద్ ఇమ్రాన్ ఖాన్‌ను రెండో అదనపు ఏజీగా నియమించాలని సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆయన నియామకానికి సంబంధించి వచ్చే వారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన తేరా రజనీకాంత్‌రెడ్డి అదనపు ఏజీగా నియమితులైన విషయం తెలిసిందే. కేసుల పని భారం ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, మరింత సమన్వయంతో పని చేసేందుకు రెండో అదనపు ఏజీని నియమించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అలాగే రెండో అదనపు ఏజీని నియమిస్తే అడ్వొకేట్ జనరల్‌పై పనిభారాన్ని తగ్గించినట్లవుతుందని కూడా ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలనే యోచనతో ప్రభుత్వం ఇమ్రాన్ ఖాన్ వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఒకే అదనపు ఏజీ ఉండేవారు. దీంతో కేసుల పరంగా అప్పటి ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కోవాల్సి వచ్చింది. కాగా, అడ్వొకేట్ జనరల్, అదనపు ఏజీ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైన నేపథ్యంలో, రెండో అదనపు ఏజీ పదవిని మైనారిటీలకు కేటాయించినట్లు భావిస్తు న్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పోస్టు భర్తీకి సైతం ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. అయితే పీపీ నియామకం హైకోర్టు ఆమోదంతో జరగాల్సి ఉండటంతో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. కాగా, ఇమ్రాన్ ఖాన్ 1988లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2021 ఏప్రిల్‌లో హైకోర్టు ఆయనకు సీనియర్ న్యాయవాది హోదానిచ్చింది.

అప్పు తెచ్చాం.. కరెంట్ ఇచ్చాం: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తాము అధికారంలో ఉన్నప్పుడు అప్పు తెచ్చి కరెంట్ ఇచ్చామని, అప్పు సాధారణ విషయమని.. దేశంలో విద్యుత్ సంస్థలన్నీ అప్పులు, నష్టాల్లోనే ఉన్నాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అప్పు గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అప్పు లేని రాష్ట్రాలు దేశంలో ఉన్నాయా? అని ప్రశ్నించారు. దేశానికి కూడా అప్పు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 25 రోజులకుపైగా అవుతోందని, పథకాలు ఎప్పుడు అమలు చేస్తారా అని ప్రజలు ఎదురు చూస్తుంటే ప్రభుత్వ పెద్దలు అప్పులు.. అప్పులు.. అని పాడిందే పాడుతున్నారని ధ్వజమెత్తారు. అప్పుల గురించి అసెంబ్లీలో శ్వేత పత్రాలు పెట్టారని, దాని మీద తాము సమాధానం చెప్పామని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి ఎక్కడికి వెళ్లినా అప్పుల గురించే మాట్లాడుతున్నారని, ఆయన అప్పుల గురించి కాకుండా తన శాఖపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. మేడిగడ్డలో మంత్రులు ఇంజనీర్లపట్ల అమర్యాదగా ప్రవర్తించారని, సీఎం, మంత్రులు చిల్లరగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమ నిజాయితీని నిరూపించుకునేందుకు ఇప్పటికే న్యాయ విచారణ కోరామని, కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకాకపోతే ఆ విషయం చెప్పాలని జగదీశ్వర్‌రెడ్డి అన్నారు.

సుప్రీంకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్‌గా శ్రవణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు స్టాండింగ్ కౌన్సెల్‌గా న్యాయవాది కరణం శ్రవణ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కార్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సుప్రీంకోర్టులో అడ్వొకేట్ ఆన్ రికార్డ్‌గా దేవిన షెహగల్, రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా దివ్య ఆడెపును నియమిస్తూ మరో రెండు జీవోలు జారీ చేసింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి జీవోలు వెలువరించారు. నేటి నుంచి మూడేళ్లపాటు వారు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు.

అప్పుల ఊబిలో విద్యుత్ రంగం

- గత ప్రభుత్వం నిర్వాకం.. లెక్కలన్నీ తారుమారు
- ఇప్పుడు సమష్టి కృషితో లక్ష్యాలను అధిగమిద్దాం
- బీటీపీఎస్ అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



బీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం భట్టి

మణుగూరు రూరల్: విద్యుత్ సెక్టార్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టివేసిందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. విద్యుత్ కొనుగోలుకు రూ.30,406 కోట్లు, బకాయిల పేరుతో రూ.59,580 కోట్లు అప్పు చేసి లెక్కలు లేకుండా తారుమారు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆయన ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను శనివారం భట్టి సందర్శించారు. జెన్‌కో అధికారులతో కలిసి వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఈ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. విద్యుత్ రంగాన్ని గత ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు.

బీటీపీఎస్‌తో వచ్చే సమస్యలు అధిగమించేందుకు..

ప్రస్తుతం బీటీపీఎస్‌తో అనేక సమస్యలు తలెత్తుతున్న క్రమంలో వాటిని అధిగమించేందుకు భవిష్యత్‌లో ఉన్నత మైన ప్రణాళికలు రూపొందిస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. బీటీపీఎస్‌లో సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సి ఉండగా.. సబ్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే వినియోగిస్తున్నారని, దీంతో పర్యావరణానికి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. జమలాపురం ఆలయాన్ని, మామునూరు పేట చెరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని, రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తాజా రిజ్వీ, ఉప ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి కృష్ణభాస్కర్, పినపాక, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ నాయక్ పాల్గొన్నారు.


శనివారం అయోధ్యలో నూతన విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. ఫొటోలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి సింధియా తదితరులు


రోడ్ షోలో మోదీపై అభిమానుల పూల వర్షం


అమృత్ భారత్ రైల్లో ప్రయాణికులతో మోదీ మాటామంతి


అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మోదీ

జనవరి 22న... ఇంటింటా రామజ్యోతి

దేశ ప్రజలకు మోదీ పిలుపు ● ప్రపంచమంతా ఎదురు చూసింది ఈ రోజు కోసమే
రామాలయ ప్రాణప్రతిష్ట అందరికీ దీపావళే ● గుడారంలో గడిపిన రామునికి 'పక్కా ఇల్లు'
అయోధ్య ర్యాలీలో ప్రధాని వ్యాఖ్యలు ● విమానాశ్రయం, రైల్వే జంక్షన్ ప్రారంభం
● రూ.15,700 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

అయోధ్య: అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం దేశ ప్రజలందరికీ దీపావళి వంటిదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జనవరి 22న దేశమంతటా ఇంటింటా శ్రీరామజ్యోతి వెలిగించాలని పిలుపునిచ్చారు. నిత్యం రామనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్న అయోధ్యలో ఆయన శనివారం పర్యటించారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో రోజంతా బిజీబిజీగా గడిపారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించాక అక్కడ భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. జనవరి 22న భవ్య రామాలయ ప్రారంభాన్ని, శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ''ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమమంటే అందరికీ దీపావళి పండుగే. దీనికి గుర్తుగా ఆ రాత్రి ఇంటింటా శ్రీరామ జ్యోతిని వెలిగించండి. అయోధ్యలో రామ్‌లల్లా (బాల రాముడు) ఇంతకాలం తాత్కాలిక టెంట్ కింద గడపాల్సి వచ్చింది. ఇప్పుడు దేశంలోని నాలుగు కోట్ల మంది పేదలతో పాటు రామ్‌లల్లాకు కూడా పక్కా ఇల్లు వచ్చేసింది'' అని అన్నారు. రామమందిర ప్రారంభోత్సవాన్ని చరిత్రాత్మక ఘట్టంగా మోదీ అభివర్ణించారు. ''ఈ రోజు కోసం యావత్ ప్రపంచం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసింది. కనుక అయోధ్య వాసుల్లో ఇంతటి ఉత్సాహం సహజం. భరత గడ్డపై అణువణువునూ ప్రాణంగా ప్రేమిస్తా. ప్రతి భారతీయుడూ పుట్టిన నేలను ఆరాధిస్తాడు. నేనూ మీలో ఒకడినే'' అన్నారు.

ఆ రోజు రాకండి

ఆహ్వానితులు మినహా మిగతా వారు 22న అయోధ్యకు రావద్దని మోదీ విజ్ఞప్తి చేశారు. ''రామాలయ ప్రాణప్రతిష్ట క్రతువును ప్రత్యక్షంగా తిలకించేందుకు జనవరి 22వ తేదీనే అయోధ్యకు పోటెత్తాలని అసంఖ్యాకులు భావిస్తున్నట్టు తెలిసింది. దయచేసి ఆ రోజున మాత్రం అయోధ్యకు రాకండి. చేతులు జోడించి వేడుకుంటున్నా. ఎందుకంటే అందరికీ అదే రోజున దర్శనభాగ్యం సాధ్యపడదు. ఆ రోజు చాలామంది విశిష్ట అతిథులు విచ్చేస్తున్నారు. కనుక యావత్ ప్రజానీకం జనవరి 23 నుంచి జీవితాంతం అయోధ్య రామున్ని దర్శించుకోవచ్చు'' అని సూచించారు.

వికాస్.. విరాసత్

అత్యంత స్వచ్ఛమైన నగరంగా అయోధ్యను తీర్చిదిద్దుదామంటూ ప్రతిజ్ఞ చేద్దామని మోదీ పిలుపునిచ్చారు. ''ఇది అయోధ్యవాసుల బాధ్యత. జనవరి 14 నుంచి 22వ తేదీ దాక దేశంలోని అన్ని ఆలయాలు, ఆధ్యాత్మిక స్థలాల్లో స్వచ్ఛత కార్యాక్రమాలు చేపడదాం. దేశం కోసం కొత్త తీర్మానాలు, మనం కోసం కొత్త బాధ్యతలను తలకెత్తుకుందాం. ఏ దేశమైనా ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిందే. వికాస్ (అభివృద్ధి)తో పాటు విరాసత్ (వారసత్వం) కూడా ముఖ్యమే. అవి రెండూ పట్టాలుగా 21వ శతాబ్దంలో దేశాభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం'' అని పిలుపునిచ్చారు. ఆ రెండింటి ఉమ్మడి అభివృద్ధి బలమే భారత్‌ను ముందుకు నడుపుతుందన్నారు. సభలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెగా రోడ్ షో

శనివారం ఉదయం 11 గంటలకు అయోధ్య ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాక మోదీ అక్కడి నుంచి రోడ్ షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి రైల్వే స్టేషన్ దాకా దాదాపు 15 కిలోమీటర్ల పొడవునా రోడ్‌షో సాగింది. దారి పొడవునా ప్రధానికి అయోధ్యవాసులు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఘన స్వాగతం పలికారు. ఆయనపై పూలవర్షం కురిపించారు. రోడ్‌షో మధ్య మధ్యలో ఏర్పాటుచేసిన 40 కళావేదికల వద్ద పలు రాష్ట్రాల కళాకారులు నృత్య, కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రయాగ్‌రాజ్ నుంచి వచ్చిన కళాకారులు రాముని జీవితంతో ముడిపడి ఉన్న 'దేధియా' నృత్యంతో ఆకట్టుకున్నారు. అనంతరం మోదీ మార్గమధ్యంలో అతి పెద్ద వీణతో అలంకృతమైన లతా మంగేష్కర్ చౌక్ వద్ద కాసేపు గడిపారు.


అయోధ్యలో లతా మంగేష్కర్ చౌక్ వద్ద మోదీ

వాల్మీకి మహర్షి ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

అయోధ్యలో ఆధునిక హంగులతో సిద్ధమైన విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభించారు. రామాయణ కర్త పేరిట దీనికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేశారు. అయోధ్యకు 15 కిలోమీటర్ల దూరంలో అత్యాధునిక సౌకర్యాలతో రూ.1,450 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయాన్ని శనివారం ఉదయం మోదీ లాంఛనంగా ప్రారంభించారు. వాల్మీకి విరచిత రామాయణం మనకు గొప్ప జ్ఞానపథమని ఈ సందర్భంగా అన్నారు. ''అది మనల్ని శ్రీరామ ప్రభువు చెంతకు చేరుస్తుంది. ఆధునిక భారత దేశంలో అయోధ్య ధామంలోని వాల్మీకి విమానాశ్రయం మనల్ని దివ్య (మహోన్నత), భవ్య (అద్భుత), నవ్య (ఆధునిక) రామ మందిరానికి చేరుస్తుంది. అప్పట్లో ఇదే రోజున అండమాన్ దీవికి బ్రిటిష్ చెర నుంచి సుభాష్ చంద్రబోస్ విముక్తి కల్పించారు. అక్కడ జాతీయ జెండా ఎగరేశారు. మనల్నిది ఆజాదీ కీ అమృత్ కాల్‌లోకి తీసుకెళ్తుంది'' అన్నారు.

విమానాశ్రయ విశేషాలు..

- అయోధ్య నగర చరిత్ర, విశిష్టత, ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేలా విమానాశ్రయ నిర్మాణం సాగింది. టెర్మినల్ భవనానికి శ్రీరామ మందిరాన్ని తలపించేలా తుదిరూపునిచ్చారు. ప్రధాన ద్వారంపై ఆలయ తోరణాల డిజైన్ వేశారు. రాముడి జీవితాన్ని కళ్లకు కట్టే కళాఖండాలు, చిత్రాలు, కుడ్యచిత్రాలకు విమానాశ్రయంలో చోటు కల్పించారు.
- బస్సు పార్కింగ్‌తోపాటు దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పించారు.
- ఎల్‌ఈడీ లైటింగ్, వాననీటి నిర్వహణ, సౌర విద్యుత్ ప్లాంట్, మురుగు శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు.
- చుట్టూతా పరుచుకున్న పచ్చదనం నిర్వహణకు వాడిన నీటిని రీ సైకిల్ చేసి ఉపయోగించనున్నారు.
- విమానాశ్రయ నిర్మాణం కేవలం 20 నెలల్లో పూర్తయిందని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంజీవ్ కుమార్ చెప్పారు.
- ఈ ఎయిర్‌స్ట్రిప్ గతంలో కేవలం 178 ఎకరాల్లో ఉండేది. దీన్ని రూ.350 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దారు. ఇందుకు యూపీ ప్రభుత్వం 821 ఎకరాలు కేటాయించింది.
- ఏటా 10,000 మంది ప్రయాణికుల రాకపోకలను వీలుగా విమానాశ్రయాన్ని విశాలంగా నిర్మించారు. టెర్మినల్ భవనాన్ని 6,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కట్టారు.
- 2.2 కిలోమీటర్ల పొడవైన రన్‌వే ఉండటంతో ఎయిర్‌బస్–321 రకం విమానాల ల్యాండింగ్, టేకాఫ్ చాలా సులువు. రెండు లింక్ 'టాక్సీ వే'లు ఉండటంతో ఒకేసారి ఎనిమిది విమానాలను పార్క్ చేసుకోవచ్చు.
- భవిష్యత్తులో విమానాశ్రయ రెండో దశ విస్తరణ మొదలవనుంది. టెర్మినల్‌ను 50 వేల చదరపు మీటర్లకు విస్తరిస్తారు.
- ఏటా ఏకంగా 60 లక్షల మంది రాకపోకలకు వీలుగా విస్తరణ ప్రతిపాదనలు సిద్ధంచేశారు.
- రన్‌వేను 3.7 కిలోమీటర్లకు విస్తరించి అదనంగా 18 విమానాల పార్కింగ్‌కు చోటు కల్పించాలని భావిస్తున్నారు.

అయోధ్య ధామ్ జంక్షన్ రైల్వేస్టేషన్‌కు పచ్చజెండా

అయోధ్య పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ దాదాపు రూ.241 కోట్లతో పునరుద్ధరించిన అయోధ్య ధామ్ జంక్షన్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయోధ్య రైల్వేస్టేషన్ నుంచి రెండు అమృత్ భారత్ రైళ్లను, ఆరు వందే భారత్ రైలు సేవలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. ' మూడు కొత్త సేవలైన వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్‌ల 'త్రిశక్తి'తో భారత రైల్వే నూతన అభివృద్ధి శకంలోకి దూసుకెళ్లగలదు'' అని మోదీ వ్యాఖ్యానించారు. మూడంతస్తుల నూతన అయోధ్య రైల్వేస్టేషన్‌లో సరికొత్త సౌకర్యాలను కల్పించారు. లిఫ్టులు, కదిలే మెట్లు, ఫుడ్ ప్లాజాలు, వాణిజ్య, వ్యాపార సముదాయలు, పూజా సామగ్రి దుకాణాలు, చైల్డ్ కేర్, వెయిటింగ్ హాళ్లతో స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి సర్టిఫికెట్‌నూ ఈ రైల్వేస్టేషన్ సాధించింది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే అమృత్ భారత్ రైలుకు తొలి రోజు విశేష స్పందన లభించింది. బుకింగ్ ప్రారంభించిన నిమిషాల వ్యవధిలోనే టికెట్లు మొత్తం అమ్ముడయ్యాయి.

పుతిన్‌ను ఎలాగైనా ఆపాల్సిందే: బైడెన్



వాషింగ్టన్: ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేసేందుకే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కంకణం కట్టుకున్నారంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దుయ్యబట్టారు. ''ఆయన యుద్ధోన్మాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవాల్సిందే. ఉక్రెయిన్‌పై రష్యా తాజాగా క్షిపణుల వర్షం కురిపించిన వైనం ఈ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది'' అన్నారు. తమ దేశంపైకి రష్యా ఏకంగా 110 క్షిపణులను ప్రయోగించిందని, ఈ దాడిలో 31 మంది అమాయకులు బలవగా వందలాది మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించడం తెలిసిందే. 2022లో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇదే అతి పెద్ద దాడి అని ఉక్రెయిన్ వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలో పుతిన్‌ను అడ్డుకునేందుకు ఉక్రెయిన్‌కు మరింత సాయం అందిద్దామని అమెరికా చట్ట సభ కాంగ్రెస్‌కు బైడెన్ పిలుపునిచ్చారు.

నేరగాళ్ల అప్పగింతకు ఒప్పందమేదీ?: పాక్



ఇస్లామాబాద్: నేరగాళ్ల అప్పగింతకు భారత్‌తో తమకు ద్వైపాక్షిక ఒప్పందమేమీ లేదని పాకిస్తాన్ పేర్కొంది. ముంబై దాడుల సూత్రధారి, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను అప్పగించాల్సిందిగా పాక్‌ను భారత్ కోరడం తెలిసిందే. ఇందుకవసరమైన అన్ని పత్రాలను కూడా పాక్‌కు ఇప్పటికే అందజేసినట్టు విదేశాంగ అధికార ప్రతినిధి అరిందం బాగ్చి వెల్లడించారు. సయీద్‌ను అప్పగించాలంటూ భారత్ నుంచి అభ్యర్థన అందిందని పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ ధ్రువీకరించారు. అయితే హఫీజ్ అప్పగింతకు వీలు కల్పించే ద్వైపాక్షిక ఒప్పందమేదీ ఇరు దేశాల మధ్య లేదన్నారు.

ఇమ్రాన్‌కు భారీ షాక్

నామినేషన్ పత్రాల తిరస్కరణ



లాహోర్: పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్‌కు ఆ దేశ ఎన్నికల సంఘం భారీ షాకిచ్చింది. ఫిబ్రవరి 8న జరగనున్న జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్, మియావాలీ స్థానాల నుంచి ఆయన దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను తిరస్కరించింది. తోషాఖానా కేసులో ఆయన దోషిగా తేలడంతో పాటు సాంకేతిక కారణాలు కూడా తిరస్కరణకు దారి తీసినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీకి ఆయనకు దారులు మూసుకుపోతున్నట్టు కన్పిస్తోంది. ఇమ్రాన్ పలు కేసులను ఎదుర్కొంటున్నారు.

ఉజ్వల లబ్ధిదారు ఇంట్లో టీ తాగిన మోదీ

> "ఛాయ్ చక్కగా ఉందిగానీ కాస్తంత తియ్యగా ఉంది"

అయోధ్య: 'ఉజ్వల పథకం' 10 కోట్లవ లబ్ధిదారు మీరా మంఝీతో మోదీ అన్న మాటలివి! అయోధ్య రైల్వేస్టేషన్ ప్రారంభించాక విమానాశ్రయానికి వెళ్తూ మార్గ మధ్యంలో లతా మంగేష్కర్ చౌక్ కూడలి సమీపంలో ఆయన హఠాత్తుగా ఆగారు. సమీప వీధిలోని మీరా ఇంటికెళ్లి వారందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. స్వయానా ప్రధాని తన ఇంటికి రావడంతో ఉబ్బి తబ్బిబ్బైన మీరా బహుశా ఆ కంగారులో ఆయనకు కలిపిచ్చిన టీలో కాస్తంత చక్కెర ఎక్కువేశారు. ఆ ఛాయ్ తాగుతూ తీపి ఎక్కువైందని మోదీ సరదాగా స్పందించారు. ఉజ్వల పథకం 10 కోట్లవ లబ్ధిదారు కావడంతో ఆమె కుటుంబాన్ని కలిసేందుకు మోదీ ప్రత్యేకంగా వారింటికి వెళ్లారు. ''ఉజ్వలతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ వచ్చింది. కేంద్ర గృహ నిర్మాణ పథకంతో ఉచితంగా ఇల్లూ వచ్చింది'' అంటూ మీరా ఆనందం వెలిబుచ్చారు. ఆమె కుటుంబ యోగక్షేమాలను మోదీ అడిగి తెల్సుకున్నారు. మీరా కుమారుడికి ఆటోగ్రాఫ్ ఇచ్చి వందేమాతరం అని రాసిచ్చారు. అక్కడి చిన్నారులతో సెల్ఫీ దిగారు. ''పాత ప్రభుత్వాలు ఐదు దశాబ్దాల్లో కేవలం 14 కోట్ల గ్యాస్ కనెక్షన్లిస్తే మేం పదేళ్లలో ఏకంగా 18 కోట్ల కనెక్షన్లు అందించాం. వాటిలో పది కోట్లు ఉచిత కనెక్షన్లే'' అని మోదీ అన్నారు.



పైలట్ నోట జై శ్రీరాం

ప్రయాణికుల హనుమాన్ చాలీసా పఠనం

న్యూఢిల్లీ: అయోధ్యలో శనివారం మొదలైన ఎయిర్‌పోర్ట్‌కు ఢిల్లీ నుంచి తొలి విమానం బయల్దేరి వెళ్లింది. ఇండిగో విమానయాన సంస్థ తమ తొలి ఢిల్లీ–అయోధ్య విమానాన్ని శనివారం మధ్యాహ్నం ప్రారంభించింది. ఈ విమానంలోకి అడుగుపెడుతున్న ప్రయాణికులకు పైలట్ అశుతోష్ శేఖర్ .. 'జై శ్రీరామ్' అంటూ స్వాగతం పలికారు. 'అయోధ్యకు బయల్దేరుతున్న తొలి విమానానికి సారథ్యం వహించే బాధ్యతలు నాకు అప్పగించడం నిజంగా నా అదృష్టం. మీ ప్రయాణం సాఫీగా, ఆనందంగా సాగాలని కోరుకుంటున్నాము. జై శ్రీరామ్' అని ఆయన విమానంలో అనౌన్స్ చేశారు. తమ తమ సీట్లలో కూర్చున్న ప్రయాణికులు ప్రయాణ సమయంలో హనుమాన్ చాలీసాను పఠించారు. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది.

పునర్వైభవ తార్కాణం: అమిత్ షా

అహ్మదాబాద్: దేశ అమృత కాలపు ఆరంభంలోనే అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన జరగనుండటం యాదృచ్ఛికమేమీ కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం అభిప్రాయపడ్డారు. రానున్న పాతికేళ్లలో ప్రపంచంలో భారత్ అగ్ర స్థానానికి చేరి పునర్వైభవం సాధించనుందనేందుకు ఇది తార్కాణమన్నారు. వందల ఏళ్ల ఎదురు చూపులు ఫలించాయి. దేశవాసుల ప్రార్థనలు, సాధు సంతుల తపస్సులు, అసంఖ్యాత భక్తుల ప్రయత్నాలు ఫలించాయి. అడ్డంకులన్నీ తొలగాయి. శ్రీరాముడు తన జన్మస్థానంలో ఎట్టకేలకు వైభవంగా కొలువు దీరనున్నాడు'' అని అన్నారు. అయోధ్య మాత్రమే గాక కాశీలో నాడు ఔరంగజేబ్ ధ్వంసం చేసిన విశ్వనాథ్ కారిడార్‌ను కూడా మోదీ ప్రభుత్వం బ్రహ్మాండంగా పునర్నిర్మించిందని గుర్తు చేశారు.

రాముడే బీజేపీ ఎన్నికల అభ్యర్థి!: రౌత్

ముంబై: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని బీజేపీ పూర్తిగా రాజకీయమయం చేస్తోందని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ఆలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానంపై రౌత్ స్పందించారు. '' శ్రీరాముని పేరును బీజేపీ తన రాజకీయాలకు విపరీతంగా వాడేసుకుంది. అయోధ్యలో ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్నీ బీజేపీ ఎంతో రాజకీయ చేసింది. తమ ఎన్నికల అభ్యర్థి శ్రీరామచంద్రుడే అని బీజేపీ ప్రకటించడం ఒక్కటే మిగిలిపోయింది. జనవరి 22న జరిగేది బీజేపీ కార్యక్రమం. ఆ రోజు జరిగేది ఎలా చూసినా జాతీయ కార్యక్రమం కాబోదు. రాజకీయాలతో బీజేపీ రాముడిని కిడ్నాప్ చేసింది'' అని వ్యాఖ్యానించారు. మరి శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే ఆ కార్యక్రమానికి వెళ్తారుగా అని మీడియా ప్రశ్నించగా ''అవును. కానీ బీజేపీ ఆధ్వర్యంలో జరిగే తతంగం అంతా ముగిశాక అసలు కార్యక్రమంలో ఉద్ధవ్ పాల్గొంటారు'' అని బదులిచ్చారు.

న్యూ ఇయర్ దశకం



2024లో ఆసక్తి రేపనున్న పది అంశాలు

మరో సంవత్సరం కనుమరుగవనుంది. మంచీ చెడుల మిశ్రమంగా ఎన్నెన్నో అనుభూతులు మిగిల్చి కాలగర్భంలో కలిసిపోనుంది. సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రపంచమంతా సిద్ధమవుతోంది. 2024లో జరగనున్న ఆసక్తికర ఘటనలు, మిగల్చనున్న ఓ పది మైలురాళ్లను ఓసారి చూస్తే... – సాక్షి, నేషనల్ డెస్క్

1 నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ

ఈ దశాబ్దంలోనే భారత్ కచ్చితంగా ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నది అందరూ చెబుతున్న మాటే. అది 2026లో, లేదంటే 2027లో జరగవచ్చని ఇప్పటి దాకా అంచనా వేస్తూ వచ్చారు. కానీ అన్నీ కుదిరితే 2024 చివరికల్లా జర్మనీని వెనక్కు నెట్టి మనం నాలుగో స్థానానికి చేరడం కష్టమేమీ కాదన్నది ఆర్థికవేత్తల అభిప్రాయం. 2024 తొలి అర్ధభాగం చివరికి జర్మనీ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4.4 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని అంచనా. అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును సులువుగా దాటేయనుంది. మన వృద్ధి రేటు, జర్మనీ మాంద్యం ఇప్పట్లాగే కొనసాగితే సంవత్సరాంతానికల్లా మనది పై చేయి కావచ్చు.

2 దూసుకుపోనున్న యూపీ

ఉత్తరప్రదేశ్ కొన్నేళ్లుగా వృద్ధి బాటన పరుగులు పెడుతోంది. ఆ లెక్కన ఈ ఏడాది అది కర్ణాటకను పక్కకు నెట్టి దేశంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశముంది. 2023–24కు కర్ణాటక జీఎస్‌డీపీ అంచనా రూ.25 లక్షల కోట్లు కాగా యూపీ రూ.24.4 లక్షల కోట్లుగా ఉంది. అయితే 20 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతున్న యూపీ సంవత్సరాంతానికల్లా కర్ణాటకను దాటేసేలా కన్పిస్తోంది.

3 బీజేపీ 'సంకీర్ణ ధర్మ' బాట

2024 అక్టోబర్లో మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. ఆ రాష్ట్రాల్లో ఏ ఒక్క పార్టీకీ సొంతంగా మెజారిటీ వచ్చే పరిస్థితి లేదు. కనుక ఆ రాష్ట్రాల్లో బీజేపీ విధిగా సంకీర్ణ ధర్మాన్ని పాటించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ప్రస్తుత పరిస్థితులే కొనసాగే పక్షంలో వాటిలో రెండు రాష్ట్రాలు ఇండియా కూటమి ఖాతాలో పడ్డా ఆశ్చర్యం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ మూడు రాష్ట్రాల్లో ప్రత్యర్థి పక్షాలకు గట్టి పోటీ ఇవ్వాలంటే మిత్రులతో పొత్తులపై ముందస్తుగానే స్పష్టతకు వచ్చి సమైక్యంగా బరిలో దిగడం బీజేపీకి తప్పనిసరి కానుంది.

4 'సుదీర్ఘ సీఎం'గా నవీన్

అత్యధిక కాలం పాటు పదవిలో ఉన్న ముఖ్యమంత్రిగా పవన్‌కుమార్ చామ్లింగ్ నెలకొల్పిన రికార్డును ఒడిశా సీఎం నవీన్ 2024లో అధిగమించేలా ఉన్నారు. ఎందుకంటే మే లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వరుసగా ఆరోసారి గెలవడం లాంఛనమేనని భావిస్తున్నారు. చామ్లింగ్ 1994 డిసెంబర్ నుంచి 2019 మే దాకా 24 ఏళ్లకు పైగా సిక్కిం సీఎంగా చేశారు. నవీన్ 2000 మార్చి నుంచి ఒడిశా సీఎంగా కొనసాగుతున్నారు.

5 మెగా మార్కెట్ క్యాప్

భారత మార్కెట్ క్యాపిటలైజేషన్ 2024లో 5 లక్షల కోట్ల డాలర్లను దాటేయనుంది. 2023లో మన మార్కెట్ క్యాప్ ఏకంగా 26 శాతం వృద్ధి రేటుతో పరుగులు తీసి 4.2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది! ఇది పాశ్చాత్య ఆర్థికవేత్తలనూ ఆశ్చర్యపరిచింది. కొత్త ఏడాదిలో హీనపక్షం 20 శాతం వృద్ధి రేటునే తీసుకున్నా తేలిగ్గా 5 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటడం లాంఛనమే. సెన్సెక్స్ కూడా ఈ ఏడాది ఆల్‌టైం రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్లడం తెలిసిందే. 2024లోనూ ఇదే ధోరణి కొనసాగడం ఖాయమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

6 20 కోట్ల మంది పేదలు

ఆర్థిక వృద్ధికి సమాంతరంగా దేశంలో పేదలూ పెరుగుతున్నారు. ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో పేదలున్న దేశం మనమేనన్నది తెలిసిందే. 2024లో ఈ సంఖ్య 20 కోట్లను మించనుంది. ఇది బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల మొత్తం జనాభా కంటే ఎక్కువ! ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం భారత్‌లో 14 కోట్ల మంది పేదలున్నారు. నీతీఆయోగ్ లెక్కలను బట్టి ఆ సంఖ్య ఇప్పటికే 21 కోట్లు దాటింది.

7 వ్యవసాయోత్పత్తుల రికార్డు

భారత ఆహార, ఉద్యానోత్పత్తుల పరిమాణం 2024లో 70 కోట్ల టన్నులు దాటనుంది. అందుకు అనుగుణంగా ఆహారోత్పత్తుల ఎగుమతి కూడా ఇతోధికంగా పెరుగుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. 2021లో కేంద్రం రద్దు చేసిన వివాదాస్పద సాగు చట్టాల భవితవ్యం 2024లో తేలిపోవచ్చంటున్నారు.

8 8. కశ్మీర్‌పై చర్చలకు డిమాండ్లు

కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు పాకిస్తాన్‌తో చర్చలను పునఃప్రారంభించాలని స్థానికంగా డిమాండ్లు ఊపందుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ ఈ మేరకు గళమెత్తే అవకాశాలు పుష్కలంగా కన్పిస్తున్నాయి. అలాగే సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ తక్షణం రాష్ట్ర హోదా పునరుద్ధరించడంతో పాటు సెప్టెంబర్ కల్లా అసెంబ్లీకి ఎన్నికలూ జరపాల్సి ఉంది.

9 విదేశీ వాణిజ్యం పైపైకి...

భారత విదేశీ వాణిజ్యం 2024లో 2 లక్షల కోట్ల డాలర్లను తాకవచ్చు. 2023లో యుద్ధాలు తదితర అంతర్జాతీయ పరిణామాలు ప్రపంచ ఎగుమతులు, దిగుమతుల మార్కెట్‌ను విపరీతంగా ప్రభావితం చేశాయి. అంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ మన విదేశీ వాణిజ్యం కళకళలాడింది. మొత్తం జీడీపీలో 40 శాతంగా నిలిచింది.

10 బీజేపీ వర్సెస్ 'ఇండియా'

విపక్షాలకు, ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు జీవన్మరణ సమస్యగా చెప్పదగ్గ కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు 2024 వేదిక కానుంది. హ్యాట్రిక్ విజయం కోసం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ఉరకలేస్తోంది. పదేళ్లుగా కేంద్రంలో అధికారానికి దూరంగా ఉండటమే గాక అసెంబ్లీ ఎన్నికల్లో వరుస ఓటముల పాలవుతున్న కాంగ్రెస్ ఇంకా కాలూ చేయీ కూడదీసుకునే దశలోనే ఉంది.

సాక్షి కరీంనగర్

ఆదివారం | 31 | డిసెంబర్ | 2023



జూడో చాంపియన్ కరీంనగర్

రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–17 బాలబాలికల జూడో చాంపియన్ షిప్‌ను కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు కైవసం చేసుకుంది. 8లో▸

నేడు ఎల్ఎండీ నీటి విడుదల

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ ఎల్ఎండీ నుంచి ఆదివారం నీటిని విడుదల చేస్తామని ఎస్ఈ శివకుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మొదటి 7 రోజులు ఎస్సారెస్పీ 146వ కి.మీ. నుంచి 284వ కి.మీ.కు, తర్వాతి 8 రోజులు 284 పైన ఉన్న ఆయకట్టుకు ఆన్, ఆఫ్ పద్ధతిలో నీరందిస్తామన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.4/15.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమిషనరేట్‌లో ఆకస్మిక బదిలీలు

- ముగ్గురు సీఐల సరెండర్?
- ఆరుగురు ఎస్ఐల బదిలీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో శనివారం ఆకస్మికంగా సీఐలు, ఎస్ఐల బదిలీలు జరిగాయి. వన్‌టౌన్ సీఐ రవికుమార్, టూటౌన్ సీఐ రాంచందర్‌రావు, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డిలను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు తెలిసింది. వన్‌టౌన్ సీఐగా టాస్క్‌ఫోర్స్–2 సీఐ జబోత్ సరిలాల్‌ను, కరీంనగర్ టూటౌన్ సీఐగా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఒ.వెంకటేశ్‌లను నియమించారు. ఎల్ఎండీ ఎస్ఐ ఎస్.ప్రమోద్‌రెడ్డి, రామడుగు ఎస్ఐ టి.తిరుపతి, వీణవంక ఎస్ఐ ఆసిఫ్ మహమ్మద్‌లను వీఆర్‌కు బదిలీ చేశారు. ఎల్ఎండీ ఎస్ఐగా ఎస్బీలో పని చేస్తున్న చేరాలును, రామడుగు ఎస్ఐగా కరీంనగర్ త్రీటౌన్ ఎస్సై ఎస్.రమేశ్‌ను, వీణవంక ఎస్ఐగా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వంశీకృష్ణను నియమిస్తూ కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల క్రితమే వచ్చిన సీఐలు బదిలీ అయ్యారు. ఇది పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మూడోరోజు.. 49,291

- ప్రజాపాలనకు అర్జీల వెల్లువ
- నేడు, రేపు విరామం.. ఎల్లుండి మళ్లీ స్వీకరణ



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: ప్రజాపాలనకు అర్జీలు వెల్లువెత్తాయి. శనివారం జిల్లాలోని 56 గ్రామాలు, 5 మున్సిపాలిటీల్లోని 24 వార్డుల్లో 49,291 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి పలుచోట్లకు వెళ్లి, కార్యక్రమ తీరును పరిశీలించారు. ఆదివారం, సోమవారం(న్యూఇయర్) రెండు రోజుల పాటు కార్యక్రమానికి బ్రేక్ వేశారు. తిరిగి జనవరి 2న దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ మూడు రోజుల్లో జిల్లాలో 1,25,973 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తులను తిరస్కరించొద్దు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చే ప్రజలకు దరఖాస్తు విధివిధానాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శనివారం నగరంలోని 37వ డివిజన్ రాంనగర్ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అర్జీలను తిరస్కరించొద్దని అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ స్వరూపారాణి, నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నగరంలో 14,022 అర్జీలు

నగరంలోని 60 డివిజన్లలో శనివారం 14,022 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 13,555 ఆరు గ్యారంటీ పథకాలకు చెందినవి కాగా, 467 ఇతరాలు. నగరవ్యాప్తంగా మూడు రోజులు కలిపి గ్యారంటీ దరఖాస్తులు 38,328, ఇతరాలు 564 మొత్తం 38,892 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



కరీంనగర్: కరీంనగర్–1 డిపోలో ప్రగతిచక్ర అవార్డ్స్‌లో భాగంగా ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు శనివారం పురస్కారాలు అందజేశారు. నవంబర్‌లో బెస్ట్ ఈపీకే తెచ్చిన ఏడుగురు కండక్టర్లు, ముగ్గురు డ్రైవర్లకు, బెస్ట్ ఆయిల్ సేవ్డ్ కింద 10 మంది డ్రైవర్లకు మెమొంటోలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లయ్య, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 38 టీఎస్‌డబ్ల్యూఆర్‌సీఓఈలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ–జేఈఈ, నీట్, సీఎల్ఏటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి, జనవరి 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు https://tsswreisjc.cgg.gov.in,https://www.tswreis.ac.in వెబ్‌సైట్‌లలో సంప్రదించాలని సూచించారు.

యాసంగి భేష్.. వానాకాలం లాస్

2023 రివైండ్

- ఈ ఏడాది వేసవిలో ఊహించని వరి దిగుబడి
- వానాకాలంలో డ్రైస్పెల్ కారణంగా సగానికి పైగా తగ్గిన వైనం
- పత్తిదీ ఇదే పరిస్థితి
- నష్టపోయిన జిల్లా రైతులు
- సేంద్రియ సాగులో పెరిగిన యువత భాగస్వామ్యం



అకాల వర్షానికి నీటమునిగిన పత్తి పంట (ఫైల్)

కరీంనగర్ అర్బన్: డ్రైస్పెల్(వర్ష విరామం) అన్నదాతను ముంచేసింది. వర్షాలు సకాలంలో కురవక రోజుల తరబడి ఎండలు విరుచుకుపడ్డాయి. ఫలితంగా పగుళ్లు చూపిన భూములు, తెగుళ్లు పంటలను నీడలా వెంటాడాయి. 2023 సంవత్సరంలో రైతులకు యాసంగి పంట కలిసొచ్చినా వానాకాలం కన్నీళ్లే దిగుబడులయ్యాయి. తాజాగా యాసంగి సాగుకు సిద్ధమవుతుండగా రానున్న సంవత్సరమైనా వారి ఆశలకు జీవం పోస్తుందో చూడాలి. పత్తి రైతులకు ఏడాదిలో ఒకే పంట కాగా పెట్టిన పెట్టుబడి రాని దుస్థితి. ఏటా రూ.1,400 కోట్ల విలువైన దిగుబడి రావాల్సి ఉండగా రూ.700 కోట్లకే పరిమితమవడం, దళారీ వ్యవస్థతో రైతులు నష్టాలను చూస్తున్నారు. ఇక, సేంద్రియ సాగుపై యువతరంలో చైతన్యం వచ్చింది. 2023లో ఆశల ఊసులతో కాలం గడిపిన కర్షకులకు 2024 రెట్టించిన ఆదాయం ఇవ్వాలని కోరుకుందాం.

సగానికి తగ్గిన పత్తి దిగుబడి

కరీంనగర్ జిల్లాలో 70 శాతానికి పైగా ప్రజలకు జీవనాధారం వ్యవసాయమే. పత్తి, వరి ప్రధాన పంటలు కాగా ఏటా పత్తి సాగు తదుపరి ధాన్యం విస్తీర్ణం ఉండేది. కానీ, జలాశయాలు నిండుకుండను తలపిస్తుండటంతో వరినే ఎక్కువగా సాగు చేస్తున్నారు. పత్తి జిల్లాలో 46 వేల ఎకరాల్లో సాగు చేయగా ఎకరాన 10 క్వింటాళ్ల లెక్క కట్టినా 4,60,000 క్వింటాళ్ల దిగుబడి రావాలి. చాలాచోట్ల ఎకరాన 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ, ఊహించని విధంగా తెగుళ్లు ముప్పేట దాడి చేయడం, వర్షాల లేమితో సగానికి తగ్గింది. వ్యవసాయ మార్కెట్లు, జిన్నింగ్ మిల్లుల్లో 1.50 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేయగా ప్రైవేట్ వ్యాపారులు మరో 20 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారని సమాచారం. పత్తితో సరాసరి దిగుబడి వస్తే రైతులకు రూ.409.50 కోట్లు రావాల్సి ఉండగా గరిష్ఠంగా ఎకరాన 5 క్వింటాళ్లు మాత్రమే రావడంతో రైతుకు వచ్చింది రూ.203 కోట్లే. ఇక కొనుగోళ్లలో వ్యాపారుల మాయజాలం షరామామూలే. సీసీఐ కొనుగోళ్లు తక్కువ.. ప్రైవేట్ పెత్తనమే ఎక్కువన్నట్లు సాగింది.

యాసంగిలో ఎకరాన 40–55 బస్తాలు

గత యాసంగిలో 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఎకరాన 40–55 బస్తాల వరకు ధాన్యం దిగుబడి పొందారు. ఊహించని విధంగా పంట పండగా రైతుల ఆనందానికి అవధుల్లేవు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో వానాకాలంలో వరి సాగుకే ప్రాధాన్యతనిచ్చారు. వానాకాలంలో 2.20 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. దిగుబడి 2,38,774(దొడ్డు రకం 1,70,496, సన్నరకం 68,278) టన్నులు వచ్చింది. వస్తుందనుకున్న దిగుబడితో పోలిస్తే సగానికి పైగా పడిపోయింది.

రెండుసార్లు అకాల వర్షాలు

వాస్తవానికి ఉన్న నీటిని చూసి ఈసారి పంట పండుతుందని రైతులు ఆశించారు. ఏపుగా పెరుగుతున్న పంటలను వర్ష విరామం దెబ్బతీసింది. రెండుసార్లు కురిసిన వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. 415 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. మధ్యమానేరు, ఎగువ మానేరు, దిగువ మానేరు జలాశయాలు నిండుకుండలా మారగా దాదాపు అన్ని చెరువులు అలుగు పారడం సంతోషకర పరిణామం. దొడ్డు, సన్నరకాలకు ఎన్నడూ లేని విధంగా తెగుళ్లు ఆశించాయి. పత్తిదీ అదే పరిస్థితి. చాలా రోజులు వర్షాలు లేకపోవడం, గాలిలో తేమ తగ్గడం మరింత ఆజ్యం పోయగా మందులు పిచికారీ చేసినా ఫలితం అంతంతమాత్రమే.

గత యాసంగి సాగు..

సాగైన వరి : 2,10,000 ఎకరాలు	
రావాల్సిన దిగుబడి : 6,30,000 టన్నులు	
వచ్చిన దిగుబడి : 6,02,034 టన్నులు	
ఎకరాన వచ్చింది : 28–30 క్వింటాళ్లు	

వానాకాలం సాగు..

మొత్తం విస్తీర్ణం: 3,39,210 ఎకరాలు	
సాగైన పత్తి : 45,898 ఎకరాలు	
రావాల్సిన దిగుబడి: 4,58,980 క్వింటాళ్లు	
వచ్చింది: 3,10,800 క్వింటాళ్లు	
ఎకరాన వచ్చింది : 6–7 క్వింటాళ్లు	
సాగైన వరి : 2,20,545 ఎకరాలు	
రావాల్సిన దిగుబడి : 6,61,635 టన్నులు	
వచ్చింది : 2,38,278 టన్నులు	

సేంద్రియ సాగులో యువతరం

క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులకు దూరంగా కూరగాయలు, ధాన్యం పండించడంలో యువ రైతుల భాగస్వామ్యం పెరగడం హర్షణీయం. టమాట, మిర్చి, ఆకుకూరలు, బెండ, వంకాయ, కాకర, బీర తదితర కూరగాయలను పండిస్తుండగా సన్నరకం వరి సేంద్రియ పద్ధతిలో సాగు చేసి, ఎకరాకు 25–30 క్వింటాళ్ల దిగుబడి పొందుతున్నారు. అలాగే, దేశీ విత్తనాలతో లాభాలు గడిస్తున్నారు. చొప్పదండి, రామడుగు, మానకొండూరు, తిమ్మాపూర్, కరీంనగర్ రూరల్ మండలాల్లోని యువ రైతులు వినూత్న రీతిలో సాగు చేస్తూ మార్కెట్‌ను సృష్టించుకుంటున్నారు. బ్లాక్ రైస్, రత్నచౌడి(పూర్వం సైనికులు తినేవి), చిరుధాన్యాలు, కొర్రలు, రాగులు, జొన్నలు వంటివి పండిస్తూ నూర్పిడి చేసి, వినియోగదారులకు నేరుగా విక్రయిస్తున్నారు. పలువురు గోవుల సంతానోత్పత్తినే పలువురు ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఆవులను సంరక్షిస్తున్న తీరును గూగుల్, యూట్యూబ్ ద్వారా తెలుసుకుంటూ పాటిస్తున్నారు.



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)



రత్నచౌడి వరిలో సతీశ్



ఎక్కువ పాలిచ్చే ఆవులను పెంచుతున్న అన్వేష్



క్రీడల్లో కీర్తి పతాక

మూడేళ్ల కరోనా విరామం తరువాత మళ్లీ మైదానాలు కళకళలాడాయి. క్రికెట్ మైదానాలు సిక్స్‌లతో మోతమోగగా.. కబడ్డీ కూత హోరెత్తింది. అథ్లెటిక్స్‌లో అదరగొట్టగా.. జూడోలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు జూలు విదిల్చారు. చెస్‌లో మెదడుకు పదునుపెట్టగా.. బేస్‌బాల్, వాలీబాల్ పోటీల్లో రాణించారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు సత్తాచాటారు. విరామం ఆటకే కానీ.. తమకు కాదన్నట్లు కరోనా తరువాత ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధక్రీడాంశాల్లో జిల్లాస్థాయి నుంచి అంతర్జాతీయస్థాయి వరకు పతకాల పంట పండించారు. కరీంనగర్ పలు జాతీయపోటీలకు వేదిక కాగా.. అతిథులకు ఘనమైన ఆతిథ్యం అందించారు. 2023లో ఉమ్మడి జిల్లాలో జరిగిన క్రీడాంశాలు.. పతకాలు సాధించిన క్రీడాకారులు తదితర అంశాలతో స్పోర్ట్స్ రౌండప్..!

– కరీంనగర్ స్పోర్ట్స్

– 8లో...



మన భోజరాయలు

ఆయన భూ సమస్యల చిక్కుముళ్లు విప్పే అదనపు రెవెన్యూ కలెక్టర్ మాత్రమే కాదు.. సాహితీవేత్త, క్రీడాకారుడు, స్నేహశీలి, సామాజిక సేవకుడు.. ఒక్క మాటలో చెప్పాలంటే ఆల్ రౌండర్ అధికారి. అన్నింటికీ మించి అరుదైన ఆత్మజ్ఞాని. ఆయనే పెద్దపల్లి రెవెన్యూ అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్. కవిగా, బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా, ఉద్యోగిగా, సామాజిక సేవకుడిగా తనదైన శైలిలో దూసుకుపోతున్న భోజరాయలు శ్యాంప్రసాద్‌లాల్ సాహితీ ప్రస్థానం. – 8లో...

ధాన్యం త్వరగా మిల్లింగ్ చేయాలి

- బియ్యం నిల్వలు ఎఫ్‌సీఐకి చేరవేయాలి
- వీసీలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

కరీంనగర్ అర్బన్: రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరగా మిల్లింగ్ చేసి, బియ్యం నిల్లలు ఎఫ్‌సీఐకి చేరవేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంఆర్ లక్ష్య సాధనపై సమీక్షించారు. కరీంనగర్ జిల్లాలో పెండింగ్ ఉన్న మిల్లింగ్ కోటా నిల్వలపై ఆరా తీశారు. ఈ నెల 31తో ఎఫ్‌సీఐకి బియ్యం చేరవేసే గడువు పూర్తవుతుందని, సాధ్యమైనంత త్వరగా మిల్లింగ్ చేయించి, బియ్యం అప్పగించాలన్నారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ దందాను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్, పౌరసరఫరాల సంస్థ డీఎం రజనీకాంత్, డీఎస్వో సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణలో ఇబ్బందులుండొద్దు

కొత్తపల్లి(కరీంనగర్): అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్‌లో నిర్వహిస్తున్న గ్రామసభకు శనివారం ఆమె వచ్చారు. తహసీల్దార్ రాజేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరు గ్రామాల నుంచి ఇప్పటివరకు 5,322 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కొత్తపల్లి కేంద్రానికి ఆర్డీవో..

కొత్తపల్లి పట్టణంలో వార్డు సభ దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని కరీంనగర్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఆర్డీవో మహేశ్వర్ సందర్శించారు. 3, 4 వార్డుల్లో 520 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల ఖర్చుపై నిర్ణయం

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుపై నిర్ణయం తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయి రేట్ ఫిక్సేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు ఎన్నికల్లో ఉపయోగించే ప్రచార సామగ్రి, ఫ్లెక్సీలు, వాహనాలు, సభలు, సమావేశాలు, వేదికలకు ఉపయోగించే టెంట్, మైక్ సెట్ తదితరాలకు మార్కెట్‌లో ఎంత వెచ్చిస్తారో చర్చించి, అంశాల వారీగా ఖర్చును నిర్ణయించామని అన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజాపాలన దరఖాస్తులపై పలు సందేహాలు వ్యక్తపరచగా నివృత్తి చేశారు. డీఆర్‌వో పవన్‌కుమార్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, డీసీవో రామనుజాచారి, బీజేపీ ప్రతినిధి నాంపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధి మోహనాచారి, ఎంఐఎం ప్రతినిధులు మహమ్మద్ అబ్బాస్ సమీ, సయ్యద్ బర్కత్ అలీ, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, టీడీపీ ప్రతినిధి కల్యాడపు ఆగయ్య, అధికారులు పాల్గొన్నారు.

రాజీతో కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ
- కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి ప్రతిమ


కరీంనగర్‌క్రైం: రాజీతో కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలు సంతోషంగా ఉండవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.ప్రతిమ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, ఫ్యామిలీ కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ముందుకు రావాలని సూచించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులున్నారు.

2,741 కేసులకు పరిష్కారం..

లోక్ అదాలత్‌లో 2,741 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. వీటిలో క్రిమినల్ 2,661, సివిల్ 15, మోటార్ ప్రమాద పరిహారం కేసులు 65 ఉన్నాయన్నారు. బాధితులకు రూ.3.14 కోట్ల పరిహారం ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. ఈ–ట్రాఫిక్ చలాన్, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, ఇతర కేసులు 99,025 పరిష్కరించినట్లు తెలిపారు.

ఎల్ఎండీ, కేబుల్ బ్రిడ్జిపైకి వెళ్లొద్దు

- న్యూ ఇయర్ నేపథ్యంలో ఆంక్షలు
- సీపీ అభిషేక్ మహంతి



కరీంనగర్‌క్రైం: న్యూ ఇయర్ సందర్భంగా లోయర్ మానేరు డ్యాం, కేబుల్ బ్రిడ్జిపైకి వెళ్లడాన్ని నిషేధిస్తున్నట్లు సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 31(ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి జనవరి 01(సోమవారం) ఉదయం 5 గంటల వరకు ఎల్ఎండీ కట్ట, తీగల వంతెనపై ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. వేడుకలు జరుపుకునేందుకు వాటి పైకి అనుమతించబోమన్నారు. వాహనదారులు గమనించి, ఇతర మార్గాల్లో వెళ్లాలన్నారు. అలాగే, రోడ్లమీద వేడుకలు నిర్వహించడం, డీజేలను వినియోగించడం, బైక్ సైలెన్సర్లను మార్చి శబ్ద కాలుష్యం చేస్తూ రోడ్లపై తిరగడం, ట్రిపుల్ రైడింగ్ వంటి వాటికి అనుమతి లేదని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ముందస్తు అనుమతి లేకుండా జనసమూహంగా ఏర్పడి, కార్యక్రమాలు చేపట్టినా, ప్రైవేట్ పార్టీలు నిర్వహించినా, ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మలుపు తిరిగిన అవిశ్వాస రగడ

- ఎమ్మెల్యే పాడి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన 23 మంది కౌన్సిలర్లు
- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌వైపే ఉన్నామని వివరణ
- అవిశ్వాస తీర్మాన కాపీని తిరస్కరించాలని విన్నపం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



బస్సులో క్యాంపునకు వెళ్తున్న కౌన్సిలర్లు

కరీంనగర్/జమ్మికుంట/హుజూరాబాద్: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావుపై అవిశ్వాస రగడ మలుపు తిరిగింది. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో 19 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం కోరుతూ డీఆర్‌వోకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో 23 మంది కౌన్సిలర్లు శనివారం సాయంత్రం ప్రత్యేక బస్సులో కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. తామంతా చైర్మన్ రాజేశ్వర్‌రావు వైపే ఉంటున్నామని, మున్సిపాలిటీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన కాపీని తిరస్కరించాలని విన్నవించారు. పార్టీ మారితే అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే కోరారు. మల్లయ్య బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, ఆయన వ్యవహార శైలి నేపథ్యంలో కౌన్సిలర్ పదవి నుంచి తొలగించాలని విన్నవించారు. వివరాలు అందజేయాలని, న్యాయ విచారణ జరిపి, నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా, క్యాంపులో ఉన్న కొందరు సభ్యులు చైర్మన్‌తో టచ్‌లో ఉన్నట్లు సమాచారం.

రెండేళ్ల క్రితం వైస్ చైర్‌పర్సన్..

2020 జనవరిలో జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. 30 వార్డులుండగా అత్యధికం బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. చైర్మన్‌గా రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పాలకవర్గం కొలువుదీరింది. రెండేళ్ల క్రితం వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న ఆధ్వర్యంలో కౌన్సిలర్లు చైర్మన్‌పై తిరుగుబావుటా ఎగురవేశారు. అప్పటి బీఆర్ఎస్ పెద్దలు రంగంలోకి దిగి, వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. మరి ఈసారి అవిశ్వాస తీర్మానం ఏమవుతుందో చూడాలి.

కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు పాల్పడొద్దు

కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలకు పాల్పడొద్దని, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లను పోలీసు బందోబస్తుతో హైదరాబాద్‌కు తరలించడం దేనికి నిదర్శనమని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి, నెల రోజులు కాకముందే బీఆర్ఎస్ కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం చెల్లదని, మెజారిటీ కౌన్సిలర్లు తమవెంటే ఉన్నారని పేర్కొన్నారు. జమ్మికుంట తహసీల్దార్ అర్ధరాత్రి లబ్ధిదారులను పిలిచి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రోద్బలంతోనే అవిశ్వాస రాజకీయాలు నడుస్తున్నాయని, కౌన్సిలర్లు తమ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్‌రావు, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, ఎంపీపీలు దొడ్డె మమత, రేణుక, పావని, రాణి, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్: 2023–24 విద్యా సంవత్సరానికి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ, మైనార్టీ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చివరి అవకాశంగా జనవరి 31 వరకు గడువు పొడిగించినట్లు షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ ఉపసంచాలకులు నేతానియల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలల్లో చదువుచున్న చదువుతున్న తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈపాస్ https:// telangana epass.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా తమ కళాశాలలోని విద్యార్థులతో స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

'సంక్షోభంలో వస్త్ర పరిశ్రమ'


మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: ఇన్నాళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్రపరిశ్రమను వాడుకొని వదిలేయడంతోనే తీవ్ర సంక్షోభంలో మునిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శి, తెలంగాణ పవర్‌లూమ్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో శనివారం మాట్లాడారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను ఏటా ఆలస్యంగా ఇవ్వడంతో యజమానులు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి నడిపించారని, ఇక్కడి కార్మికులకు మూడు నెలలు మాత్రమే పని పనిదొరికేదన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం నేతకార్మికులను పూర్తిగా ఆదుకుంటున్నామని దుష్ప్రచారం చేసేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.260 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సామల మల్లేశం, నల్ల చంద్రమౌళి, రాములు ఉన్నారు.

జాతీయ పోటీలకు శ్రునిక్


శ్రునిక్‌కు అభినందిస్తున్న దేవయ్య

సిరిసిల్లటౌన్: జాతీయ వాలీబాల్ పోటీలకు సిరిసిల్లకు చెందిన విద్యార్థి శ్రునిక్ ఎంపికయ్యాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న శ్రునిక్ ఇటీవల గుజరాత్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనగా.. జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం ప్రిన్సిపాల్ డి.దేవయ్య, అధ్యాపకులు వెంకటేశం, వివేకానంద్, కనకయ్య అభినందించారు.

అడ్వకేట్ జనరల్ స్వగ్రామం రేచపల్లి



సారంగాపూర్: రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా నియమితులైన ఎడమల సుదర్శన్‌రెడ్డి స్వగ్రామం సారంగాపూర్ మండలం రేచపల్లి స్వగ్రామం. గ్రామానికి చెందిన జలపతిరెడ్డి, బుచ్చమ్మ సంతానమైన ఈయన ఉస్మానియా వర్సిటీలో బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నసమయంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. ప్రస్తుతం హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. సుదర్శన్‌రెడ్డి నియామకంపై రేచపల్లి సర్పంచ్ ఎడమల జయ, జెడ్పీటీసీ మేడిపల్లి ఆనందరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మానవ హక్కుల ఉల్లంఘన పెరిగిపోతోంది



విద్యానగర్(కరీంనగర్): దేశంలో మానవహక్కుల ఉల్లంఘన పెరిగిపోతోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో మానవ హక్కులు- కార్మికుల హక్కులుపై సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో మానవులకు రక్షణ లేదని మానవ హక్కులు సరైనరీతిలో అమలు కావడంలేదని, భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను ప్రతీ పౌరుడికి అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

క్రీడల్లో కీర్తి పతాక

- ఉమ్మడి జిల్లాలో క్రీడారంగానికి పూర్వవైభవం
- కరోనా మూడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాదే పోటీల నిర్వహణ
- ఆటల్లో మెరిసిన క్రీడాకారులు
- ఆసియా, జాతీయస్థాయిలో పతకాల పంట
- పలు జాతీయ, రాష్ట్ర పోటీలు నిర్వహించిన క్రీడాసంఘాలు


కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్ పోటీలను ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ గోపి(ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: క్రీడారంగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు పూర్వవైభవం వచ్చింది. కరోనా తరువాత 2023లో పతకాల పోటీలో దూసుకుపోయింది. క్రీడల నిర్వహణకు తోడు ఆయా పలువురు ఆటగాళ్లు జిల్లాకీర్తి పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటారు. పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాకేంద్రాల్లో వివిధ రాష్ట్రస్థాయి పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. సీఎం కప్ పోటీలు పండుగ వాతావరణంలో జరిగాయి. 2023లో ఉమ్మడి జిల్లాలో జరిగిన క్రీడాంశాలు.. పతకాలు సాధించిన క్రీడాకారులు తదితర అంశాలతో రౌండప్..!

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలతో సందడి

ఉమ్మడి జిల్లాలో వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జాతీయస్థాయి కరాటే, రేటెడ్ చెస్ పోటీలు నిర్వహించారు. మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జూడో, జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. సుల్తానాబాద్‌లో సబ్ జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించారు. డిసెంబర్ 28 నుంచి 30 వరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల జూడో పోటీలు జరిగాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా..

తొర్రూర్‌లో జరిగిన అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన బాలురు ద్వితీయ, బాలికలు తృతీయ స్థానాల్లో నిలిచారు. బీచ్ వాలీబాల్ పోటీల్లో బాలికలు ద్వితీయ, అండర్-19లో బాలికలు మొదటిస్థానం, బాలురు తృతీయస్థానం, అండర్-17లో బాలికలు ద్వితీయస్థానం, బాలురు తృతీయస్థానంలో నిలిచారు. ఖేలో ఇండియా ఉమెన్స్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. మంచిర్యాలలో జరిగిన అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలురు ద్వితీయ, బాలికలు తృతీయ స్థానంలో నిలిచారు. మహబూబాబాద్‌లో జరిగిన అండర్-19 నెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికలు తృతీయ స్థానంలో నిలిచారు. మహబూబాబాద్‌లో జరిగిన అండర్-19 హ్యాండ్ బాల్ పోటీల్లో బాలురు ద్వితీయ స్థానం సాధించారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది.

- రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆరవెల్లి అవనీశ్ రావు అండర్-19 ఆసియా క్రికెట్ కప్, వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెలలో జరిగిన ఐపీఎల్ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు అతన్ని రూ.20 లక్షలకు దక్కించుకుంది.
- దుబాయ్‌లోని షార్జాలో జరిగిన ఆసియా యూనివర్సిటీ కప్ పవర్ లిఫ్టింగ్ క్లాసికల్ విభాగంలో 84 కేజీల పైన కేటగిరీలో ధర్మారానికి చెందిన విరించి స్వప్నిక మెరిసింది. నాలుగు బంగారు పతకాలు సాధించింది.
- గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. హ్యాండ్‌బాల్‌లో గుల్లకోటకు చెందిన మహేశ్ చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి, కాంస్య పతకం సాధించాడు.
- బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు రామడుగుకు చెందిన సాయికృష్ణ, రమేశ్ ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ ఖోఖో జట్టుకు చీఫ్ కోచ్‌గా పెద్దపల్లి జిల్లా ధర్మారానికి చెందిన ఈ.నరేశ్, కోచ్‌గా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు చెందిన పండగ ఆనంద్ వ్యవహరించారు.

కొత్త జిల్లాలకు డీవైఎస్‌వోలు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన కొత్త జిల్లాలకు ప్రభుత్వం పూర్తిస్థాయి డీవైఎస్‌వోలను నియమించింది. పెద్దపల్లికి సురేశ్, రాజన్న సిరిసిల్లకు రాందాస్, జగిత్యాలకు రవి క్రీడాశాఖ అధికారులుగా నియమితులయ్యారు.

మూడేళ్ల తర్వాత ఎస్జీఎఫ్ క్రీడలు

కరోనా కారణంగా ఎస్జీఎఫ్ గేమ్స్ మూడేళ్లు జరగలేదు. 2019-20 సంవత్సరంలో చివరిసారిగా నిర్వహించగా 2023-24 సంవత్సరానికి ప్రస్తుతం క్రీడా పోటీలు జరుగుతున్నాయి.

నకిలీ మావోయిస్టు అరెస్ట్

సిరిసిల్లక్రైం: మావోయిస్టునని బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ నక్సలైట్‌ను సిరిసిల్ల పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి గతంలో మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిగా పనిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న సుదర్శన్‌రెడ్డి పలు సంఘాలకు ఫోన్ చేసి డబ్బుల కోసం బెదిరిస్తున్నాడు. సిరిసిల్లలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటకం సత్తయ్యకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని సత్తయ్య పోలీసులకు తెలిపాడు. పోలీసుల ప్రణాళిక ప్రకారం సత్తయ్య డబ్బులు ఇస్తానని సుదర్శన్‌రెడ్డిని సిరిసిల్లకు రప్పించాడు. సిరిసిల్ల బైపాస్‌రోడ్డులోని నర్సింగ్ కాలేజీ వద్ద డబ్బులు తీసుకునేందుకు వచ్చిన సుదర్శన్‌రెడ్డిని పోలీసులు వలపన్ని పట్టుకుని, రిమాండ్‌కు తరలించారు.

కాపర్‌వైర్ చోరీ

ఎలిగేడు(పెద్దపల్లి): ర్యాకల్‌దేవుపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. విద్యుత్ అధికారుల కథనం ప్రకారం.. ర్యాకల్‌దేవుపల్లిలోని ఎస్ఎస్-65 నంబరు 25 కేవీఏ థెఫ్ట్ డీటీఆర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం దొంగలు అపహరించారు. తొలుత విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్‌వైర్ ఎత్తుకెళ్లారు. దాని విలువ దాదాపు రూ.20వేల వరకు ఉంటుంది. వారంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికావడంతో విద్యుత్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ సంపత్‌రెడ్డి, లైన్‌మన్ భాస్కర్ శనివారం తెలిపారు.

రైతు హఠాన్మరణం

గంభీరావుపేట(ముస్తాబాద్): ముస్తాబాద్ మండలం బందనకల్‌కు చెందిన బెరుగు శ్రీనివాస్(28) అనే రైతు శనివారం పొలం పనులు చేస్తూ.. హఠాన్మరణం చెందాడు. తన పొలంలో వరి నారు పంచుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో హఠాన్మరణం చెందాడు. మృతునికి భార్య రమ్య, తల్లిదండ్రులు సరోజ, పర్శరాములు ఉన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీకి చెందిన మనెగుండ్ల గంగరాజు అనే మహిళపై యత్యాయత్నం చేసిన ఆమె భర్త మన్నెగుండ్ల నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. రాయికల్ మండలం కొత్తపేటకు చెందిన మన్నెగుండ్ల నర్సయ్యతో గంగరాజుకు వివాహం జరిగింది. కొద్దికాలంగా నర్సయ్య గంగరాజుపై అనుమానం పెంచుకుని నిత్యం గొడవ చేయడంతో, జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీలో తల్లిగారింటివద్ద ఉంటోంది. శనివారం మధ్యాహ్నం నర్సయ్య గంగరాజుపై గొడ్డలితో దాడిచేయగా.. స్థానికులు అడ్డుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు తో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూడో చాంపియన్ కరీంనగర్

- ముగిసిన ఎస్జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి జూడో పోటీలు



చాంపియన్లుగా నిలిచిన ఉమ్మడి కరీంనగర్ జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల జూడో చాంపియన్ షిప్‌ను కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్, తృతీయస్థానంలో ఉమ్మడి వరంగల్ జట్లు నిలిచాయి. జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య, విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా జూడో సంఘం సౌజన్యంతో మూడు రోజులుగా కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో జరుగుతున్న పోటీలు శనివారంతో ముగిశాయి. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. పంజాబ్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని సూచించారు. జూడో ఫెడరేషన్ కోశాధికారి బి.కైలాసం యాదవ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, మాజీ ఎస్జీఎఫ్ కార్యదర్శి కనకం సమ్మయ్య, పెద్దపల్లి జిల్లా జూడో సంఘం కార్యదర్శి సిలివేరి మహేందర్, పోటీల అబ్జర్వర్ వీరస్వామి, పీఈటీలు ఎల్వీ.రమణ, చంద శ్రీనివాస్, చిరంజీవి, మార్వాడీ సుదర్శన్, ప్రాంతీయ క్రీడా పాఠశాల జూడో కోచ్ సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెగడపల్లి: పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామానికి చెందిన సిరిపురం చైతన్య(31) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామానికి చెందిన సిరిపురం శంకరయ్య-విజయల కొడుకు చైతన్య రెండేళ్లనుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొని చనిపోయాడు. మృతదేహం శనివారం రాత్రి గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు ఎక్కబోతూ ఒకరు..

రామగుండం: విజయవాడకు చెందిన ఓ ప్రయాణికుడు రామగుండం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కబోతూ కిందపడి మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన మోక వెంకటేశ్వరరావు(68) పని నిమిత్తం మూడు రోజులక్రితం పెద్దపల్లికి వచ్చాడు. తిరిగి విజయవాడకు వెళ్లేందుకు శనివారం రామగుండం రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. కదులుతున్న రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతూ రైలు- ప్లాట్‌ఫారం మధ్య పడి మృతిచెందాడు. మృతుడి వద్ద లభ్యమైన చిరునామా ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వలస కూలీ

గంభీరావుపేట(ముస్తాబాద్):ముస్తాబాద్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న రైసుమిల్ పనుల్లో కూలీగా చేస్తున్న చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన స్వర్ పటేల్(40) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై శేఖర్ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గాయపడ్డ వ్యక్తి..

తిమ్మాపూర్: అలుగునూరు శివారులోని నర్సరీ ఎదుట శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన బొగిరి గట్టయ్య(58) మృతిచెందాడని ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. నర్సరీలో మొక్కలు తీసుకొని రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. గట్టయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన బైక్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా 'ట్రినిటీ' వార్షికోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి



కొత్తపల్లి: రేకుర్తిలోని ట్రినిటీ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా డీఐఈవో జి.జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్డీవో కుందారపు మహేశ్వర్ హాజరయ్యారు. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. డీఐఈవో మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున విద్యార్థులు కష్టపడి చదివి చక్కని మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాంరెడ్డి, నంది శ్రీనివాస్, టి.వెంకట్‌రెడ్డి, కె.పవన్‌కుమార్, బి.ఆనందరెడ్డి, పి.రాజిరెడ్డి, ఎ.జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఎం.నర్సిరెడ్డి, కె.సంపత్, కె.స్వాతి పాల్గొన్నారు. సినీ నేపథ్య గాయనీ పావని పాటలు, జబర్దస్త్ కమెడియన్ సద్దాం కామెడీ అదరహో అనిపించాయి.

ఉత్సాహంగా 'అల్ఫోర్స్ ఫ్లేర్-2024'


కేక్ కట్ చేస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ డా.నరేందర్ రెడ్డి

కొత్తపల్లి/రామడుగు: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్‌లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శనివారం నిర్వహించిన 'అల్ఫోర్స్ ఫ్లేర్-2024' ఉత్సాహంగా సాగింది. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. 2023లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు ఘన విజయాలు నమోదు చేశాయని, అదే స్ఫూర్తితో 2024లో సైతం విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు విద్యాసంస్థల అధినేత మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మన భోజరాయలు

- సాహితీవేత్త, క్రీడాకారుడు, సామాజిక సేవకుడు, ఉద్యోగిగా..
- పలురంగాల్లో రాణిస్తున్న అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్


సత్కారం పొందుతున్న శ్యాంప్రసాద్‌లాల్(ఫైల్)


గత కలెక్టర్ కర్ణన్‌తో శ్యాంప్రసాద్ లాల్

సాక్షి,కరీంనగర్ డెస్క్:

ఆయన భూ సమస్యల చిక్కుముళ్లు విప్పే అదనపు కలెక్టర్ మాత్రమే కాదు.. సాహితీవేత్త, క్రీడాకారుడు, స్నేహశీలి, సామాజిక సేవకుడు.. ఒక్క మాటలో చెప్పాలంటే ఆల్ రౌండర్ అధికారి. అన్నింటికీ మించి అరుదైన ఆత్మజ్ఞాని. ఆయనే పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్. పుట్టి పెరిగింది.. పని చేసింది.. చేస్తున్నది అంతా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే. కవిగా, బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా, ఉద్యోగిగా, సామాజిక సేవకుడిగా తనదైన శైలిలో దూసుకుపోతున్న 'భోజరాయలు' శ్యాంప్రసాద్‌లాల్ సాహితీ ప్రస్థానం.

ఆయన ఇల్లే సాహితీవేత్తల నిలయం

కుటుంబసభ్యులు, ఆత్మీయులు ముద్దుగా శ్యాంలాల్ అని పిలుచుకునే శ్యాంప్రసాద్‌లాల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లోని ప్రముఖ రంగస్థల కళాకారుడు, నాట్యకారుడు గాజుల రాజేశం దంపతులకు జన్మించారు. వీరి ఇల్లు చిన్నపాటి సాహిత్య చర్చాగోష్ఠిగా, కవి సమ్మేళనాలకు ఆలవాలంగా ఉండేది. అలాంటి వాతావరణంలో పుట్టి పెరిగిన శ్యాంలాల్‌కు చిన్ననాటి నుంచే రోజుకో కవిత రాయనిదే పడుకోవద్దు అనే నియమం పెట్టుకొని, తనలోని కవిని మేల్కొలిపారు.

15 సార్లు ఉత్తమ అధికారిగా..

శ్యాంలాల్ టెన్త్, ఇంటర్ వరకు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో, డిగ్రీ సిద్దిపేటలో, ఎంఏ తెలుగు ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. తనకున్న సాహిత్య అభిరుచితో ప్రముఖ దినపత్రిక జర్నలిజం స్కూల్‌లో చేరి, అక్కడే మూడేళ్లు సబ్ ఎడిటర్‌గా పని చేశారు. ఉద్యోగం చేస్తూనే గ్రూప్-2 ద్వారా డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికై, 1995లో గంభీరావుపేట డీటీగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. బోయినపల్లి, సిరిసిల్ల, కోరుట్ల, పెద్దపల్లి ప్రాంతాల్లో పని చేశారు. భూసేకరణ అధికారిగా, ఆర్డీవోగా బోధన్, సిరిసిల్లలో, డీఆర్డీవోగా సిరిసిల్ల, జేసీ, అదనపు కలెక్టర్‌గా కరీంనగర్‌లో విధులు నిర్వహించారు. ఎక్కడ పనిచేసినా అక్కడి సమస్యలకు తనదైన పనితీరుతో పరిష్కారం చూపుతూ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారు. దీంతో వివిధ హోదాల్లో 15 సార్లు ఉత్తమ అధికారిగా అవార్డులు పొందారు.

'ఎన్నీల ముచ్చట్లు' పేరిట కవి సమ్మేళనాలు

ఉద్యోగ ధర్మం పాటిస్తూనే.. ఆయా ప్రాంతాల కవులు, కళాకారులు, సాహితీవేత్తలతో టచ్‌లో ఉంటూ 'ఎన్నీల ముచ్చట్లు' పేరిట కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ, కవులకు ఆర్థికంగా తోడ్పాటునందిస్తున్నారు. పద్యకవితం మరుగున పడొద్దన్న ఉద్దేశంతో 'తెలుగు ప్రభంజనం' పేరిట 150 మంది పద్యకవులతో పద్యాలు వినిపించే కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడ పనిచేసినా తన క్యాంప్ ఆఫీస్‌ను పుస్తకాల ఆవిష్కరణకు, కవులకు అడ్డాగా మార్చేవారు. ఆయన సాహిత్యసేవకు గుర్తుగా 9 మంది కవులు తమ పుస్తకాలను శ్యాంలాల్‌కు అంకితం ఇచ్చారు. అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం-2021తో పాటు జీకపానందం, కరీంనగర్ ఫోక్ అకడామీ వారు 'సాహిత్యరత్న' అవార్డుతో సన్మానించారు. పూర్వంలో కవిపండితులను పోషించిన భోజుడు శ్రీకృష్ణదేవరాయలు పేరు కలిసొచ్చేలా సాహిత్య మిత్రులు శ్యాంలాల్ పేరుమీద 'అందరివాడు భోజరాయలు' పేరిట నంది శ్రీనివాస్ సంపాదకీయంలో పుస్తకం తీసుకొచ్చారు.

శ్యాంతో సోపతి.. బతుకంతా తీపి

పుస్తకం గురించి తెలియాలంటే ప్రతీ పేజీ చదవాల్సిందే.. శ్యాం గురించి తెలియాలంటే సోపతి చేయాలంటారు ఆయన స్నేహితులు. తాతలు, పెద్దనాన్న, చిన్నాన్న, మేనత్తలతో కలిసి సుమారు 45 మంది కుటుంబసభ్యులతో కూడిన ఉమ్మడి కుటుంబంలో పెరిగారు శ్యాంప్రసాద్‌లాల్. దీంతో బంధాలు, ఆత్మీయత విలువ తెలిసిన వ్యక్తిగా తాను చిన్నప్పటి నుంచి చదువుకున్న, పనిచేసిన అధికారులతో ఎస్పీ (శ్యాంప్రసాద్) పేరిట గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ప్రజల మనుసుల్లో ముద్ర వేసుకుంటూ, అందరివాడుగా మన్ననలు పొందుతున్నారు.

కవిత్వం సామాజిక చైతన్యాన్ని కలిగించాలి


పుస్తకావిష్కరణలో శ్యాంప్రసాద్‌లాల్, తదితరులు

కరీంనగర్‌కల్చరల్: కవిత్వం సామాజిక చైతన్యం కలిగించాలని పెద్దపల్లి అదనపు పాలనాధికారి జీవీ.శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. శనివారం సమతా సాహితీ కరీంనగర్ ఆధ్వర్యంలో స్థానిక ఫిలింభవన్‌లో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు రచించిన శతద్రు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమాజ ఆవేదనంతా లక్ష్మణరావు కవిత్వంలో ఉందన్నారు. శతద్రు పుస్తకంలో మట్టితత్వాన్ని, మనిషితనాన్ని కలగలిపిన కవిత్వం లక్ష్మణరావు సొంతమని అన్నారు. విశిష్ట అతిథి వరుకుల శివకుమార్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్, డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, జి.రవీందర్, అనిల్‌కుమార్, వి.రవీందర్, వేణుశ్రీ, అన్నవరం దేవేందర్, పాక రాజమౌళి, మాడిశెట్టి గోపాల్, బీవీఎన్ స్వామి పాల్గొన్నారు.

ఈ పేటలు.. పెట్టని కోటలు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 'పేట'పల్లెలు


బావుసాయిపేట

సిరిసిల్ల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఊరిపేరు చివరన 'పేట' అని ఉన్న గ్రామాలు ఓ 69 ఉన్నాయి. మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలు ఈ పేర్లతో కనిపిస్తాయి. ఆ ఊర్లు ఇవీ... కోనరావుపేట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, దమ్మన్నపేట, మల్లారెడ్డిపేట, కొత్తపేట, దేశాయిపేట, లింగన్నపేట, నాగంపేట, రాజుపేట, రాజన్నపేట, రంగంపేట, కోరుట్లపేట, బావుసాయిపేట, మర్తనపేట, మల్కాపేట, వెంకట్రావుపేట, రామన్నపేట, సోమారంపేట, రహీంఖాన్‌పేట, ముస్కానిపేట, రామోజీపేట, నర్సక్కపేట, జవారిపేట, హన్మాజిపేట, కిష్టంపేట, లింగంపేట, కుర్దులింగంపేట, కట్టలింగంపేట, పెద్దంపేట, కిష్టరావుపేట, జూదరావుపేట, దుబ్బపేట, ఖాన్‌సాయిపేట, కానపేట, మిర్జంపేట, మంగపేట, అచ్చన్నపేట, భోజన్నపేట, గౌరెడ్డిపేట, సాయంపేట, ముత్తన్నపేట, బేగంపేట, కాశీంపేట, అక్కన్నపేట, బావుపేట, కరీంపేట, ముత్యంపేట, దత్తోజిపేట, పెంచికల్‌పేట, వకీర్‌పేట, నాగులపేట, కమ్మర్‌ఖాన్‌పేట, గుళ్లపేట, రాఘవపేట, మొగల్‌పేట, తొంబర్రావుపేట, అంబారిపేట, వేంపేట, రామచంద్రంపేట, జగదేవ్‌పేట, ముక్కరావుపేట, కప్పరావుపేట, కిషన్‌రావుపేట, మర్లపేట, జగ్గారావుపేట, చంద్రంపేట, రాళ్లపేట, గండిలచ్చపేట.. తదితర గ్రామాలు ఉన్నాయి.

అడ్వాన్స్‌డ్ డయాలసిస్‌తో నిలిచిన యువకుడి ప్రాణాలు


వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రాంచందర్

కరీంనగర్‌టౌన్: కంటిన్యూవస్ రెనల్ రిప్లేస్‌మెంట్ థెరపీ (సీఆర్ఆర్‌టీ) అడ్వాన్స్‌డ్ డయాలసిస్‌తో ఓ యువకుడి ప్రాణాలు కాపాడినట్లు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో మాట్లాడుతూ.. మానకొండూర్ మండలం లింగాపూర్‌కు చెందిన తాళ్ల మహేశ్(26)కడుపునొప్పి, వాంతులతో పాటు మూత్రవిసర్జన తగ్గి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. వెంటిలేటర్ అమర్చారు. పరిస్థితి విషమించడంతో మెడికవర్ ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో మల్టీఆర్గాన్ డిస్‌ఫంక్షన్‌గా తేలిందన్నారు. లోబీపీ ఉన్నప్పుడు నార్మల్ డయాలసిస్‌తో ప్రాణాపాయం ఉండడంతో ప్రత్యామ్నాయంగా సీఆర్ఆర్‌టీ 36 గంటల పాటు నిర్విరామంగా చేశామన్నారు. ఇలా చేయడం వల్ల రెండురోజులకే వెంటిలేటర్ నుంచి పేషెంట్ బయటకు వచ్చాడని, రికవరీ అయ్యాడని వెల్లడించారు. హైదరాబాద్‌కే పరిమితమైన ఈ చికిత్స ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కేవలం మెడికవర్‌లోనే అందుబాటులో ఉందన్నారు. తన ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్య బృందానికి మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా 'మారం'


జగదీశ్‌ను సన్మానిస్తున్న జిల్లా టీఎన్జీవోలు

కరీంనగర్ అర్బన్: అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కోల్‌కతాలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరగగా జిల్లాలోని ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రస్తుతం టీఎన్జీవోల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జగదీశ్‌ను టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్ సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేశ్ భరద్వాజ్, జిల్లా జాయింట్ సెక్రటరీ బాస పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8 నుంచి చదరంగం పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ చదరంగ సమాఖ్య సౌజన్యంతో జనవరి 8 నుంచి 10 వరకు స్థానిక వైశ్య భవన్‌లో ఆల్ ఇండియా 1,600 లోపు ఫిడే రేటింగ్ చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్లు అంతగిరి రాజేంద్రప్రసాద్, విశ్వనాథ్ ప్రసాద్ తెలిపారు. తొలిసారిగా 1,600 లోపు రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌కు అంతర్జాతీయ చదరంగ సమాఖ్య, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు ఉందని తెలిపారు. తొమ్మిది రౌండ్ల పాటు స్విస్ లీగ్ పద్ధతిలో ఉంటుందన్నారు. రూ.2లక్షల నగదుతో పాటు 80 బహుమతులు అందజేయనున్నట్లు, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.999 ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9030177607 నెంబర్‌లో సంప్రదించాలని, ఎంట్రీలు జనవరి 4 లోగా పంపాలన్నారు.

కాంగ్రెస్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి


మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ప్రజల ఆశలను వమ్ము చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 100రోజుల్లో అమలుచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేశ్ అన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఆరుస్కీంల అమలు గందరగోళంగా ఉందని, నియమ నిబంధనలు, విధివిధానాల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదని, అలాంటప్పుడు రేషన్‌కార్డు ఆరు గ్యారంటీ పథకాలకు ఎలా ప్రామాణికం చేస్తారని ప్రశ్నించారు. పేద మధ్యతరగతి ప్రజలను మోసం చేయాలని చూస్తే బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. నాయకులు రాజేంద్రప్రసాద్, రాపర్తి ప్రసాద్, దురిశెట్టి అనుప్, బొంతల కల్యాణ్‌చంద్ర, గాజె రమేశ్, కటకం లోకేశ్, ఎన్నం ప్రకాశ్, బండ రమణారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బావులపై సర్వే


ఇరుకుల్ల వాగులో పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌కు తాగునీటి సరఫరా చేసే బావులపై శనివారం నేషనల్ హైవే, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సర్వే నిర్వహించారు. జగిత్యాల–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంతో ఇరుకుల్ల వాగులోని మూడు రక్షిత తాగునీటి బావులు, రెండు పైపులైన్లు పోతున్నాయి. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఈనెల 28న సర్పంచ్ గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి వరంగల్ నేషనల్ హైవే ఎస్‌ఈకి వినతి పత్రం సమర్పించారు. ఎస్‌ఈ ఆదేశాల మేరకు శనివారం నేషనల్ హైవే, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇరుకుల్ల వాగులోని మూడు తాగునీటి బావులను పరిశీలించారు. బావుల లోతు, వెడల్పు కొలతలు తీసుకొని పైపులైన్ల వివరాలను పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, సర్పంచ్ వెంకటమ్మను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి బావులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సర్వే నివేదికను ఎస్‌ఈకి అందిస్తామని అధికారులు తెలిపారు.

అందరికీ శాస్త్రీయ విద్యావిధానం అందించాలి


జెండా ఆవిష్కరిస్తున్న రజనీకాంత్

కరీంనగర్: దేశంలో అందరికీ శాస్త్రీయ విద్యావిధానం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దిన వేడుకలను సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఎదుట స్వాతంత్ర్యం–ప్రజాస్వామ్యం–సోషలిజం జెండాను రజనీకాంత్ ఎగరేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో అందరికీ సమానమైన విద్య, హక్కులు, ఉపాధి అవకాశాల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యలో మతోన్మాదాన్ని, కాషాయీకరణను చొప్పించే ప్రయత్నం చేస్తోందని, నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ మాట్లాడుతూ.. దేశంలో విద్యా ఉపాధి అవకాశాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. నాయకులు గజ్జెల శ్రీకాంత్, అసంపల్లి వినయ్, శ్రీజ, తిప్పారపు రోహిత్, వినీషా, సురేష్, సందేశ్, పూజ, రాకేశ్, ఆకాష్, రోహిత్, అరుణ, అశ్విత, సన్ని పాల్గొన్నారు.

గుడ్.. మిల్లెట్ ఫుడ్..



- పెరిగిన జొన్నరొట్టెల వినియోగం
- రోజురోజుకు ఆసక్తి కనబరుస్తున్న జనం

విద్యానగర్(కరీంనగర్): కరోనా పుణ్యామా అని ఇప్పుడు చాలామందికి ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. వారి ఆహార అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. ఆరోగ్యకర, పోషక విలువలున్న ఆహారానికి ప్రాధాన్యమిస్తున్నారు. చిరుధాన్యాలను విరివిగా తమ ఆహారంలో వినియోగిస్తున్నారు. ఉదయం ఇడ్లీ, వడ, దోశలకు ఫుల్ స్టాప్ పెట్టి.. ఇప్పుడు కొర్రల ఇడ్లీ, సజ్జల దోశలు, జొన్నరొట్టెలు, రాగి జావ, రాగి సంకటి వంటి వంటకాలు చేసుకుంటున్నారు. చిరుధాన్యాలతో తయారు చేసే టిఫిన్ సెంటర్లు కరీంనగర్‌లో రోజురోజుకు పెరుగుతున్నాయి.

మిల్లెట్లతో వివిధ వంటకాలు

కరీంనగర్‌లోని పలు హోటళ్లు చిరుధాన్యాలతో చేసిన వంటకాలను వినియోగదారులకు అందిస్తున్నాయి. టిఫిన్ సెంటర్లలో కొర్రల ఇడ్లీలు, సజ్జల దోశలు, జొన్నరొట్టెలు, ఉప్మా, పొంగలి అమ్మకాలు సాగిస్తున్నారు. భోజనశాలల్లో మిల్లెట్ సాంబర్, మిల్లెట్ బిర్యాని, మిల్లెట్ పన్నీర్ బిర్యానీ, మిల్లెట్ కాజు బిర్యానీ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి.


ఉప్మా

జొన్నరొట్టెలు

కరీంనగర్‌లో సాయంత్రం పలుచోట్ల మహిళలు సంప్రదాయ పద్ధతిలో జొన్నరొట్టెలు తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో కూడా జొన్నరొట్టెలు లభిస్తున్నాయి.

కొలెస్ట్రాల్ తగ్గుతుంది

చిరుధాన్యాల్లో ఉండే ఫైబర్ శరీరంలో ఉన్న కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది. మనం తిన్న ఆహారం ద్వారా శరీరం పొందిన అధిక క్యాలరీలను ఖర్చయ్యేలా చేస్తుంది. దీనివల్ల అధిక బరువు సమస్య ఉండదు. వీటిలో ఉండే విటమిన్ బీ, కార్బోహైడ్రేట్లు కొవ్వును విచ్ఛిన్నం చేసి రక్తంలోని హోమోసిస్టీన్ స్థాయిని అదుపులోకి తెస్తుంది. దీంతో రక్తనాళాల్లో ఎక్కువ కొవ్వు చేరదు. చిరుధాన్యాలైనా జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగులు, అరికలు, వరిగలు, ఊదలు, సామలు, అవిసెలు తదితరాలు రోజూ ఆహారంలో ఉండేలా చూసుకుంటే.. గుండె సమస్యలు రావని డాక్టర్లు వెల్లడిస్తున్నారు.


మిల్లెట్ వంటకాలను ఆరగిస్తున్న నగరవాసులు

చిరుధాన్యాల్లో పోషకాలెక్కువ



చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉండి శరీరంలో రక్త శాతం సరిగా ఉండి సర్జరీ సమయంలో రక్తం కోల్పోయినా పెద్దగా నష్టం ఉండదు. రక్తం సమకూర్చుకునే అవకాశముంటుంది. కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్, ఫైబర్, మినరల్స్, విటమిన్ బీ12, బీ6 వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. మాంసాహారంతో పోలిస్తే చిరుధాన్యాల్లో ప్రొటీన్స్, ఐరన్ ఎక్కువగా ఉంటుంది.

– డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్. జనరల్ సర్జన్, శ్రీసాయి లైఫ్‌లైన్ హాస్పిటల్, కరీంనగర్

మిల్లెట్ వినియోగం పెరిగింది



మిల్లెట్ వినియోగం బాగా పెరిగింది. చాలామంది మిల్లెట్లతో చేసిన ఆహారాన్ని ఇష్టపడుతున్నారు. మా పర్ణశాలలో ప్రతిరోజు ఉదయం మిల్లెట్లతో చేసిన ఇడ్లీ, దోశ, ఉప్మా, పొంగలి అందుబాటులో ఉంటుంది. భోజన సమయంలో మిల్లెట్ సాంబర్, మిల్లెట్ బిర్యానీ, మిల్లెట్ పన్నీర్ బిర్యానీ, మిల్లెట్ కాజు బిర్యానీ లభిస్తుంది.

– డి.సదాశివరావు, పర్ణశాల హోటల్ నిర్వాహకుడు, కమాన్ చౌరస్తా, కరీంనగర్

మనిషికి ఆరోగ్యం ముఖ్యం



కరోనా సమయంలో ఆరోగ్యం విలువ తెలిసి వచ్చింది. అప్పటి నుంచి బియ్యం బదులు బ్రౌన్‌రైస్, కొర్రలు ఎక్కువగా ఉపయోగిస్తున్నాం. రాత్రి భోజనం మానేసి జొన్నరొట్టెలు తింటున్నాం. డాక్టర్లు కూడా చిరుధాన్యాలనే ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. వారి సూచనలు పాటిస్తూ చిరుధాన్యాలకు ప్రాధాన్యమిస్తున్నాం.

– పవన్‌కుమార్, ఎలక్ట్రికల్ మోటార్స్ మెకానికల్ ఇంజనీర్, కమాన్ చౌరస్తా, కరీంనగర్

మూడు గ్రామాలు.. 1,657 దరఖాస్తులు


దుబ్బపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నవీన్‌కుమార్

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్, దుబ్బపల్లి, ఎలబోతారం గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు లబ్ధిదారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దుబ్బపల్లిలో ఒకరోజు ముందుగానే దరఖాస్తు ఫారాలను ఇవ్వడంతో లబ్ధిదారులు వివరాలను నింపుకొని అధికారులకు అందించారు. దుబ్బపల్లిలో 220, దుర్శేడ్‌లో 973, ఎలబోతారంలో 464 దరఖాస్తుల చొప్పున మొత్తం 1,657 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. గ్రామసభలు జరిగిన గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు బొమ్మకల్‌లో 1,711, చామనపల్లిలో 678, చెర్లభూత్కూర్‌లో 782, నగునూరులో 929 దరఖాస్తులు వచ్చాయి. ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచులు సిరిగిరి దుర్గ, గాజుల వెంకటమ్మ, కట్ల లక్ష్మి, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఎంపీటీసీ సభ్యులు గొల్లె రాజ్యలక్ష్మి, చల్లా రామక్క, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఆర్‌ఐలు రజనీకాంత్, వాస్తవిక్, ఏవో సత్యం, ఏపీవో శోభ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.తిరుపతి, నాయకులు బుర్ర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించండి



మాట్లాడుతున్న వెంకటేశ్

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం కోతిరాంపూర్‌లోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో గీట్ల ముకుందరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా ప్లీనరీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పది సంవత్సరాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ ఓట్లు దండుకోవాలని చూస్తోందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి సాధించారో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, శీలం అశోక్, మక్కాపల్లి పూజ, నరేశ్, నాయకులు కోనేటి నాగమణి, గజ్జల శ్రీకాంత్, మాతంగి శంకర్, తిప్పారపు సురేశ్, రాయికంటి శ్రీనివాస్, బి.సంపత్‌రావు, రాములు, కొప్పుల శంకర్, గుండేటి వాసుదేవ్, పున్నం రవి, పుల్లెల మల్లయ్య, జి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ టికెట్ నేతకాని కులస్తులకు ఇవ్వాలి


లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న నేతకాని కులస్తులు

కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి(ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పోటీ చేసేందుకు నేతకాని కులస్తులకు అవకాశం కల్పించాలని సంఘం రాష్ట్ర బాధ్యులు శనివారం హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ నాయకుడు డాక్టర్ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2.5లక్షల నేతకాని కులస్తుల ఓట్లున్నాయని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న జాడి బాల్‌రెడ్డికి టికెట్ కేటాయిస్తే గెలిపించుకుంటామన్నారు. నాయకులు టేకుమట్ల ప్రభాకర్, పిప్పల గంగారాం, జాడి రాజయ్య, కామెర లక్ష్మణ్, గోల్లె కిష్టయ్య, దుర్గం చందు, గట్టు బానేష్, శివలింగు, రాజయ్య, రంగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు


మానేరులో కేక్ కట్ చేస్తున్న అనంతరెడ్డి


చింతకుంటలోని ఎస్‌ఆర్‌ఎం కళాశాలలో ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్


కొత్తపల్లి సెయింట్‌జార్జ్‌లో..



భగవతిలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్)/కొత్తపల్లి: కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తుగా న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని అందంగా బెలూన్‌లతో ముస్తాబు చేశారు. కేకులను కట్ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థల డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. చింతకుంట శివారులోని ఎస్‌ఆర్‌ఎం ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు కేక్ కట్ చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ ఎం.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేక్ కట్ చేశారు. పాఠశాల చైర్మన్ డా.పి.పాతిమారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వింధ్యావాలీలో కేక్ కట్ చేస్తున్న లక్ష్మీప్రకాశ్‌రావు


బ్లూబెల్స్‌లో వేషధారణలో విద్యార్థులు

కలెక్టరేట్ ఎదుట ఆటోడ్రైవర్ల ధర్నా


ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

కరీంనగర్: మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆటోడ్రైవర్లు, ఓనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీవనభృతి నెలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆటోకార్మిక జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దెల రాజేందర్, బండారి సంపత్ మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల తమకు కిరాయిలు లేకుండా పోయాయన్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు కొనసాగే పరిస్థితి లేదని, ఆటోల ఫైనాన్స్, టాక్స్ చెల్లింపు, రిపేర్లకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆటోడ్రైవర్ల కుటుంబాలకు ఆకలి చావులు తప్పవన్నారు. వెంటనే జీవనభృతి ఇవ్వాలని కోరారు. కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందించారు. తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహనాయక్, సత్యనారాయణ, మల్లేశం, ఐలేశ్, సంపత్, ఉత్తమ్‌కుమార్, పెద్దులు, రవీందర్ పాల్గొన్నారు.

'శాతవాహన'కు న్యాక్ గ్రేడ్ సాధిస్తాం

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీకి యూజీసీ 12బీ సాధించామని, అదే లక్ష్యంతో న్యాక్ గ్రేడ్‌ను సాధిస్తామని వర్సిటీ వీసీ డా.మల్లేశ్ సంకశాల తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వర్సిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. 2023లో విశ్వవిద్యాలయంలో పరీక్షలు, గణాంక విభాగాల్లో కొన్ని నూతన సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు.

'అచీవర్స్'లో ఆవిష్కార్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

కరీంనగర్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఆవిష్కార్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయస్థాయి ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సైన్స్ రిసోర్స్‌పర్సన్ బి.ఓదెలుకుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలించి విద్యార్థుల ఆవిష్కరణలు చాలా ఆలోచనాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీసేందుకు ఆవిష్కార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శిశుగృహ నుంచి శిశువు దత్తత

కరీంనగర్: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ శిశుగృహ నుంచి 4 నెలల శిశువును దత్తతకిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా హైదరాబాద్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు శిశువును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాలని, ఇది చట్టబద్ధమైన ప్రక్రియ అని అన్నారు. చట్టబద్ధమైన దత్తత ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, ఐసీపీఎస్ సిబ్బంది తిరుపతి, రాజేశ్, రాజ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

'సాధన'లో ఎడ్యు కార్నివల్ వేడుకలు

కరీంనగర్: జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాల ఆవరణలో సాధన ఎడ్యు కార్నివాల్ పేరుతో వైజ్ఞానిక ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ సి.హెచ్.శ్రీనివాస్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ సి.హెచ్.నీలిమ జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలు పిల్లల మానసిక వికాసానికి, భవిష్యత్తుకు బాటలు వేయడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎంతో దోహదపడతాయన్నారు. నక్షత్రాల జీవిత చరిత్ర, చంద్రయాన్–3, హైపర్ లూప్స్, క్రిమిసంహారక చెట్లు, రక్త శుద్ధీకరణ యంత్రం, సూర్య కుటుంబం, ఆధునిక వ్యవసాయ పనిముట్లు వాటి వినియోగం, అణు విద్యుత్ అంతరిక్ష కేంద్రం, స్మార్ట్ డస్ట్ బిన్, వాటర్ ఫౌంటెన్, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన దాదాపు 200కు పైగా ప్రాజెక్టులతో వారి నైపుణ్యాలను ప్రదర్శించారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ వి.కుమారస్వామి, ప్రైమరీ హెచ్‌ఎం ఆర్.ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమర్థవంతమైన బోధన పద్ధతులు పాటించాలి


కరీంనగర్ సిటీ: అధ్యాపకులు నిరంతరం సమర్థవంతమైన బోధన పద్ధతులు పాటించాలని, విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించడానికి నిరంతర శిక్షణ పొందాలని శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డా.ఎస్‌వీ రంగప్రసాద్ అన్నారు. మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులకు శిక్షణ శిబిరం నిర్వహించామని చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీరంగప్రసాద్ ఎంగేజ్ ఆఫ్ ఎంపవర్ స్ట్రాటజెస్ ఆఫ్ డైనమిక్ క్లాస్‌రూమ్స్ అనే అంశంపై ప్రసంగించారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ఆలయాల్లో శనివారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్ రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకా పరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనలు, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా శివ కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురాణం మహేశ్వరశర్మ

విద్యానగర్(కరీంనగర్): జ్యోతినగర్‌లోని కమల పెరల్స్ అపార్ట్‌మెంట్‌లో శనివారం వేదపండితుడు పురాణం మహేశ్వరశర్మ శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భగవంతుడు ఎక్కడో దూరంగా ఉన్నాడనుకోవడం అజ్ఞానమని, ఆయన మనలోనే ఉన్నాడన్నారు. భక్తి, జ్ఞానం భిన్నమైనవనుకోవడం సరికాదని అన్నారు. తొడుపునూరి సంతోష్‌కుమార్, శివ, నీరజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాముడి అక్షింతలతో శోభాయాత్ర

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్‌లో శనివారం అయోధ్య శ్రీరాములోరి కలశం, అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. గోపాల్‌పూర్ చౌరస్తా నుంచి భక్తుల మేళతాళాలు, జైశ్రీరాం నినాదాల నడుమ ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్రగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊరడి మంజుల, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, శ్రీకృష్ణ, హన్మాన్ ఆలయ కమిటీ చైర్మన్లు గోనె ఎల్లారెడ్డి, సాయిని సత్యనారాయణ, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి, నాయకులు తోట తిరుపతి, వేణుగోపాల్, ఊరడి మల్లారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, పునేందర్, రాజ్‌కుమార్, తుమ్మ ఆంజనేయులు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జనవరిలో 'తిరుమల' విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి నెలలో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం శనివారం ప్రకటించింది. 1న పెద్దశాత్తు మొర, వైకుంఠ ద్వార దర్శనం ముగింపు, 5న అధ్యయనోత్సవాల ముగింపు, 6న తిరుమల శ్రీవారు తిరుమలనంబి సన్నిధికి వేంచేపు, 7న సర్వఏకాదశి, 9న తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 14న భోగిపండుగ, ధనుర్మాసం ముగింపు, 15న మకర సంక్రాంతి, సుప్రభాత సేవ పునఃప్రారంభం, 16న తిరుమల శ్రీవారు పార్వేట మండపానికి వేంచేపు, కనుమ పండుగ, 25న శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి, 28న తిరుమొళిశైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 31న కూరత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం జరగనున్నాయి.

శ్రీశైల దేవస్థానంలో 'ప్రాతః కాలసేవ'

- జనవరి 3 నుంచి అమలు
- ఆన్‌లైన్‌లో రోజుకు 5 టికెట్లు మాత్రమే



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో జనవరి 3వ తేదీ నుంచి స్వామి అమ్మవార్లకు నూతనంగా ప్రాతఃకాల ఆర్జిత సేవ అందుబాటులోకి రానుంది. రోజుకు ఐదు టికెట్లు అందుబాటులో ఉండనుండగా, సేవా రుసుం రూ.25,116గా నిర్ణయించారు. టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే విక్రయిస్తారు. ఈ సేవలో దంపతులు లేదా ఒకరికి మాత్రమే అనుమతి. 10 సంవత్సరాల్లోపు పిల్లలుంటే మల్లికార్జున స్వామి వారి స్పర్శదర్శనం మాత్రమే కల్పిస్తారు. సేవలో భాగంగా మొత్తం ఆరు సేవలను నిర్వహించుకోవచ్చు. దీనిపై దేవస్థాన ఈఓ డీ పెద్దిరాజు మాట్లాడుతూ భక్తుల సూచనలు, సలహా మేరకు ఈ ఆర్జిత సేవను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే

ఎక్కువ మందికి పెన్షన్లు ఇచ్చేది కూడా మనందరి ప్రభుత్వమే

- పెన్షన్ రూ.3 వేలకు పెంపు సందర్భంగా లబ్ధిదారులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ



సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు దేశంలో రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని, ప్రజలందరి ఆశీస్సులతోనే ఇదంతా చేయగలుగుతున్నాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి మొదలయ్యే పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వం అవ్వాతాతల పెన్షన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచుతున్న సందర్భంగా ఆయన రాష్ట్రంలో దాదాపు 66 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు లేఖలు రాశారు. ఒకటవ తేదీన వలంటీర్లు లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్ డబ్బులు అందజేస్తూ, వారికి ముఖ్యమంత్రి రాసిన లేఖ ప్రతులను అందజేయనున్నారు. ఇప్పటికే ఆ లేఖల ముద్రణ పూర్తయి, జిల్లాల వారీగా వాటిని చేర్చే ప్రక్రియను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పూర్తి చేసింది. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమేనని, మనందరి ప్రభుత్వమే ఇవన్నీ చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నట్లు సీఎం జగన్ ఆ లేఖలో తెలిపారు. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటున్నట్లు కూడా పేర్కొన్నారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.

ప్రియమైన అవ్వాతాతలకు..

మీకు, మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఈ రోజు 2024 జనవరి 1 నుంచి.. ఇచ్చిన మాట ప్రకారం.. ఇక మీ చేతికి అందే పెన్షన్ రూ.3000 అవుతుంది. నా సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నోరు తెరిచి అడగలేని ఎంతో మంది అవ్వాతాతలను, దురదృష్టవశాత్తు భర్తను కోల్పోయి జీవితాన్ని భారంగా నెట్టుకొస్తున్న వితంతువులను.. కష్టాలు, కన్నీరు తుడిచే వారు లేక దుఃఖంలో ఉన్న దివ్యాంగుల కన్నీటి వ్యథలను నేను స్వయంగా చూశాను. మీ మనవడిగా, మీ బిడ్డగా, మీ సోదరుడిగా ఆ మాటకు కట్టుబడి.. మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్టు తు.చ. తప్పక పెన్షన్‌లను పెంచుకుంటూ మీ అందరి ఆశీర్వాదంతో, దేవుడి దయతో అందిస్తునందుకు సంతోషిస్తున్నాను. ఈ పెన్షన్ పెంపుతో మేనిఫెస్టోలో ఇచ్చిన నూరు శాతం హామీలు అమలు చేశామని చెప్పడానికి గర్వపడుతున్నాను.

చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు వరకు పింఛన్ కేవలం రూ.1,000 ఉండేది. ఆ ఐదేళ్లలో ఒక్కో అవ్వాతాతల కుటుంబానికి ఇచ్చిన పెన్షన్ రూ.58 వేలు. అదే మీ జగన్ తన నాలుగున్నర ఏళ్ల పాలనలో ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.47 లక్షలు. దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.67 లక్షలు. రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు అర్హులైన మరో 28.35 లక్షల మందికి.. కొత్తగా పెన్షన్‌లు మంజూరు చేశాం. ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్న వారి సంఖ్య దాదాపు 66 లక్షలని చెప్పడానికీ సంతోషిస్తున్నాను.

గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ, పెన్షన్ మంజూరు కావాలంటే నరకమే. పెన్షన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు, పెన్షన్ తీసుకోవడానికీ లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు. కానీ, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన.. అది ఆదివారమైనా, మరే ఇతర సెలవు రోజైనా సరే సూర్యోదయంతోనే మీ ఇంటి తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెపుతూ మన వలంటీర్లు మీకు పెన్షన్ అందిస్తున్నారు. పెన్షన్ కోసం పడిగాపులు పడి, ఎక్కడో ఉన్న కార్యాలయం చుట్టూ తిరిగిన గత ప్రభుత్వ విధానాలకు.. మనందరి ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రధానమైన తేడా.. మనది మనసున్న ప్రభుత్వం. మనది పేదలు, మహిళలు, రైతుల పక్షపాత ప్రభుత్వం.

దేశంలోనే రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏదైనా ఉందంటే అది మన రాష్ట్రమని, ప్రజలందరి మన ప్రభుత్వమే ఇది చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమే. మీ ఆశీస్సులతోనే ఇదంతా చేయగలిగాను.

మీ ఆశీస్సులు, మీ మద్దతే నా బలం. ఆ బలం వల్లే కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్న ఈ సందర్భంలో ఇలాంటి మంచి ప్రయత్నాలను కొనసాగించగలిగాను. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు మంచి జరగాలని.. ఆ దేవుడి దయ ఉండాలని కోరుకుంటున్నాను. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటూ.. మరోసారి మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ప్రేమతో మీ..
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

'సామాజిక' జైత్రయాత్ర

నంద్యాల, గుంటూరు జిల్లా తాడికొండ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఉత్సాహంగా సాగిన సామాజిక సాధికార యాత్రలు

సభలకు పోటెత్తిన బడుగు, బలహీనవర్గాలు

జై జగన్.. జైజై జగన్ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణాలు

సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్న నేతలు

పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికల్లో పేదల పక్షపాతి అయిన సీఎం జగన్ వెంట నిలవాలని పిలుపు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే గ్రూప్–2, గ్రూప్–1, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు భర్తీకి చర్యలు తీసుకున్న ఏపీపీఎస్సీ.. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 11 సబ్జెక్టుల్లో 240 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించింది. పోస్టులు, విద్యార్హతలు, వేతనం, తదితర వివరాలతో కూడిన పూర్తి సమాచారాన్ని సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో జనవరి 24 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొంది. పోస్టులకు సంబంధించి అభ్యర్థులు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్ల పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందులో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (పేపర్–1) 150 మార్కు లకు డిగ్రీ స్థాయిలో ఉంటుంది. పేపర్–2 సంబంధిత సబ్జెక్టు పీజీ స్థాయిలో 150 ప్రశ్నలు 300 మార్కులకు ఉంటుంది. తప్పు సమాధా నానికి మైనస్ మార్కులు ఉంటాయని కమిషన్ పేర్కొంది. అభ్య ర్థులు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. పరీక్షల సబ్జెక్టు సిలబస్ https://psc. ap.gov.inలో చూడవచ్చు.

ఏ సబ్జెక్టులో ఎన్ని పోస్టులు

సబ్జెక్టు	పోస్టులు
బోటనీ	19
కెమిస్ట్రీ	26
కామర్స్	35
కంప్యూటర్ అప్లికేషన్స్	26
కంప్యూటర్ సైన్స్	31
ఎకనామిక్స్	16
హిస్టరీ	19
మ్యాథమెటిక్స్	17
ఫిజిక్స్	11
పొలిటికల్ సైన్స్	21
జువాలజీ	19
మొత్తం	240



శనివారం తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ దర్శించుకున్నారు. తిరుమలలో శుక్రవారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారిని 56,200 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో కానుకలుగా రూ.3.89 కోట్లు సమర్పించారు.











ఆనంద'హేళ'

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో శనివారం రాత్రి ఆనందమేళా ప్రారంభమైంది. లలిత కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేబాశిస్ ఛటోపాధ్యాయ, దక్షిణ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు సుచిత నంది, రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు స్టాల్స్ పరిశీలించారు. చిన్నారుల కోసం ఆట వస్తువులు, క్రిస్మస్ ట్రీలు ఆహ్లాదపరిచాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రముఖ గజల్ సింగర్ సుభాష్ పాండ బృందం ఆలపించిన గజల్స్ ఉర్రూతలూగించాయి. చిన్నారుల నృత్యాలు ఉత్తేజపరిచాయి.

చెడు వ్యసనాలు వద్దన్నందుకు చంపేశాడు

- భార్యను కడతేర్చిన భర్త
- శరీరం నుంచి తలను వేరు చేసిన నిందితుడు
- నిర్మల్ జిల్లా దిమ్మతుర్తిలో ఘటన

మామడ: వారిది మూడు దశాబ్దాలకుపైగా వైవాహిక బంధం. వీరి అన్యోన్య దాంపత్యాని గుర్తుగా ముగ్గురు పిల్లలు జన్మించారు. అందరినీ పెంచి పెద్ద చేశారు. ముగ్గురికీ పెళ్లిళ్లు కావడంతో వేరు కాపురం పెట్టారు. దంపతులు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసైన భర్తను భార్య మందలిస్తూ వస్తోంది. ఈ వయసులో చేయకూడని పనులు చేస్తున్నావని గొడవ పడింది. తన జల్సాలకు అడ్డు పడుతున్న భార్యను కడతేర్చాలనుకున్నాడు. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మతుర్తిలో శనివారం జరిగింది. నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, మామడ ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం..

మామడ మండలం దిమ్మదుర్తి గ్రామానికి చెందిన సూర నర్సయ్య–లక్ష్మి(49) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ పిల్లలను పెంచి పెద్ద చేశారు. కూతురుకు పెళ్లిచేసి అత్తారింటికి పంపించారు. ఇద్దరు కొడుకులకు కూడా పెళ్లిళ్లు అయ్యాయి. పెద్ద కొడుకు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. చిన్న కుమారుడు గ్రామంలోనే వేరుగా ఉంటున్నారు. ఇంట్లో నర్సయ్య–లక్ష్మి మాత్రమే ఉంటున్నారు. నర్సయ్య జల్సాలకు అలవాటు పడ్డాడు. ఏ పనీ చేయకుండా మద్యం తాగడంతోపాటు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మి భర్తను వారించింది. మందలించినా మార్పు రాలేదు. నర్సయ్య తాగుడుకు బానిసయ్యాడు. భర్తను మార్చేందుకు లక్ష్మి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈ క్రమంలో దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. మూడేళ్ల క్రితం పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.



నిర్మల్‌లో వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీనివాస్



సూర లక్ష్మి(ఫైల్)

అడ్డు తొలగించుకోవాలని..

తన జల్సాలకు భార్య అడ్డుపడడాన్ని నర్సయ్య జీర్ణించుకోలేకపోయాడు. ఈ క్రమంలో లక్ష్మి అడ్డు తొలగించుకుంటే.. తనకు అడ్డు చెప్పేవారు ఉండరని భావించాడు. ఈ క్రమంలో భార్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన నర్సయ్య తనకు మోటార్ సైకిల్ కొనివ్వాలని గొడవ పడ్డాడు. క్రమంగా గొడవ పెద్దది కావడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి నచ్చజెప్పి వెళ్లిపోయారు. తర్వాత లక్ష్మి నిద్రపోయింది. కానీ మద్యం మత్తులో ఉన్న నర్సయ్య భార్య చంపడానికి ఇదే అదునని భావించాడు. వెంటనే కత్తిని తెచ్చుకుని నిద్రపోతున్న లక్ష్మిని కిరాతకంగా హత్య చేశాడు. మొండెం నుంచి తలను వేరుచేశాడు. అనంతరం ఇంట్లో నుంచి పారిపోయాడు. శనివారం ఉదయం ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానించిన చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా లక్ష్మి రక్తపు మడుగులో పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. మండలంలోని న్యూసాంగ్వి క్రాస్ రోడ్డు వద్ద నర్సయ్యను అదుపులోకి తీసుకున్నారు.

ఇండియా కూటమిదే విజయం

సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు 'చాడ'

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం ఎల్.ప్రకాశ్ అధ్యక్షతన శనివారం జరిగింది. చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ సర్కార్.. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించడంలో విఫమైందని విమర్శించారు. విభజన హామీలు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు హామీలుగానే మిగిలాయని పేర్కొన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్న సమయంలో రామమందిరం పేరిట దేశంలో మతోన్మాదంతో ముందుకు వస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌తోపాటు మిగతా పార్టీలు ఐక్యంగా బీజేపీ, మోదీ సర్కారుని ఓడించడమే లక్ష్యంగా పనిచేయడానికి వామపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సింగరేణి కార్మికులు ఏఐటీయూసీని గెలిపించడం అభినందనీయమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కార్యవర్గ సభ్యులు గోషిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, కదారి సునీల్, కోడెం స్వామి, చంద్రగిరి ఉదయ్, మాటేటి శంకర్, రాజారత్నం, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఆర్జీయూకేటీ అభివృద్ధికి రోడ్‌మ్యాప్

- రెడీ చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి
- విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

నిర్మల్: ఆర్జీయూకేటీ విద్యార్థులు ఉత్తమంగా చదివాలని, వర్సిటీకి, రాష్ట్రానికి ఉన్నత పేరు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్రిపుల్‌ఐటీ సమగ్ర అభివృద్ధి రోడ్‌మ్యాప్ రూపొందించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఆర్జీయూకేటీ, బాసరలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశంగౌడ్, ప్రొఫెసర్ లింబాద్రి, వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ వెంకటరమణతోకలిసి అందజేశారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వర్సిటీని ప్రత్యేకమైన విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలను పెంపొందించడానికి పరిశ్రమలు, సంస్థలతో కలిసి పని చేయాలని వీసీని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ అసోసియేటెడ్ డీన్ డాక్టర్ దత్తు, లైజనింగ్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందిస్తున్న సీఎం, ఉన్నతాధికారులు

మూడు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం

- హాజరైన డీఐజీ సుమతి
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై సమీక్ష
- ఆరుజిల్లాల పోలీసు అధికారుల హాజరు
- పోలీస్ కమిషనరేట్‌కు చేరిన హెలిక్యాప్టర్

గోదావరిఖని: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని మూడు రాష్ట్రాల పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం ఈసమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఐబీ డీఐజీగా సుమతి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రామగుండం కమిషనరేట్ వచ్చిన సందర్భంగా ఈసమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. రామగుండం పోలీస్ కమిషనరేట్ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాలు ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, ఆసిఫాబాద్, భూపాల్‌పల్లి జిల్లాల పోలీసు అధికారులతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు జిల్లాలకు చెందిన ఎస్పీ, ఇతర అధికారులు ఈసమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా శాంతిభద్రతల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు తెలియజేశారు. గతేడాది మావోయిస్టుల అదుపునకు తీసుకున్న చర్యలు, అలాగే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీసు అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. మావోయిస్టుల కదలికలు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐబీ డీఐజీ సూచించినట్లు సమాచారం.



కమిషనరేట్‌లో ల్యాండ్ అయిన హెలిక్యాప్టర్

హెలిక్యాప్టర్‌లో గడ్చిరోలి అధికారులు

రామగుండం పోలీసు కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా ఎస్పీ, ఇతర ఐపీఎస్ అధికారులు హెలిక్యాప్టర్ ద్వారా కమిషనరేట్‌కు చేరుకున్నారు. ఇటీవల రెండు రాష్ట్రాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు, తీసుకున్న చర్యలను రెండు రాష్ట్రాల అధికారులు వివరించారు.

అత్యాధునిక పద్ధతులతో ఫలితాలు

భీమారం: అత్యాధునిక పద్ధతులతో రైతులు మంచి ఫలితాలు పొందవచ్చని కేంద్ర ఫర్టిలైజర్, కెమికల్స్ జాయింట్ సెక్రెటరీ మనోజ్‌సేథ్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా శనివారం మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఆరెపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో ప్రజలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖర్చు ఎక్కువ అవుతుందని, ఈ నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తోందని అన్నారు. అందులో డ్రోన్ కీలకమనని, 10నిమిషాల్లో 10 ఎకరాలకు క్రిమిసంహారక మందులు స్ప్రే చేయవచ్చని తెలిపారు. వ్యవసాయంలో సేంద్రీయ పద్ధతులపై దృష్టి సారించాలని తెలిపారు. డీఆర్‌డీవో శేషాద్రి మాట్లాడుతూ మహిళలకు రుణాలు ఇచ్చి వారి అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపు, ఎంపీడీవో శ్రీనివాస్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బ్రాంచి మేనేజర్ ఎస్.ప్రతీక్, రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ ద్వారా స్ప్రేపై రైతులకు వివరిస్తున్న మనోజ్‌సేథ్



కొత్త సంవత్సరమా మనిషిని మేల్కొలుపు

రోడ్డున ప్రమాదం చూస్తే సాయానికి పరిగెత్తి వెళ్లే మనిషిని,
చుట్టూ చెడు జరిగితే మనకెందుకులే అనుకోని మనిషిని,
ఇరుగింట్లో ఆర్తనాదాలకు చలించే మనిషిని, పొరుగింట్లో కష్టానికి హాజరయ్యే మనిషిని,
ద్వేషమే జీవితంగా బతకని మనిషిని, ఒకరు బాగుపడితే సంతోషపడే మనిషిని,
అడుగంటిపోయిన మానవత్వాన్ని జాగృతం చేసుకునే మనిషిని,
మనిషి మీద నమ్మకం నిలిపే మనిషిని, ఓ కొత్త సంవత్సరమా మేల్కొలుపు.

వద్దు.

నమ్మాల్సిన చోట నేరం చేసే మనిషి వద్దు.

భర్తగా ఉంటూ, భార్యగా ఉంటూ, స్నేహితుడిగా ఉంటూ, అత్త మామగా ఉంటూ, బంధువుగా ఉంటూ... వీరిని నమ్మొచ్చు, వీరిని కాకపోతే ఎవరిని నమ్ముతాం... అనుకున్న సందర్భంలో కూడా నేరం చేసి, ప్రాణం తీసి మనిషి మీద నమ్మకమే పోగొట్టిన– 2023లో చాలాసార్లు కనపడిన మనుషి– కొత్త సంవత్సరంలో వద్దు.

'అయ్యో... నా గోడు ఎవరూ వినట్లేదే' అని కన్నపిల్లలతో పాటు నిస్సహాయంగా వెళ్లి చెరువులో దూకే కన్నతల్లి వద్దు. 'నా బాధ అమ్మానాన్నలు వినట్లేదే'నని హాస్టల్ ఫ్యాన్లకు వేళ్లాడే ముక్కుపచ్చలారని పిల్లలూ వద్దు. నలుగురు సంతానం ఉన్నా, మీ దగ్గర ఉంచుకుని నాలుగు మెతుకులు పెట్టండి చాలు అంటున్నా వృద్ధాశ్రమాల్లో తల్లిదండ్రులను పడేసి వారిని బాధించే స్వార్థ సంతానం వద్దు. సాకులు చెప్పే సంతానం వద్దు. ముఖ్యంగా– తల్లిదండ్రుల శాపం అందుకునే సంతానం వద్దు.

జీవితమంటే అనుక్షణం డబ్బు సంపాదనే అనుకునే, ఎంత ఉన్నా సరిపోదనుకునే మనిషి వద్దు. అందుకు ఉద్యోగ బాధ్యతలను కలుషితం చేసే, ప్రజల భవిష్యత్తును బలి పెట్టే మనిషి వద్దు. కల్తీ చేసే మనిషి, విషం లాంటి ఆహారం అమ్మే, కూరనారలను రసాయనం చేసే మనిషి వద్దు. వ్యసనపరులుగా మార్చే ఉత్పత్తులను తయారు చేసే మనిషి వద్దు. అందుకు అనుమతించే ప్రభుత్వ నేతలూ వద్దు.

వైద్యం తెలియని వైద్యుడు వద్దు. దైవభీతి పాపభీతి లేని వైద్యుడు వద్దు. రోగి మీద దయ, సానుభూతి లేని వైద్యుడు వద్దు. రోగుల అశ్రువులను అంతస్తులుగా చేసి ఆస్పత్రులు నిర్మించాలనుకునే వైద్యుడు వద్దు. చదువుల పేరుతో తల్లిదండ్రుల కడుపులో గంజిని కూడా తాగే విద్యావ్యవస్థల యజమాని కూడా వద్దు.

మూర్ఖుడు వద్దు. మూకస్వభావము ఉన్నవాడూ వద్దు. ఎవరో రెచ్చగొడితే రెచ్చిపోయి సాటి మనిషిని ద్వేషించే వాడు వద్దు. బతకగోరని వాడు వద్దు. బతకనివ్వనివాడు వద్దు. అమాయకుల నుంచి లాక్కుని నింగినీ, నేలనూ మింగేసేవాడు వద్దు. ఉద్యోగుల గోడు వినని యజమాని వద్దు. పిలిస్తే పలకని పోలీసు వాడు వద్దు. న్యాయం వైపు నిలవని తీర్పు కూడా వద్దు.

2024 సంవత్సరమా...

ఎన్నో ఆశలను కల్పిస్తూ అడుగిడుతున్న నూతన వత్సరమా...

ఎంత జరిగినా ఏమి జరిగినా 'మానవుడే మహనీయుడు' అని నిరూపించే నిదర్శనాలను ఈ సంవత్సరం చూపు. మనిషిని మేల్కొలుపు. మనిషి తప్ప మరెవరూ ఈ జగతిని శాంతితో, కాంతితో నింపలేరు.

కుడికాలు ముందు పెట్టి రా తల్లీ!

రివైండ్ 2023

త్రివిధ దళ ప్రతిభావంతుల ప్రథమ అడుగు



త్రివిధ దళాలలో మహిళా అధికారులకు సంబంధించి ఈ సంవత్సరంలో ఎన్నో 'ప్రథమం'లు కనిపిస్తాయి. మహిళా సైనికులు ఆర్టిలరీ బ్రాంచిలలోకి అడుగుపెట్టారు. యుద్ధనౌకల కమిషనింగ్ బృందంలో భాగం అయ్యారు. అత్యంత కఠినమైన యుద్ధభూమి సియాచిన్‌లోకి వైద్యసేవల కోసం వెళ్లారు. భారత నావికా దళానికి చెందిన గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక 'ఐఎన్ఎస్' ఇంఫాల్ మహిళా అధికారులు, నావికులతో ప్రత్యేక వసతులతో కూడిన తొలి యుద్ధనౌకగా అవతరించింది, నావికా, వైమానిక దళాలు తమ ఆపరేషన్‌లకు సంబంధించిన ప్రతి విభాగం లోకి మహిళలను అనుమతిస్తున్నాయి. ఇంతకాలం పురుషులు మాత్రమే నాయకత్వ స్థానంలో ఉండే విభాగాలలో ఈ సంవత్సరం మహిళా అధికారులు నాయకత్వ స్థానాల్లోకి వచ్చారు....

■ హరియాణాలోని జింద్ జిల్లాకు చెందిన చెందిన **పాయల్ చబ్ర** ఎంబీబీఎస్, ఎంఎస్ చేసింది. అంబాలా కంటోన్మెంట్‌ని ఆర్మీ హాస్పిటల్, లడఖ్‌లోని ఖర్దుంగ్లా ఆర్మీ హాస్పిటల్‌లో పనిచేసింది. ఆ తరువాత లడఖ్‌లోని ఆర్మీ హాస్పిటల్‌లో సర్జన్‌గా పనిచేసింది. ఒకవైపు సర్జన్‌గా పనిచేస్తూనే మరోవైపు పారా కమాండో కావడానికి ఆగ్రాలోని పారాట్రూపర్స్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొందింది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరువాత పారా మిలిటరీ ప్రత్యేక భద్రతా దళంలో చేరిన తొలి మహిళా ఆర్మీ సర్జన్‌గా ప్రత్యేకత సాధించింది.

■ ముంబాయికి చెందిన **ప్రేరణ దేవస్థలీ** సెయింట్ జేవియర్స్ కాలేజీలో సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చేసింది. 2009లో భారత నావికా దళంలో చేరింది. పశ్చిమ నౌకాదళానికి చెందిన పెట్రోలింగ్ నౌక 'ఐఎన్ఎస్ త్రిన్కాత్' ఫస్ట్ ఫిమేల్ కమాండింగ్ ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది. ప్రేరణ సోదరుడు ఇండియన్ నేవీలో పనిచేస్తాడు. అతడి స్ఫూర్తితోనే నావికాదళంలోకి వచ్చింది ప్రేరణ. 'భారత నౌకాదళం అవకాశాల సముద్రం. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా మనల్ని మనం నిరూపించుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి' అంటుంది ప్రేరణ.

■ ఢిల్లీ కంటోన్మెంట్‌లోని భారత సైన్యానికి చెందిన రక్తమార్పిడి కేంద్రం(ఎఎఫ్‌టీసీ) ఫస్ట్ ఉమెన్ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రత్యేకత చాటుకుంది కల్నల్ సునీతా బీఎస్. రోహతక్ మెడికల్ కాలేజీలో 'పాథాలజీ'లో పీజీ చేసిన సునీత అరుణాచల్‌ప్రదేశ్‌లో మిలిటరీ ఆస్పత్రిలో కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేసింది.



■ 'ఫ్రంట్‌లైన్ ఐఏఎఫ్ కంబాట్ యూనిట్' కమాండర్ బాధ్యతలు స్వీకరించిన తొలి మహిళ షాలిజా ధామి. 2003లో హెలికాప్టర్ పైలట్ అయింది. 2,800 గంటలకు పైగా విమానాన్ని నడిపిన అనుభవం ఆమె సొంతం. వెస్టన్ సెక్టార్‌లోని హెలికాప్టర్ యూనిట్‌లో ఫ్లైట్ కమాండర్‌గా పనిచేసింది. పంజాబ్‌లోని లూథియానా ధామి స్వస్థలం. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చేసింది. భారత వైమానిక దళంలో శాశ్వత కమిషన్‌ను పొందిన మొదటి మహిళా అధికారిగా నిలిచింది.

■ తూర్పు లడఖ్‌లో భారత్–చైనా సరిహద్దు ప్రాంతంలో ఉన్న 'స్వతంత్ర ఫీల్డ్ వర్క్‌షాప్'కు పురుష అధికారులు మాత్రమే నాయకత్వ స్థానంలో ఉండేవారు. ఈ ఏడాది ఆ అవకాశం గీతా రాణాకు వచ్చింది. స్వతంత్ర ఫీల్డ్ వర్క్‌షాప్‌కు కమాండ్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి మహిళా అధికారిగా గీతా రాణా ప్రత్యేకత నిలుపుకుంది. ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్(ఈఎంఈ) ట్రైనింగ్ సెంటర్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహించింది గీతా రాణా.

■ స్క్వాడ్రన్ లీడర్ మనిషా పధి మిజోరం గవర్నర్ సహాయకురాలి (ఏడీసీ)గా నియామకం అయింది. మన దేశంలో గవర్నర్‌కు ఎయిడ్–డి–క్యాంప్(ఏడీసీ)గా నియామకం అయినా ఫస్ట్ ఉమన్ ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది. మనిషా స్వస్థలం ఒడిషా రాష్ట్రంలోని బెర్హంపూర్. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చేసింది. ఎయిర్ ఫోర్స్ స్టేషన్–బీదర్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్–పుణె చివరగా భటిండాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో పనిచేసింది.

■ ప్రపంచంలో అత్యంత ఎత్తయిన యుద్ధక్షేత్రం సియాచిన్ గ్లేసియర్. వైద్యసేవలు అందించడానికి ఈ ప్రమాదకరమైన యుద్ధక్షేత్రంలోకి అడుగు పెట్టిన తొలి మహిళా మెడికల్ ఆఫీసర్ (ఆపరేషనల్ పోస్ట్)గా ప్రత్యేకత చాటుకుంది కెప్టెన్ ఫాతిమా వసీమ్. దీనికిముందు 'సియాచిన్ బ్యాటిల్ స్కూల్'లో ఎన్నో నెలల పాటు కఠోరమైన శిక్షణ తీసుకుంది.

వింటర్ హెల్త్ ప్రాబ్లమ్స్

సెల్యులైటిస్ అంటే?



సెల్యులైటిస్ అనేది ఓ చర్మ వ్యాధి. కొన్ని బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లతో చర్మంపై పగుళ్లు రావడం, ఎర్రబారడం, కొద్దిపాటి వాపు మంట వంటి లక్షణాలతో బాధించే ఈ వ్యాధి తాలూకు బాధలు చలికాలంలో ఉష్ణోగ్రతలు మరింత తక్కువగా ఉన్నప్పుడు మరింత ఎక్కువవవుతాయి. అసలు సెల్యులైటిస్ రావడానికి ఏయే అంశాలు కారణమవుతాయి, లక్షణాలేమిటి, చలి కాలంలో ఇది ఎందుకిలా మరింత ఎక్కువగా బాధిస్తుంది వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

చర్మం పగుళ్లబారినట్టుగా కనిపిస్తూ, కొద్దిపాటి వాపు, ఎర్రబారడం వంటి వాటితో వ్యక్తమయ్యే ఈ వ్యాధి స్ట్రెప్టోకాకస్, స్టెఫాలోకాకస్ వంటి బ్యాక్టీరియా కారణంగా వస్తుంది. చర్మంపై ఒకచోట వస్తే మిగతా చోట్లకు పాకుతుంది. అయితే ఇది అంటువ్యాధి కాదు. ఒకరినుంచి మరొకరికి వ్యాపించదు.

ప్రేరేపించే అంశాలు...

స్ట్రెప్టోకాకస్, స్టెఫాలోకాకస్ వంటి బ్యాక్టీరియా వల్ల వచ్చినప్పటికీ... కొన్ని అంశాలు దీన్ని తీవ్రతరం చేస్తాయి. అవి... ● కాళ్లు, చేతుల్లోని రక్తనాళాల్లో ఏమైనా సమస్యలతో రక్తసరఫరాలో తేడాలు ● ఊబకాయం ● కాళ్లవాపులు ● డయాబెటిస్ ● మద్యం తాగే అలవాటు ● పై కారణాలతో పాటు వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీనం కావడం.

లక్షణాలు...

ఈ ఆరోగ్య సమస్యలో కనిపించే ఓ కీలకమైన అంశం ఏమిటంటే... సాధారణంగా సెల్యులైటిస్ దేహంలోని ఒకవైపునే కనిపిస్తుండటం విశేషం. ఈ వ్యాధి ఉన్నవారిలో కనిపించే సాధారణ లక్షణాలివి... ● ఈ వ్యాధి సోకిన ప్రాంతంలో చర్మం దురద పెడుతుండటంతో పాటు ఈ దురదలు క్రమంగా పక్కలకు వ్యాపిస్తూ ఉంటాయి. ● వ్యాధిసోకిన చర్మపు ప్రాంతంలో వాపు, ముట్టుకోనివ్వకపోవడం (టెండర్‌నెస్) ● నొప్పి, వేడిగా అనిపించడం ● జ్వరంతో పాటు అది కొందరిలో చలిజ్వరంగా వ్యక్తం కావడం. ● సెల్యులైటిస్ వచ్చిన ప్రాంతాల్లో మచ్చలతో పాటు నీటిపొక్కుల్లా (బ్లిస్టర్స్) రావడం. ● కొందరిలో చర్మంపై గుంటల్లా పడుతూ, చర్మం వదులైన తోలు మాదిరిగా కనిపించడం (స్కిన్ డింప్లింగ్).

చలికాలంలో బాధలు ఎందుకు పెరుగుతాయంటే...

సెల్యులైటిస్ లక్షణాలతో వచ్చే బాధలు చలికాలంలో పెరగడానికి, ఈ సీజన్‌లో చర్మంపై కనిపించే కొన్ని అంశాలు దోహదపడతాయి. ఉదాహరణకు...

చర్మం పొడిబారడం (డ్రైస్కిన్): ఈ సీజన్‌లో తేమ తగ్గడంతో చర్మం బాగా పొడిబారిపోతూ ఉండటం చాలామందికి అనుభవంలో వచ్చే విషయమే. పైగా చలిగాలులకు వెళ్లినప్పుడు మరింతగా పెరుగుతుంది. ఇలా పొడిబారిన చర్మం బ్యాక్టీరియా చేరడానికి అనువుగా ఉంటుంది. దాంతో సెల్యులైటిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ఈ సీజన్‌లో మాయిశ్చరైజర్లతో చర్మాన్ని తేమగా ఉంచుకుంటే ఇలా పగుళ్లబారడంతో పాటు సెల్యులైటిస్‌నూ నివారించవచ్చు.

వ్యాధినిరోధక వ్యవస్థ బలహీనపడటం / వ్యాధినిరోధక శక్తి తగ్గడం : చలికాలంలో మామూలుగానే వ్యాధినిరోధక వ్యవస్థ పనితీరు కాస్త మందగించే అవకాశముంది. దీనికి తోడు డయాబెటిస్ ఉండటం, మద్యం అలవాట్ల వంటివి ఉంటే అది వ్యాధి నిరోధక వ్యవస్థను మరింత మందకొడిగా మార్చవచ్చు. ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో సమతులాహారం తీసుకోకపోవడం, ఆహారంలో విటమిన్లు, మినరల్స్ వంటి పోషకాలు తక్కువగా ఉండటం లాంటి అంశాలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశముంది.

సెల్యులైటిస్ నివారణ ఇలా...

● చర్మాన్ని శుభ్రంగా, తేటగా ఉంచుకోవాలి. ● ఘాటైన రసాయనాలతో కూడిన వాసన సబ్బులు కాకుండా, మైల్డ్ సోప్ వాడాలి. ● మిగతా చర్మంతో పోలిస్తే... మేనిపై పొడిగా ఉండే భాగాలైన మోచేతులు, మోకాళ్ల వంటి చోట్ల మాయిశ్చరైజర్ వంటివి రాసి, తేమగా ఉండేలా చూసుకోవడం మంచిది. ● చర్మం పగుళ్ల బారి, తోలు రేగిన ప్రాంతాల్లో వాటిని గిల్లడం, లాగడం చేయకూడదు. ● గోళ్లు, చర్మంతో గోళ్లు ముడిపడే భాగాల్ని శుభ్రంగా ఆరోగ్యకరంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే అక్కడి నుంచి బ్యాక్టీరియా చర్మంపై దాడి చేసే అవకాశాలుంటాయి. ● చలికాలంలో చర్మానికి మంచి రక్షణ కలిగేలా, ఒళ్లంతా కప్పి ఉంచేలాంటి దుస్తులు వాడటం మేలు. చలి గాలులు వేగంగా తాకకుండా ఉండేలా దుస్తులు ఉండాలి. ● తమ వ్యక్తిగత దుస్తులు, సామగ్రిని ఇతరులతో పంచుకోకూడదు. ● ఇల్లు శుభ్రం చేసుకోవడం, తోటపని వంటి మన రోజువారీ కార్యక్రమాల్లో చర్మానికి ఎలాంటి గాయాలు కాకుండా జాగ్రత్తపడాలి. ఎక్కడైనా చర్మం తెగినా, గాయపడ్డా డాక్టర్ సలహా మేరకు తగిన యాంటీబయాటిక్ క్రీమ్స్ వంటివి రాస్తూ, గాయాలు వేగంగా తగ్గేలా జాగ్రత్త తీసుకోవాలి. ● పాదాల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా బాగా పొడిబారి పగుళ్లకు అవకాశం ఉండే మడమలు, అలాగే వేళ్ల మధ్యభాగాలు తేమతో, ఆరోగ్యంగా ఉంచుకునేలా జాగ్రత్త వహించాలి. ● రోజూ తగినన్ని నీళ్లు తాగాలి. ● వ్యాధినిరోధక వ్యవస్థ చురుగ్గా ఉండేందుకు అన్ని పోషకాలూ, విటమిన్లు, మినరల్స్‌తో కూడిన మంచి ఆరోగ్యకరమైన సమతులాహారం తీసుకుంటూ ఉండాలి. ● డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, తమ జబ్బులను అదుపులో పెట్టుకునేలా క్రమం తప్పకుండా మందులు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ● క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

చివరగా... చలికాలంతో కొన్ని సౌకర్యాలున్నప్పటికీ... దాంతోపాటు మరికొన్ని ఆరోగ్యసమస్యలనూ తీవ్రం చేసే సీజన్ అది. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ చర్మాన్నీ, దేహాన్నీ ఆరోగ్యంగా ఉంచుకుంటే ఈ సీజన్ నిరపాయకరంగా గడిచిపోతుంది.

చికిత్స...

సెల్యులైటిస్ తగ్గడానికి డాక్టర్ సూచనల మేరకు తగిన యాంటిబయాటిక్స్ తీసుకోవడం, ఇతరత్రా ఇన్ఫెక్షన్లు రాకుండా జాగ్రత్త వహించడం చేయాలి. పరిస్థితి తీవ్రమైతే హాస్పిటల్ చికిత్స అవసరం



డా॥ నరేంద్రనాథ్ మేడ
సీనియర్ వాస్క్యులార్ సర్జన్

ఆర్థరైటిస్!!

చలికాలంలో మరింత పెరిగే కీళ్లనొప్పులు!

చలికాలం కీళ్లనొప్పులతో బాధపడేవారికి ఓ పీడకల. కీళ్లలో ఇన్‌ఫ్లమేషన్ వచ్చి నొప్పి కలిగించే 'ఆర్థరైటిస్' సమస్య చలికాలంలో పెచ్చుమీరడానికి కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు కారణాలవుతాయి. అవేమిటో, చలికాలంలో ఈ కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం పొందడం ఎలా... వంటి అనేక విషయాలపై అవగాహన కోసం ఈ కథనం.

చలికాలంలో ఆర్థరైటిస్‌తో బాధపడేవారి వెతలు మరింతగా పెరుగుతాయి. అందుకు కారణాలు ఈ కింది విధంగా ఉంటాయి.

చలికాలంలో కీళ్లనొప్పులు పెరిగేదెందుకంటే...

మానవ శరీరంపై వాతావరణం ప్రభావం తప్పక ఉంటుంది. దేహంలో జరిగే చాలా జీవక్రియలు, రోగనిరోధక వ్యవస్థ వాతావరణంలోని తేడాలకు తగ్గట్లుగా మార్పులకు లోనవుతుంటాయి. దాంతో ఆర్థరైటిస్ కీళ్లనొప్పులతో బాధపడేవారి కండరాలు మరింతగా బిగుసుకుపోవడం, బాధలు పెరగడం జరుగుతాయి. వయసు పెరుగుతున్నకొద్దీ ఈ బాధలూ పెరుగుతాయి. ఇందుకు దోహదపడే అంశాలివి...

● చలికాలంలో చేయి లేదా కాలి వేళ్లకు రక్తప్రసరణ కాస్త మందగిస్తుంది. ఇలా జరగడాన్ని వైద్య పరిభాషలో 'రెనాడ్స్ ఫినామినా' అంటారు. అప్పటికే ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారిలో ఇది మరింత ఎక్కువ. ఇది మరింత తీవ్రతరం అయినప్పుడు కొందరిలో చేతివేళ్లు, కాలివేళ్లు కుళ్లిపోయే ప్రమాదమూ ఉంటుంది. ఇలా జరగడాన్ని 'గ్యాంగ్రీన్' అంటారు.

● ఆర్థరైటిస్ వల్ల లంగ్స్ ప్రభావితం అయినప్పుడు ఐఎల్‌డీ అనే జబ్బు వచ్చి, చలికాలంలో తీవ్రత మరింత పెరిగి బాధితుల్లో దగ్గు, ఆయాసం పెరుగుతాయి.

● మయోసైటిస్ అనే రకం కీళ్లవాతంతో బాధపడేవారిలో ఈ కాలంలో కండరాలకి రక్తప్రసరణ తగ్గడంతో వాటి కదలికలు మరింత తగ్గుతాయి. ఫలితంగా తగినంత వ్యాయామం సమకూరక... వ్యాధి లక్షణాలు పెరిగి, ఇబ్బందికరంగా మారతాయి. అందుకే కీళ్లనొప్పులతో బాధపడుతుండేవారు చలికాలం వస్తుందంటేనే ఆందోళన చెందుతుంటారు.

ఈ కాలంలో కీళ్ల నొప్పులు తగ్గాలంటే...

ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నవారు కొన్ని చిన్న చిన్న సూచనలు పాటించడం ద్వారా చలికాలంలో పెరిగే తమ బాధలను చాలావరకు అధిగమించడం సాధ్యమే. ● శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. ఉన్ని దుస్తులు, కాళ్లకు సాక్స్, చేతులకు గ్లౌవ్స్ ధరించాలి. వెచ్చదనం వల్ల నొప్పిని కలిగించే రసాయనాల తొలగింపు ప్రక్రియ, వాటిని బయటకు పంపడం మరింత వేగవంతమవుతుంది. వెచ్చదనం కారణంగా రక్తప్రవాహమూ మెరుగుపడుతుంది. కండరాలు బిగుసుకుపోవడమూ తగ్గుతుంది.

● చలికాలంలో కండరాల కదలికలు ఇబ్బందికరంగా మారడం, నొప్పులు మరింత తీవ్రతరం కావడంతో బాధితులు తమ దేహ కదలికలను బాగా తగ్గిస్తారు. దాంతో తగినంత వ్యాయామం సమకూరకపోవడంతో బాధలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే వీరు తమకు శ్రమ కలగని రీతిలో ఎంతోకొంత వ్యాయామం చేయాలి.

● చలికాలంలో సూర్యరశ్మి తక్కువ. ఫలితంగా ఒంట్లో విటమిన్–డి ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ఈ కారణంగా వ్యాధి లక్షణాల పెరిగి, బాధలు మరింత పెచ్చరిల్లుతాయి. అందువల్ల అప్పటికే ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నవారు డాక్టర్లు నిర్ణయించిన మోతాదులో, వారు సూచించిన కాలానికి విటమిన్–డి సప్లిమెంట్లు తీసుకోవాలి.

● ఈ కాలం వైరస్, బ్యాక్టీరియాల మనుగడకు అనుకూలంగా ఉండటంతో అంటువ్యాధులు పెరిగే ప్రమాదం ఉంటుంది. వాటి వల్ల కీళ్ల వాతాల తీవ్రతా పెరగవచ్చు. కాబట్టి ఆర్థరైటిస్ రోగులు చలికాలం రాకముందే డాక్టర్లు సూచించిన వ్యాక్సిన్లు తీసుకోవాలి. పైగా అంటువ్యాధుల వల్ల వయోవృద్ధులకు ముప్పు ఎక్కువగా ఉంటుంది కాబట్టి వారు తప్పనిసరిగా వ్యాక్సిన్లు తీసుకోవాలి.



● చలికాలంలో నీళ్లు, ద్రవాహారాలు తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దాంతో ఒంట్లో ద్రవాలు తగ్గి, డీ–హైడ్రేషన్ ముప్పు పెరుగుతుంది. అందుకే ఈ కాలంలో అందరూ తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఉండాలి. ● ఆర్థరైటిస్ కోసం వాడే మందుల్ని డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉండాలి.

ఈ జాగ్రత్తల ద్వారా ఆర్థరైటిస్ బాధితులు చలికాలంలో ఎదుర్కొనే బాధలను చాలావరకు నివారించుకుచ్చు.



డా॥ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్

మెడి టిప్

వింటర్‌లో ముఖం తేటగా ఉండాలంటే...!



చలికాలంలో ముఖం పొడిబారిపోవడమూ, పెదవులు పగలడం, ముఖంపై ముడతలు రావడం చాలా సాధారణం. అందరికీ తెలిసిన చిట్కా వ్యాజలైన్ రాయడంతో పాటు ఈ కాలంలోనూ ముఖం తేటగా, ఆరోగ్యంగా ఉంచేందుకు పాటించాల్సిన చిట్కాలివి...

● చలికాలంలో ఉదయం, సాయంత్రం మంచుకురుస్తున్నా... మధ్యాహ్నపు ఎండ తీక్షణంగా గుచ్చుతున్నట్టుగా ఉంటుంది. ఈ మంచుకూ, మధ్యాహ్నపు ఎండకూ నేరుగా ముఖచర్మం ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఈకాలంలో ఉండే మంచు, పొగ కలిసిన కాలుష్యం... స్మాగ్‌లోకి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. ● తేలికపాటి వ్యాయామం వల్ల ముఖానికి తగినంత రక్తప్రసరణ జరిగి ముఖం తేటగా మారుతుంది. ● రోజుకి కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్రతో ముఖం తేటబారుతుంది.

ఆహార పరంగా...

● అన్ని రకాల పోషకాలు అందే సమతులాహారాన్ని రోజూ తీసుకోవాలి. అయితే చలి వాతావరణం కారణంగా నీళ్లు తక్కువగా తాగుతుంటారు. ఇది సరికాదు. రోజూ తప్పనిసరిగా మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ● ఆకుకూరలు, కూరగాయలూ, ములగకాడల వంటి తాజా కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ సీజన్‌లో దొరికే పండ్లను తప్పక తీసుకోవాలి. ఇందులోని నీటిమోతాదులూ, పోషకాలూ, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరచి ముఖాన్ని తేటగా కనిపించేలా చేస్తాయి. ● డ్రైఫ్రూట్స్ పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. అందులో జీడిపప్పు వంటి కొవ్వులు ఎక్కువగా ఉండే నట్స్ కంటే బాదం పప్పు వంటి కొవ్వులు తక్కువగా ఉండే నట్స్ ఎక్కువగా తీసుకోవాలి.



హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ

దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌ల్లో పాల్గొనే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. భారత జట్టు సభ్యుడు ఠాకూర్ తిలక్ వర్మ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రాహుల్ సింగ్ గహ్లోత్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో పోటీ పడ్డ హైదరాబాద్ తమ గ్రూప్‌లో చివరిస్థానంలో నిలవడంతో ఈసారి 'ప్లేట్ డివిజన్‌'లో పోటీ పడనుంది. ప్లేట్ డివిజన్‌లో హైదరాబాద్‌తోపాటు సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్ జట్లున్నాయి. హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను జనవరి 5 నుంచి నాగాలాండ్‌తో, రెండో మ్యాచ్‌ను జనవరి 12 నుంచి మేఘాలయతో ఆడుతుంది.

హైదరాబాద్ రంజీ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రాహుల్ సింగ్ గహ్లోత్ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, సీవీ మిలింద్, రోహిత్ రాయుడు, టి.రవితేజ, తనయ్ త్యాగరాజన్, చందన్ సహని, కార్తికేయ కక్, నితీశ్ కన్నల, సాయిప్రజ్ఞయ్ రెడ్డి, సాకేత్ సాయిరామ్, అభిరత్ రెడ్డి, సాగర్ చౌరాసియా, ఇ.సంకేత్. స్టాండ్‌బైస్: రాహుల్ బుద్ధి, జావీద్ అలీ, యశ్ గుప్తా, రిషబ్ బస్లాస్, టీపీ అనిరుధ్, గణేశ్. డీబీ రవితేజ (హెడ్ కోచ్), పవన్ కుమార్ (అసిస్టెంట్ కోచ్), రొనాల్డ్ రోడ్రిగ్స్ (ఫీల్డింగ్ కోచ్), రియాజ్ ఖురేషి (టీమ్ మేనేజర్), సుభాశ్ పాత్రో (స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్), సంతోష్ (ఫిజియో), కృష్ణా రెడ్డి (వీడియో ఎనలిస్ట్), సాజిద్ హుస్సేన్ (మసాజర్).

సవిత సారథ్యంలో...

పారిస్ ఒలింపిక్స్ మహిళల హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ బరిలోకి భారత్



బెంగళూరు: స్వదేశంలో జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే పారిస్ ఒలింపిక్స్ మహిళల హాకీ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు గోల్‌కీపర్ సవిత పూనియా నాయకత్వం వహిస్తుంది. ఈ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధిస్తాయి. మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో చిలీ, చెక్ రిపబ్లిక్, జర్మనీ, జపాన్... గ్రూప్ 'బి'లో భారత్, ఇటలీ, న్యూజిలాండ్, అమెరికా జట్లున్నాయి. భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌ను 13న అమెరికాతో ఆడుతుంది. ఆ తర్వాత 14న న్యూజిలాండ్‌తో, 16న ఇటలీతో టీమిండియా తలపడుతుంది.

భారత హాకీ జట్టు: సవిత పూనియా (కెప్టెన్, గోల్‌కీపర్), బిచ్చూ దేవి ఖరీబమ్ (గోల్‌కీపర్), నిక్కీ ప్రధాన్, ఉదిత, ఇషికా చౌధరీ, మోనిక, నిషా, వైష్ణవి విఠల్ ఫాల్కే, నేహా, నవ్‌నీత్ కౌర్, సలీమా టెటె, సోనిక, జ్యోతి, బ్యూటీ డుంగ్‌డుంగ్, లాల్‌రెమ్‌సియామి, సంగీత కుమారి, దీపిక, వందన కటారియా.

టైటాన్స్‌కు ఏడో ఓటమి

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. యు ముంబాతో శనివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 32–54తో ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టుకిది ఏడో పరాజయం కావడం గమనార్హం. యు ముంబా తరఫున గుమన్ సింగ్ 10 పాయింట్లు, రింకూ 8 పాయింట్లు, సోంబీర్ 8 పాయింట్లు స్కోరు చేశారు. టైటాన్స్ తరఫున రజనీశ్ 8 పాయింట్లు, రాబిన్ చౌధరీ 7 పాయింట్లు, ప్రఫుల్ 7 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35–25తో యూపీ యోధాస్‌ను ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో బెంగాల్ వారియర్స్; తమిళ్ తలైవాస్‌తో బెంగళూరు బుల్స్ తలపడతాయి.

రిచా పోరాటం వృథా

రెండో వన్డేలోనూ ఓడిన భారత మహిళల జట్టు • సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకున్న ఆస్ట్రేలియా


రిచా


దీప్తి

ముంబై: గెలవాల్సిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు పోరాడి ఓడింది. సిరీస్ పరాజయంతో ఈ ఏడాదిని ముగించింది. 259 లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 47 ఓవర్లలో 237/6 వద్ద పటిష్టంగానే కనిపించింది. 18 బంతుల్లో 22 పరుగుల విజయ సమీకరణం భారత మహిళలకే అనుకూలంగా ఉంది. కానీ తర్వాతి వరుస ఓవర్లలో పూజ (8), హర్లీన్ (1) అవుట్ కావడంతో ఓటమి ఖాయమైంది. 6 బంతుల్లో 16 పరుగులు చేయలేకపోయింది. తుదకు ఆసీస్ మహిళల జట్టు 3 పరుగుల తేడాతో భారత్‌పై గెలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. గాయం పంటిబిగువన భరించిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిచా ఘోష్ (117 బంతుల్లో 96; 13 ఫోర్లు)... జెమీమా రోడ్రిగ్స్ (55 బంతుల్లో 44; 3 ఫోర్లు) అండతో అద్వితీయ పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. సిరీస్‌లోని చివరిదైన మూడో వన్డే జనవరి 2న జరుగుతుంది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ (98 బంతుల్లో 63; 6 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ఎలీస్ పెరీ (47 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. ఇద్దరు మూడో వికెట్‌కు 77 పరుగులు జోడించారు. తర్వాత వచ్చిన వారిలో తాలియా (24; 2 ఫోర్లు), అనాబెల్ సదర్లాండ్ (23; 1 ఫోర్), జార్జియా (22; 1 ఫోర్, 1 సిక్స్) కాస్త మెరుగ్గా ఆడారు. అయితే టెయిలెండర్ అలానా కింగ్ (17 బంతుల్లో 28 నాటౌట్; 3 సిక్స్‌లు) కొట్టిన భారీ సిక్సర్లతో ఆసీస్ 250 పైచిలుకు స్కోరు చేయగలిగింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ (5/38) వరుస విరామాల్లో వికెట్లను పడగొట్టింది. తర్వాత భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 255 పరుగులకే పరిమితమైంది. అనాబెల్ సదర్లాండ్ (3/47) కీలక సమయంలో విలువైన వికెట్లను తీసి భారత్ గెలుపు రాతను మార్చింది. ఫీల్డింగ్‌లో గాయపడిన స్నేహ్ రాణా స్థానంలో హర్లీన్ డియోల్ కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగింది. బెత్ మూనీ కొట్టిన షాట్‌ను బంతిని అందుకునే క్రమంలో చెరోవైపు నుంచి వచ్చిన స్నేహ్ రాణా, పూజ ఇద్దరి తలలు పరస్పరం ఢీకొని విలవిలలాడారు. తలనొప్పితో స్నేహ్‌రాణా మైదానం వీడింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: లిచ్‌ఫీల్డ్ (సి) రిచా (బి) శ్రేయాంక 63; అలీసా హీలీ (బి) పూజ 13; ఎలీస్ పెరీ (సి) శ్రేయాంక (బి) దీప్తి శర్మ 50; బెత్ మూనీ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 10; తాలియా (బి) దీప్తి శర్మ 24; గార్డ్‌నెర్ (సి) అమన్‌జీత్ (బి) స్నేహ్ రాణా 2; అనాబెల్ (సి అండ్ బి) దీప్తి 23; జార్జియా (సి) స్మృతి (బి) దీప్తి శర్మ 22; అలానా కింగ్ (నాటౌట్) 28; కిమ్ గార్త్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 258. వికెట్ల పతనం:** 1–40, 2–117, 3–133, 4–160, 5–170, 6–180, 7–216, 8–219. **బౌలింగ్:** రేణుక 7–0–36–0, పూజ 10–0–59–1, అమన్‌జోత్ 3–0–21–0, శ్రేయాంక 10–0–43–1, స్నేహ్ రాణా 10–0–59–1, దీప్తి శర్మ 10–0–38–5.

భారత్ ఇన్నింగ్స్: యస్తిక (ఎల్బీడబ్ల్యూ) (బి) కిమ్ గార్త్ 14; స్మృతి (సి) తాలియా (బి) అలానా 34; రిచా ఘోష్ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) అనాబెల్ 96; జెమీమా (సి) లిచ్‌ఫీల్డ్ (బి) వేర్‌హమ్ 44; హర్మన్‌ప్రీత్ (సి) హీలీ (బి) వేర్‌హమ్ 5; దీప్తి శర్మ (నాటౌట్) 24; అమన్‌జోత్ (బి) అనాబెల్ 4; పూజ (సి) గార్డ్‌నెర్ (బి) అనాబెల్ 8; హర్లీన్ (బి) గార్డ్‌నెర్ 1; శ్రేయాంక (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 255. వికెట్ల పతనం:** 1–37, 2–71, 3–159, 4–171, 5–218, 6–224, 7–240, 8–243. **బౌలింగ్:** గార్డ్‌నెర్ 10–0–46–1, బ్రౌన్ 7–0–37–0, కిమ్ గార్త్ 6–0–24–1, అనాబెల్ సదర్లాండ్ 9–0–47–3, అలానా కింగ్ 7–0–43–1, తాలియా 4–0–15–0, జార్జియా వేర్‌హమ్ 7–0–39–2.

నెట్స్‌లో గాయపడ్డ శార్దుల్



సెంచూరియన్: తొలి టెస్టులో ఓడిన భారత్‌కు మరో దెబ్బ! బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సెంచూరియన్ టెస్టు ఆడిన శార్దుల్ ఠాకూర్ గాయపడ్డాడు. అయితే ఇది మ్యాచ్ సమయంలో కాదు! నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా అతని ఎడమ భుజానికి గాయమైంది. వెంటనే జట్టు ఫిజియో ఐస్ ప్యాక్‌తో ఉపశమన సపర్యలు చేశాడు. అనంతరం మళ్లీ ప్రాక్టీస్‌కు దిగలేదు. దీంతో అతను కేప్‌టౌన్‌లో జనవరి 3 నుంచి జరిగే ఆఖరి టెస్టుకు దూరమయ్యే అవకాశముంది. గాయం తీవ్రతను తెలుసుకునేందుకు శార్దుల్ భుజానికి స్కానింగ్ తీయాల్సి ఉంది. దీన్నిబట్టే అతను అందుబాటులో ఉంటాడ లేదా అనే విషయంపై స్పష్టత వస్తుంది.

సఫారీ బౌలర్ కొయెట్జీ అవుట్

దక్షిణాఫ్రికా పేసర్ గెరాల్డ్ కొయెట్జీ రెండో టెస్టుకు దూరమయ్యాడు. 23 ఏళ్ల బౌలర్ పొత్తికడుపు నొప్పితో సతమతమవుతున్నాడు. ఈ నొప్పితోనే తొలిటెస్టు ఆడటంతో వాపు మొదలైందని జట్టు వర్గాలు తెలిపాయి. దీంతో కొయెట్జీ కేప్‌టౌన్ టెస్టుకు అందుబాటులో లేడని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు సోషల్ మీడియా 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. ఇదివరకే రెగ్యులర్ కెప్టెన్ బవుమా కూడా గాయంతో రెండో టెస్టుకు గైర్హాజరు కానున్నాడు. కొయెట్జీ స్థానాన్ని ఎన్‌గిడి, ముల్డర్‌లలో ఒకరితో భర్తీ చేసే అవకాశముంది.

వినేశ్ కూడా వెనక్కిచ్చేసింది!

కర్తవ్య పథ్ వద్ద 'ఖేల్‌రత్న'... 'అర్జున' పురస్కారాలను వదిలి వెళ్లిన భారత మహిళా స్టార్ రెజ్లర్



న్యూఢిల్లీ: భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కూడా కేంద్ర క్రీడా అవార్డులను వెనక్కి ఇచ్చేసింది. శనివారం కర్తవ్యపథ్ వద్ద ఆమె 'ఖేల్‌రత్న', అర్జున అవార్డులను వదిలేసి వెళ్లింది. కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పతకాలతో ఆమె దేశానికి కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టింది. ఫొగాట్ ఘనతలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న', అర్జున అవార్డులను ఇచ్చింది. అయితే భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)లో మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ వర్గమే కొత్తగా ఎన్నికైంది. ఆయన విధేయుడైన సంజయ్ సింగ్ అధ్యక్షుడు అయ్యారు. దీన్ని ఏమాత్రం జీర్ణించుకోలేని స్టార్ రెజ్లర్ సాక్షి మలిక్ నిమిషాల వ్యవధిలోనే రిటైర్మెంట్ ప్రకటించింది. బజరంగ్ 'పద్మశ్రీ'ని వెనక్కిచ్చాడు. బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ కూడా తన పురస్కారాన్ని వెనక్కిస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా ఫొగాట్ కూడా ముందు ప్రకటించినట్లే ఖేల్‌రత్న, అర్జున అవార్డుల్ని వెనక్కి ఇచ్చేందుకు ప్రధానమంత్రి నివాసానికి బయల్దేరింది. కర్తవ్యపథ్ వద్ద ఢిల్లీ పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో అవార్డుల్ని రోడ్డుపైనే వదిలేసింది. ఆ పురస్కారాలు ఇప్పుడు పోలీసుల ఆధీనంలో ఉన్నాయి.

అర్జున్ ఆరో స్థానంలో... హారిక ఏడో స్థానంలో





సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు విశేషంగా రాణించినా పతకాలు మాత్రం సాధించలేకపోయారు. శనివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో ఓపెన్ విభాగంలో భారత్ నుంచి తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ అత్యుత్తమంగా ఆరో స్థానాన్ని సాధించాడు. నిర్ణీత 21 రౌండ్ల తర్వాత అర్జున్ 14 పాయింట్లతో మరో ముగ్గురితో (నెపోమ్‌నిషి, లెవాన్ అరోనియన్, డెనిస్ లాజావిక్) కలిసి ఉమ్మడిగా ఐదో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా నెపోమ్‌నిషికి ఐదో ర్యాంక్, అర్జున్‌కు ఆరో ర్యాంక్, అరోనియన్‌కు ఏడో ర్యాంక్, డెనిస్‌కు ఎనిమిదో ర్యాంక్‌లు ఖరారయ్యాయి. భారత్‌కే చెందిన ఇతర గ్రాండ్‌మాస్టర్లు అరవింద్ చిదంబరం 14వ ర్యాంక్‌లో, ప్రజ్ఞానంద 28వ ర్యాంక్‌లో, నారాయణన్ 35వ ర్యాంక్‌లో, గుకేశ్ 38వ ర్యాంక్‌లో నిహాల్ సరీన్ 43వ ర్యాంక్‌లో నిలిచారు.

మహిళల విభాగంలో భారత్ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక అత్యుత్తమ ప్రదర్శన చేసింది. నిర్ణీత 17 రౌండ్ల తర్వాత హారిక 11 పాయింట్లతో ఏడో ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. హారికతోపాటు మరో ఎనిమిది మంది క్రీడాకారిణులు కూడా 11 పాయింట్లు స్కోరు చేశారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా హారికకు ఏడో ర్యాంక్ దక్కింది. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్ 13వ ర్యాంక్‌లో, కోనేరు హంపి 17వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి 27వ ర్యాంక్‌లో, వైశాలి 36వ ర్యాంక్‌లో, ప్రియాంక నూతక్కి 46వ ర్యాంక్‌లో నిలిచారు.

కార్ల్‌సన్‌కే మళ్లీ కిరీటం




ఓపెన్ బ్లిట్జ్ విభాగంలో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ మళ్లీ ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. కార్ల్‌సన్ 16 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఓవరాల్‌గా కార్ల్‌సన్‌కిది 17వ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. మహిళల బ్లిట్జ్ విభాగంలో రష్యా గ్రాండ్‌మాస్టర్ వాలెంటీనా గునీనా 14 పాయింట్లతో రెండోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. 2012లోనూ గునీనా ఈ టైటిల్ సాధించింది.

2023 రౌండప్

సినిమా


• 'వాల్తేరు వీరయ్య'లో చిరంజీవి


• 'సలార్'లో ప్రభాస్


• 'దసరా'లో నాని


• 'ఖుషి'లో సమంత, విజయ్ దేవరకొండ

స్ట్రయిట్ చిత్రాలు 236... డబ్బింగ్ సినిమాలు 70... మొత్తం 306 చిత్రాలను 2023 ఇచ్చింది. మరి జయాపజయాల శాతం ఎంత? అంటే... ఎప్పటిలానే విజయాలను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు... అపజయాలు లెక్కలేనన్ని. అయితే విజయం సాధించినవాటిలో ఎమోషనల్‌గా సాగేవి ఎక్కువగా ఉన్నాయి. ఆ విధంగా ఈ ఏడాది భావోద్వేగాలకు ప్రేక్షకులు ప్రాధాన్యం ఇచ్చారనుకోవచ్చు. ఇక ఈ ఏడాది 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు..' పాటకిగాను కీరవాణి, చంద్రబోస్‌లకు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు దక్కడం ఓ రికార్డ్. తెలుగు నుంచి జాతీయ తొలి ఉత్తమ నటుడి అవార్డు అల్లు అర్జున్‌కి దక్కడం మరో ఆనందం. ఇలా కొన్ని ఆనందాలను ఇచ్చింది 2023. కె. విశ్వనాథ్, జమున, కైకాల సత్యనారాయణ, చంద్రమోహన్ వంటి వారిని దూరం చేసి, విషాదాన్ని మిగిల్చింది. ఇక... ఈ ఏడాది లెస్ హిట్.. మోర్ ఫట్‌గా సాగింది తెలుగు సినిమా. ఆ విశేషాల్లోకి...

లెస్ హిట్... మోర్ ఫట్


• 'సార్'లో ధనుష్


• 'డెవిల్'లో కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్


• 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'లో అనుష్క, నవీన్ పొలిశెట్టి

స్టార్ హీరోలు కొందరు 'హిట్ హిట్ హుర్రే' అంటూ మంచి విజయాలు అందుకున్నారు. వారితో పాటు కొందరు మీడియమ్ రేంజ్, చిన్న రేంజ్ హీరోలకూ 2023 విజయానందాన్నిచ్చింది. ఆ హిట్స్ గురించి తెలుసుకుందాం.

సంక్రాంతి అంటే సినిమాల పండగ. అలా ఈ ఏడాది పండగకి అన్నదమ్ముల సెంటిమెంట్ నేపథ్యంలో వచ్చిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో వచ్చిన బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' మంచి వసూళ్లు రాబట్టాయి. చిరంజీవి హీరోగా, రవితేజ ఓ కీలక పాత్రలో 'వాల్తేరు వీరయ్య'కు బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహించగా, 'వీరసింహారెడ్డి' సినిమాకు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహించారు. సంక్రాంతికి మంచి హిట్ అందుకున్న బాలకృష్ణ దసరా పండక్కి 'భగవంత్ కేసరి'తోనూ మరో హిట్ సాధించారు. తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌తో దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ఈ ఏడాది ఓ హిట్.. ఓ ఫట్ పడ్డాయి. 'సలార్: సీజ్‌ఫైర్'తో ప్రభాస్‌కి సూపర్ డూపర్ హిట్ దక్కింది. స్నేహం ప్రధానాంశంగా ఈ సినిమాను దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించారు. ఈ ఏడాది నానీకి బాగా కలిసొచ్చింది. శ్రీకాంత్ ఓదెలను దర్శకుడిగా పరిచయం చేస్తూ నాని హీరోగా నటించిన మాస్, ఎమోషనల్ మూవీ 'దసరా' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలాగే శౌర్యువ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో నాని హీరోగా నటించిన ఎమోషనల్ మూవీ 'హాయ్ నాన్న' కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. విజయ్ దేవరకొండ, సమంతల వెండితెర ప్రేమకథ 'ఖుషి' కూడా ప్రేక్షకులను ఖుషీ చేసింది. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీ మంచి వసూళ్లు రాబట్టుకుంది. తమిళ స్టార్ ధనుష్ తెలుగులో చేసిన స్ట్రయిట్ ఫిల్మ్ 'సార్'. తెలుగు, తమిళ భాషల్లో వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడికల్ యాక్షన్ అండ్ మెసేజ్ ఓరియంటెడ్ చిత్రం ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. నాలుగేళ్లుగా హీరోయిన్‌గా తెలుగు వెండితెరపై కనిపించని అనుష్కా శెట్టి ఈ ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. 'జాతి రత్నాలు' ఫేమ్ నవీన్ పొలిశెట్టితో కలిసి ఈ సినిమాతో రొమాంటిక్ హిట్ అందుకున్నారు. ఈ చిత్రానికి పి. మహేశ్‌బాబు దర్శకుడు.


• 'మా ఊరి పొలిమేర 2'లో 'సత్యం' రాజేశ్


• 'బలగం'లో ప్రియదర్శి, కావ్య, సుధాకర్


• 'బేబీ'లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్


• 'విరూపాక్ష'లో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్


• 'సామజ వరగమన'లో శ్రీవిష్ణు

అలాగే కుర్ర హీరోల్లో సాయిధరమ్ తేజ్ 'విరూపాక్ష' హిట్‌తో జోష్‌గా ఉన్నారు. హారర్ థ్రిల్లర్‌గా కార్తీక్ దండు దర్శకత్వంలో 'విరూపాక్ష' రూపొందింది. గత ఏడాది హిట్ అందుకోలేకపోయిన శ్రీవిష్ణు 'సామజవరగమన' అంటూ ప్రేక్షకులను నవ్వించి ఈ ఏడాది సూపర్ హిట్ సాధించారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ఆకట్టుకుంది. అలాగే కుర్ర హీరో ఆనంద్ దేవరకొండ 'బేబీ'తో పెద్ద హిట్ అందుకున్నారు. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ మూవీకి సాయి రాజేశ్ దర్శకత్వం వహించారు. హాస్య నటుడు వేణు కెరీర్ డైరెక్షన్ ఈ ఏడాది మరో మలుపు తిరిగింది. వేణు తొలిసారి దర్శకత్వం వహించిన 'బలగం' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తెలంగాణలోని కాకిముట్టుడు సంప్రదాయం, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్, సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. 'బలగం' విడుదలయ్యేటప్పుడు చిన్న చిత్రమైనా వసూళ్లతో పెద్ద సినిమాగా మారింది. రెండేళ్ల క్రితం 'మా ఊరి పొలిమేర'తో మంచి హిట్ అందుకున్నారు 'సత్యం' రాజేశ్. అయితే ఆ చిత్రం ఓటీటీలో విడుదలైంది. ఆ సినిమా సీక్వెల్ 'మా ఊరి పొలిమేర 2'తో ఈ ఏడాది థియేటర్స్‌లో సక్సెస్ అందుకున్నారు 'సత్యం' రాజేశ్. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. ఇక 2023కి ముగింపు పలుకుతూ శుక్రవారం (డిసెంబర్ 29) విడుదలైన చిత్రాల్లో కల్యాణ్‌రామ్ 'డెవిల్'కి ప్రేక్షకాదరణ లభిస్తోంది. స్వీయదర్శకత్వంలో అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఇంకా స్ట్రయిట్ హిట్ చిత్రాల్లో కార్తికేయ 'బెదురులంక 2012', 'అల్లరి' నరేశ్ 'ఉగ్రం', పాయల్ రాజ్‌పుత్ 'మంగళవారం', నవీన్ చంద్ర 'మంత్ ఆఫ్ మధు', సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్‌ల 'మ్యాడ్', తరుణ్ భాస్కర్ 'కీడా కోలా' వంటివి ఉన్నాయి.

అనువాద చిత్రాల్లో రజనీకాంత్ 'జైలర్', విజయ్ 'వారసుడు', 'లియో', మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్ 2', విజయ్ ఆంటోని 'బిచ్చగాడు 2', టొవినో థామస్ '2018', షారుక్ ఖాన్ 'పఠాన్', 'జవాన్', రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' వంటివి మంచి వసూళ్లు రాబట్టాయి.

ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన కొన్ని చిత్రాలతో పాటు ఏ అంచనాలు లేకుండా విడుదలైన చిత్రాలు పరాజయాన్ని చవి చూశాయి. ఫట్ అయిన ఆ చిత్రాల గురించి..

'వాల్తేరు వీరయ్య' చిత్రంతో హిట్ సాధించిన చిరంజీవికి 'భోళా శంకర్' ఆశించిన ఫలితాన్నివ్వలేదు. తమిళ సూపర్ హిట్ 'వేదాళం' రీమేక్‌గా మెహర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళా శంకర్' రూపొందింది. ఆల్రెడీ వేరే భాషలో హిట్టయిన సినిమా కాబట్టి ఇక్కడ కూడా ఆ ఫలితాన్ని ఆశించారు. కానీ అది నెరవేరలేదు. ఇక ప్రభాస్ శ్రీరాముడిగా నటించిన చిత్రం 'ఆది పురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన ఈ పాన్ ఇండియా చిత్రంపై అంచనాలు ఓ రేంజ్‌లో నెలకొన్నాయి. రామాయణంలోని కొన్ని ముఖ్య ఘట్టాల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో పరాజయంగా నిలిచింది. రవితేజ సోలో హీరోగా నటించిన ('వాల్తేరు వీరయ్య' సినిమాలో కీలక పాత్ర చేశారు) 'రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు' సినిమాలు బోల్తా కొట్టాయి. సుధీర్ వర్మ దర్శకత్వంలో 'రావణాసుర', వంశీ దర్శకత్వంలో 'టైగర్ నాగేశ్వరరావు' రూపొందాయి. 'కస్టడీ' చిత్రం రూపంలో ఈ ఏడాది నాగచైతన్యకు పరాజయం ఎదురైంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ద్విభాషా చిత్రంగా ఈ యాక్షన్ థ్రిల్లర్ రూపొందింది. హీరో రామ్–దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'స్కంద' అంచనాలను అందుకోలేకపోయింది. ఇక సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' కూడా నిరాశనే మిగిల్చింది. ఈ ఏడాది వరుణ్ తేజ్ వ్యక్తిగతంగా ఫుల్ హ్యాపీ. లావణ్యా త్రిపాఠీని పెళ్లి చేసుకుని, లైఫ్‌లో కొత్త చాప్టర్‌ని మొదలుపెట్టారు. అయితే కెరీర్ పరంగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'గాండీవధారి అర్జున' నిరాశపరిచింది. నితిన్ హీరోగా వక్కంతం వంశీ డైరెక్షన్‌లో రూపొందిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్' ఆర్డినరీ సినిమా అనిపించుకుంది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'రంగ మార్తాండ' ఎమోషనల్ మూవీ అనిపించుకుంది. టాక్ బాగున్నా వసూళ్లు ఆశించిన విధంగా రాలేదు. హీరోయిన్ సమంత, నటుడు దేవ్ మోహన్ కాంబినేషన్‌లో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'శాకుంతలం' పరాజయాన్ని మూటకట్టుకుంది. ఇవే కాదు.. గోపీచంద్ 'రామబాణం', కల్యాణ్ రామ్ 'అమిగోస్', నిఖిల్ 'స్పై', వైష్ణవ్ తేజ్ 'ఆదికేశవ', సుధీర్ బాబు 'హంట్, మామా మశ్చీంద్ర' వంటి సినిమాలతో పాటు మరికొన్ని ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి.

కొత్తవారితో విశ్వక్ సేన్ కల్ట్

సొంత నిర్మాణసంస్థలు వన్మయీ క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్‌లపై నటుడు–దర్శకుడు–రచయిత–నిర్మాత విశ్వక్ సేన్ 'ఫలక్‌నుమాదాస్, దాస్ కా ధమ్కీ' వంటి సినిమాలు చేశారు. అయితే ఈసారి కొత్తవారిని ప్రోత్సహించాలని 'హ్యాష్‌ట్యాగ్ కల్ట్' అనే టైటిల్‌తో సినిమాను ప్రకటించారు. 'సే నో టు డ్రగ్స్' అనే స్లోగన్‌తో ఈ సినిమాకు 'లైక్ ఏ లీప్ ఇయర్ 2024' అనే క్యాప్షన్ పెట్టారు. విశ్వక్‌సేన్ కథ అందిస్తున్న ఈ సినిమాతో తాజుద్దీన్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ – ''హ్యాష్‌ట్యాగ్ కల్ట్' సినిమా హిలేరియస్‌గా ఉంటుంది. ఓ మంచి సందేశం కూడా ఉంది. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమా కథ రాశాను. ఇందులో ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు లీడ్ రోల్స్ చేస్తారు. ఈ చిత్రంతో 25మంది కొత్త నటీనటులను పరిచయం చేయనున్నాం. ఔత్సాహికులు ప్రయత్నించవచ్చు. నాకు నటనలో కాన్ఫిడెన్స్ ఇచ్చిన తాజుద్దీన్‌గారు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు'' అని అన్నారు. ''విశ్వక్‌గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇది నాకు మొదటి సినిమా'' అన్నారు తాజుద్దీన్.


• తాజుద్దీన్, విశ్వక్ సేన్

యానిమల్ తరహాలో...


• ప్రియా చౌహాన్, దేవ్ బల్లాని

దేవ్ బల్లాని, ప్రియా చౌహాన్, సరిత ప్రధాన పాత్రల్లో మురళీ రామస్వామి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దీనమ్మ జీవితం'. వై. మురళీకృష్ణ, వై. వెంకటలక్ష్మీ, డి. దివ్య సంతోషి, బి. సోనియా నిర్మించిన ఈ చిత్రం జనవరి 5న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దేవ్ మాట్లాడుతూ– ''మంచి కంటెంట్‌తో వస్తున్న చిత్రం ఇది. పెద్ద విజయాన్ని అందుకుంటామనే నమ్మకం ఉంది'' అన్నారు. ''యానిమల్' వంటి రా అండ్ ఫ్యామిలీ ఫిల్మ్ 'దీనమ్మ జీవితం'. తమిళ్, మలయాళంలోనే కాదు.. తెలుగులోనూ మంచి కంటెంట్‌తో సినిమా చేయగలరని నిరూపించే చిత్రమిది'' అన్నారు మురళీ రామస్వామి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కుల పట్టింపు లేదు/రిటైర్డ్ Govt ఎంప్లాయ్/ పెన్షనర్ సింగిల్ వెల్ సెటిల్డ్ గల సారికి ఏ బాదరబందీలేని జీవిత భాగస్వామి కావలెను. అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. అర్జెంట్. సంప్ర: 7286031653 [H-793639]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/50yMBS MD/Govt డాక్టర్/3 లక్షలు PM/ సొంత ఇండ్లు/రెంట్స్/తోటలు భూములు & 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. వధువుతో/ఆస్తితో పని లేదు (పిల్లలున్నా OK) ఫోన్: 8341454870 [H-793639]

SC మాదిగ/ B.Tech / EEE /C.Govt. బ్యాంకు మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 80,000/-PM/ 5'8"/ ఎత్తు/28 సం॥ల వరుడుకి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13251]

కుల ప్రసక్తి లేని 37 సం॥ల వయస్సు గల వరుడుకు వధువు కావలెను. వధువుకు మొదటి/రెండవ, విడో పిల్లలు ఉన్న వారైనా సంప్రదించండి. జాతి ప్రసక్తి లేదు. Ph: 6301055248, 7396730091 [HA-13251]

దేవాంగ (Cast No Bar) /40yrs/5'5"/Fair / M.Tech/MCA/IRPM వరుడునకు చదువు కున్న, సాయి దైవభక్తి గల వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర : 7036361292 [HA-13251]

కాపు: కుల, కట్నప్రసక్తి లేదు / గుడ్ లుకింగ్/ 25/ 5'8"/ B.Tech/ గుడ్ జాబ్/ 60,000/- PM / 10 కోట్ల ఆస్తి వరుడికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14944]

రెడ్డి: కట్నప్రసక్తి లేదు / గుడ్‌లుకింగ్/ 30/ 5'10" / PG / 3 Lakhs pm/40 కోట్ల ఆస్తి గల వరుడికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14944]

కుల పట్టింపు లేదు: మొదటి/రెండవ పెళ్లి అయినా ఓకే/ గుడ్ లుకింగ్/ 48/5'9"/ PG/ 70000/- PM/ 5 కోట్ల ఆస్తి గల వరునికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14944]

రజక: కట్నప్రసక్తి లేదు / M.E / C.Govt కస్టమ్స్ ఆఫీసర్/ GST Dept/ 80,000/- PM /5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [H-14945]

గౌడ: B.Tech/ C.Govt. లోకోపైలట్/ రైల్వే/ 85,000/- pm /6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [H-14945]

ముదిరాజ్: B.Tech/ C.Govt. Jr. ఇంజనీర్/ రైల్వే/ 68,000/- pm /5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515942275 [H-14945]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ Rich Industrialist *B.Tech/ B.Tech/1990/6'/1000Cr *1989/5'11"/ 500Cr *1995/5'9"/500Cr * Cont: K.C. Reddy-Hyd-Ph:9347807015

Reddy/BIG Business *B.Tech/ MBA/ 1997/6'/150Cr *1995/6'/100Cr * 1994/ 5'11"/250Cr *1997/6'/400 Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Good Business B.Tech / 1997/ 5'11"/100Cr *1996/6'/100Cr *1997/6'/200Cr *1994/5'10"/ 100Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/V.Good Business/ 1990/ 5'10"/25Cr/30L/M income *1993/ 5'7"/ 50Cr *1991/6'/100Cr *1994/5'11"/150Cr. *Cont : K.C. Reddy -Ph: 9347807015

Reddy/MBBS/PG-doc *1995/ 5'10"/ 400Cr *1996/6'/50Cr *1994/5'10"/50Cr *1993/5'10"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/MBBS/USA Doc *1995/5'8"/ 10Cr *1990/6'/50Cr *1991/5'10" *1989 / 5'9" *1998/5'8" *1992/5'11" * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1 USA *1991/5'11"/ 200Cr *1997/6'/400Cr *1993/6'/100Cr * 1997/5'9"/60Cr *1995/5'9"/50Cr * Cont : K.C. Reddy-Hyd- Ph:9849321309

Reddy/IIT/B.Tech/IIM(MBA)/1994/5'9"/ 1Cr/yr/30Cr *1994/5'11"/70L/yr/25Cr * 1990/85L/yr *1996/5'7"/50L/yr/20Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divorcee/India *B.Tech/ MBA/ 1981/5'8"/50L/M/500Cr *1979/ 5'9"/ 300Cr *1986/5'5"/1000Cr. *Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/Abroad *1986/ 5'11" /350 K/40Cr *USA-Doc/1982/ 5'8"/ 20 Cr *1977/5'6"/USA-Citizen. * Cont: K.C.Reddy-Hyd- Ph:9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech / 1993 / 5'3"/500Cr *1997/ 5'4"/ 150Cr *M.Sc/1994/5'3"/400Cr *MBBS /1997 /5'6" / 500Cr *1998 / 5'4" / 200Cr. * Cont: K.C. Reddy- Hyd Ph: 9347807015

Reddy/ MBBS / MD / Most Beautiful/ 1999/5'4"/200Cr *1994/5'6"/100Cr *1995 /5'3"/50Cr (The only Daughter). * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/(NIT) Most Beautiful /1998/5'3"/70L/yr/Rich Family/ * M.Sc/ 2000/5'5"/100Cr (The only Daughter) * Cont: K.C. Reddy- Ph: 9347807015

Reddy/Divorcee/MBBS/MD/1991/5'2"/ 40Cr *B.Tech/1993/10Cr *1988/5'6"/30Cr *1985/5'5"/400Cr *MD/1994/5'5"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/1994/5'5"/15 Cr * 1994/ 5'6"/ 100Cr * 1995/5'8"/100Cr *MS/ 1994/ 5'3"/ 200Cr *1999/5'8"/15Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/1996/5'7"/50Cr *1995/ 5'5"/120Cr *1995/5'5"/70Cr *1993/ 5'3"/ 500Cr *1997/5'4"/150Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1996/5'4"/30Cr * 1998/ 5'5"/ 100Cr *1996/5'7"/40Cr *1995/ 5'7"/ 10Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/1993/5'6"/50Cr *1990/5'4"/ 50Cr *1992/5'4"/25Cr *1996/5'5"/100Cr/ 1993/5'7"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1992/5'3 1/2"/40Cr/ *BA/1988/5'3"/200Cr *B.Tech/1990/ 5'3"/ 50Cr *1987/5'5"/100Cr. * Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1USA *1994/5'4"/10 Cr *1997/5'5"/10Cr *1997/5'8"/12Cr *1998/ 5'4"/30Cr *1996/5'5"/15Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

[D-534]

SC మాల: కట్నప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. బ్యాంక్ మేనేజర్/ SBI/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [H-14945]

యాదవ: కట్నప్రసక్తి లేదు/B.Tech/ Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 80,000/- pm /5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [H-14945]

SC మాల 43 ఒంటరి రెండవ బిజినెస్ / మంచి ఆస్తి ఇల్లు గల వరునికి 1వ లేదా 2వ వధువు (కుల పట్టింపు లేదు) కావలెను. ఫోన్: 8919914094. (డైరెక్ట్). [H-788498]

మున్నూరు కాపు: 31Y/5.8/Qly: డిగ్రీ, జీతం: 50,000/-PM, 1 కోటి ఆస్తి కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. కుల, కట్న ప్రసక్తి లేదు. నోబ్రోకర్స్. సెల్: 9440122861. [L-822283]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 5' 7", 120 K, H1, 25 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 32, 5' 10", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, CFA, 49, 5' 6", Sr Consultant, 18 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE (IIIT), M Tech (IIIT), 26, 5' 3", SWE, 30 L P/A, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 4", SWE, 72 K, 3 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 1", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 32, 5' 4", SWE, 11 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 27, 5' 9", Apple, H1, 50 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 11", Data Engineer, 13 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", SWE, 140 K, H1, 35 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి LLB, 29, 5' 7", DY Manager, 20 L P/A, 25 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 24, 5' 10", Data Analyst, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS (USA), 28, 5' 3", 20 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 26, 5' 8", SWE, 120 K, H1, 7 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 7", Amazon, 129 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓస్టీ తెలంగాణ వధువు కావలెను. డైవర్స్/విడో OK కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph:7989079290 [H-801458]

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల పట్టింపులేదు మరియు రెండో పెండ్లి వారు కూడ సంప్రదించవచ్చును. ఇది డైరెక్ట్‌గా ఇచ్చినాము. సంప్ర॥ 8790197318 [Y-784403]


మాల/కట్న ప్రసక్తి లేదు/49/5'/1st మ్యారేజ్/ ప్రైవేట్ టీచర్/ 1.10L PM/ సొంత ఇల్లు ఉన్న వరునికి డిగ్రీ/పీజీ చదివిన 45 సం॥ 1st మ్యారేజ్ వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788245]

మాల/48/52"/1st మ్యారేజ్ (తెల్ల మచ్చల పూత)/ TS Govt/ 70K PM/సొంత ఇల్లు ఉన్న వరునికి ఇంటర్ చదివిన, మధ్యతరగతి వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788246]

గూగుల్‌లో పనిచేయుచున్న 27 ఏండ్ల ఫెయిర్, 5 ఫీట్ 8 అంగుళాల క్రైస్తవునికి భక్తి కలిగిన వధువు కావలెను. సంప్రదించండి. సెల్ : 8332921163 [HA-95934]

2వ వివాహం : 62 సం॥ల రిటైర్డ్ ఎంప్లాయ్ కొరకు 45 సం॥లు దాటిన ఏ బాదరబంధీ లేని వధువు కావలెను. కుల పట్టింపు లేదు. డైరెక్ట్ Contact – 90008 48099 [M-1221438]

వరుడు కావలెను



2వ పెళ్లి/MBA / డైవర్సీ / 37yrs Govt ఎంప్లాయ్ / 2,00,000/- (PM) కుల పట్టింపు లేని వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా) సంప్ర : 8332006483 [H-793639]

కాపు/24y/ B.Tech / SWE / 80,000/- PM/కోట్ల ప్రాపర్టీ/4 ఎ॥ ఫాంల్యాండ్ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985748142 [H-787764]

రెండో పెళ్ళి/విడో/52y/Fair/వైజాగ్/ లెక్చరర్/వెల్ సెటిల్ పిల్లలులేని ఏ భాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-787764]

రెడ్డి/డైవర్స్/27y / BE / 1.2L PM/ Hydలో Own House/Plots కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985746131 [H-787764]

రెడ్డి/డైవర్స్/29y / B.Tech MBA/1.2 L PM/కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-787764]

చౌదరి/60y/విడో/5'4"/Own Business /1L/PM/సొంత ఇల్లు/ఆంధ్రాలో పొలాలు /పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు Ph: 7981958172 [H-801501]

తెలగ/ కాపు/ విడో/ 58y/తెల్లనిచాయ/ ప్రభుత్వ ఉన్నత ఉద్యోగి/Own House గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. Ph: 9030993696 [H-801501]

రెడ్డి/53y/విడో/ఇంటర్/సొంత బిజినెస్ /90K/PM/6 ఎకరాల పొలం/ సొంత ఇల్లు గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను Ph: 9703982351 [H-801501]

రెడ్డి/విడో/59y/5'4"/Very Fair/పెన్షనర్/ సొంత ఇల్లు & రెంట్స్/ పొలాలు/ఏబాదరబందీ లేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9030711984 [H-801501]

రెడ్డి/విడో/54Y/5'2"/ప్రాపర్ ఆంధ్ర, Hydలో సొంత బిజినెస్/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (ఇల్లరికం) వారికే ప్రాధాన్యత (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-793639]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/38yrs/B.Sc, B.Ed/ Govt.టీచర్, 1 లక్ష (PM) సొంత ఇల్లు+కార్ పిల్లలు లేని 100 కోట్ల ఆస్తి గల V.ఫెయిర్ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK): 8341454870 [H-793639]

కుల పట్టింపు లేదు 21y&23y&25y&26y& 27y& 29y&30y&31y&33y&35y& 37y&39y& 40y& 41y& 43y&45y&47y&49y&50y&52y&54y&55y&57y&59y &"మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-13251]

రెడ్డి/2nd మ్యారేజ్: కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/వయసు: 30, ఎత్తు:5'4"/ బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 9515673252 [HA-13251]

Caste no bar/2nd match bride, 30Y/5'4", Widow, B.Tech, Central Govt Job, పిల్లలు లేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 9381358331, 9063037521. [HA-13251]

SC మాదిగ/ 25 / 5'5" / B.Tech(NIT), Preventive Officer in Customs 65,000/- PM వెల్ సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 8978880072 [HA-13251]

కుల ప్రసక్తి లేదు/రెడ్డి 2వ సంబంధం/ H:5'4",కలర్ : ఎరుపు/ట్రావెల్స్ బిజినెస్ కలిగిన వధువుకి సంప్రదాయ కుటుంబపు వరుడు కావలెను. Ph: 9121300377 [HA-13251]

కులపట్టింపు లేదు: 2వ పెళ్లి/ పిల్లలు లేరు/ చాలా అందమైన/ 37/5'4"B.Tech/ సాఫ్ట్ వేర్/వెల్ సెటిల్, కోట్ల ఆస్తి/ గల వధువుకి వరుడు కావలెను. US అయినా ఓకే. Ph: 8367619529 [H-14944]

కమ్మ: చాలా అందమైన/ 25/ 5'4"/B.Tech/ సాఫ్ట్ వేర్ /TCS/ కోట్ల ఆస్తి & గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. (US అయినా OK) Ph: 8367619529 [H-14944]

SC హిందు మాల: C.A/ చార్టెడ్ అకౌంటెంట్/10Lakhs. PA/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [H-14945]

ముదిరాజ్: B.Tech/ Govt. సబ్ ఇంజనీర్/ ఎలక్ట్రికల్ Dept/ 60,000/- pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [H-14945]

SC హిందు మాదిగ: B.Tech/Govt. Asst. Exq. ఇంజనీర్/ మిషన్ భగీరథ/1 Lakhs. PM/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [H-14945]

SC మాల & క్రిస్టియన్: M.Tech(EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 65,000/- PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [H-14945]

రజక: B.Sc/ Govt. A.E.O/అగ్రికల్చర్ Dept/ 40,000/- pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [H-14945]

SC మాల క్రిస్టియన్, వయస్సు 28, ఎత్తు 5.4, M.Com, Govt. Employee కి వరుడు కావలెను. ✆ 93984 50329 [G-1087]

2nd Marriage - మాల, క్రిస్టియన్స్, వయస్సు 32, 5.4H, Fair, B-Tech, సాఫ్ట్‌వేర్ నెలకు 1,50,000 జీతం వధువుకి, వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి కావలెను. ✆ : 77949 11019 [R-1151844]

బ్రాహ్మణ/24/5'3"/B.SC *27/5'4"/MBA *30/ 5'3"/B.SC *32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/పురోహితులకు మ్యాచెస్ త్వరగా కుదుర్చబడును. PH: 7842635086 [HA-13251]

వేదికలు



సెకండ్ మ్యారేజీలకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : Ph: 8555980066 [H-787764]

గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, యాత, శ్రీశైన మా ఖాతాదారులకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. "శుభమస్తు మ్యారేజ్ బ్యూరో" DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.గౌరయ్యగౌడ్, S.వాసుల గౌడ్ Ph: 8790690309 [H-801501]

శ్రీశ్రీరస్తు శుభమస్తు. ఓన్లీ రెడ్డీస్ గత 15 సం.లుగా అనేక జంటలు కలిపిన సంస్థ. ఇండియా అబ్రాడ్ సంబంధాలు కలవు. మా బ్రాంచెస్ Hyd, విజయవాడ, బెంగళూరు Ph:9100454789 [HA-13251]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Kamma-Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793556]

పెళ్లి సంబంధాలు-కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ, చౌదరి, రెడ్డి కులస్తులకు, సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ వారికి Specialగా చూడబడును, పూర్ణ మ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1983]

వాసవి విజయవాడ వారి అధ్వర్యంలో 28-1-2024వ తేదీ ఉ॥ 9 గం॥లకు 64వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయం వేదిక మరియు మ 2॥లకు 19వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలోజరుగును. ✆ 9989500130 [B-1234]

15లో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 9492033897, 9490416355, 9440785888 [B-610]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-950]

రవాణా శాఖలో ఆన్‌డ్యూటీలు రద్దు.. జేసీటీల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: రవాణాశాఖలో ఆన్‌డ్యూటీలను రాష్ట్రప్రభుత్వం రద్దు చేసింది. అదే సమయంలో ప లువురు సంయుక్త రవాణా కమిషనర్లను బదిలీ చేసింది. ఒకచోట పోస్టింగ్ పొంది అక్కడ పనిచేయ కుండా ఆన్‌డ్యూటీ(ఓడీ) పేరిట పైరవీలతో తమకు ఇష్టమైనచోట విధుల నిర్వహణకు ఇకపై చెల్లుబీటీ పడనుంది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల ఓడీల ను రద్దు చేసింది. కాగా, ముగ్గురు రవాణాశాఖ సంయుక్త కమిషనర్ల(జేసీటీ)ను బదిలీచేస్తూ రవాణా, రహదారుల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ జేటీసీగా ఉన్న పాండురంగ నాయక్‌ను పరిపాలన విభాగానికి బదిలీ చేశారు. అక్కడ ఐటీ, విజిలెన్స్ విభాగం జేసీటీగా ఉన్న రమేశ్‌ను హైదరాబాద్ జేసీటీగా, పరిపాలన విభాగంలో జేసీటీగా ఉన్న మమతాప్రసాద్‌ను ఐటీ, విజిలెన్స్ విభాగం జేసీటీగా బదిలీచేశారు.

కోవిడ్ అడ్వాన్స్‌లకు ఈపీఎఫ్‌ఓ చెక్

- చందాదారులకు ఈపీఎఫ్‌ఓ ఖాతా నుంచి 'కోవిడ్'చెల్లింపుల నిలిపివేత
- 2020 ఏప్రిల్ నుంచి కోవిడ్-19 అడ్వాన్స్‌లకు అవకాశం
- దాదాపు మూడున్నరేళ్ల పాటు సాగిన ఉపసంహరణల ప్రక్రియ
- దేశవ్యాప్తంగా 2.25 కోట్ల మంది రూ.50 కోట్ల మేర ఉపసంహరణ
- ఇంకా కొనసాగిస్తే పొదుపు నిధికి విఘాతం కలుగుతుందనే భావన
- దీంతో ఉపసంహరణను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్న ఈపీఎఫ్‌ఓ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) కోవిడ్-19 అడ్వాన్స్ మంజూరును నిలిపివేసింది. ప్రస్తుతం కోవిడ్-19 పరిస్థితులు పూర్తిగా సద్దుమణగడం, ఉద్యోగావకాశాలు పెరిగిన నేపథ్యంలో కోవిడ్-19 కారణంగా భవిష్య నిధి నుంచి నగదు ఉపసంహరణ అవకాశాన్ని ఈపీఎఫ్‌ఓ రద్దు చేసింది. ఇకపై భవిష్యనిధి నుంచి సాధారణ కారణాలతో నగదు ఉపసంహరించుకునే అవకాశాన్ని మాత్రం కొనసాగిస్తోంది. కోవిడ్-19 ప్రభావంతో 2020 మార్చిలో లాక్‌డౌన్ ప్రక్రియ మొదలైన విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర కాలంలో పలుమార్లు వివిధ కంపెనీలు లాక్‌డౌన్ పాటించాల్సిరావడం, ఫలితంగా తయారీ రంగంతో పాటు పలు కంపెనీలు ఉద్యోగులను తొలగించాయి. దీంతో ఉద్యోగులు ఒక్కసారిగా ఉపాధి కోల్పోవడంతో వారి ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఈపీఎఫ్‌ఓ కోవిడ్-19 అడ్వాన్స్‌ల విడుదలకు నిర్ణయించింది. ఇందులో భాగంగా 2020 ఏప్రిల్ నెల నుంచి ప్రారంభించిన ఈ ఉపసంహరణ ప్రక్రియతో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 2.25 కోట్ల మంది ఖాతాదారులు రూ.50 కోట్ల మేర భవిష్య నిధిని ఉపసంహరించుకున్నారు.

నిధి మెరుగుపడేలా..

దాదాపు మూడున్నరేళ్ల పాటు కోవిడ్-19 అడ్వాన్స్ విడుదలకు ఈపీఎఫ్‌ఓ అవకాశం కల్పించింది. ఈ కాలంలో ఖాతాదారులు దాదాపు మూడుసార్లు నిధి నుంచి అర్హత మేరకు ఉపసంహరించుకున్నారు. మూలవేతనం నుంచి దాదాపు 3 రెట్ల నగదును ఉపసంహరించుకునేలా వెసులుబాటు ఉండడంతో దాదాపు 2.25 కోట్ల మంది ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 7.25 కోట్ల మంది ఈపీఎఫ్‌ఓలో చందాదారులుగా ఉన్నారు. మారిన పరిస్థితుల దృష్ట్యా తాజాగా కోవిడ్-19 అడ్వాన్స్ ఉపసంహరణను ఈపీఎఫ్‌ఓ నిలిపివేసింది. భవిష్యత్ అవసరాల కోసం, పదవీ విరమణ పొందిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు లేకుండా చందాదారులు జీవించేందుకు వినియోగించుకోవాల్సిన ఈపీఎఫ్ నిధి నుంచి ఉపసంహరణ ప్రక్రియను ఇలాగే కొనసాగిస్తే చివరి నాటికి ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అందుకే ఉపసంహరణల ప్రక్రియకు కాస్త బ్రేక్ వేస్తూ సాధారణ పద్ధతిలో మాత్రమే నిధిని వెనక్కు తీసుకునే అవకాశాలను కల్పించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఇప్పటివరకు ఉపసంహరణలతో తగ్గిన నిధిని తిరిగి మెరుగుపర్చే దిశగా ఈపీఎఫ్‌ఓ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఒకే రోజు 39,24,107 కేసుల పరిష్కారం

- రాష్ట్రంలో జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన
- రికార్డుస్థాయిలో రూ. 320 కోట్ల చెల్లింపులు



కక్షిదారుకు వివాద పరిష్కార పత్రాన్ని అందజేస్తున్న జస్టిస్ శ్యామ్ కోషి. చిత్రంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఒకేరోజు రికార్డుస్థాయిలో 39,24,107 కేసులను పరిష్కరించారు. వీటిలో ప్రి-లిటిగేషన్ కేసులు 32,65,220. వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 6,58,887 ఉన్నాయి. లబ్ధిదారులకు రూ.320 కోట్ల పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు ఇచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.శ్యామ్ కోషి, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ టి.వినోద్‌కుమార్ రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌లను పర్యవేక్షించారు. ఈ మేరకు కేసుల పరిష్కార వివరాలను సాయంత్రం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

హైకోర్టులో 285 కేసులు..

హైకోర్టు పరిధిలో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు, మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.శ్రీదేవి పాల్గొన్నారు. హైకోర్టులో 285 కేసులు పరిష్కారమయ్యాయి. రూ.11 కోట్లను లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఇక జిల్లా కోర్టుల్లో స్థానిక న్యాయమూర్తులు కేసులను పరిష్కరించారు.

రూ. 2.15 కోట్లు చెల్లించి పరిష్కారం

మల్కాజిగిరి సర్వే నంబర్ 169లోని కొంత భూమికి సంబంధించి 80 ఏళ్ల శాంతిదేవి, మరికొందరు (సోదరులు, కుటుంబ సభ్యులు)కి చాలా కాలంగా వివాదం ఉంది. శనివారం ఈ కేసు అదాలత్‌కు రాగా సివిల్ జడ్జి మహేశ్‌నాథ్ కక్షిదారుల మధ్య పరిష్కారం కుదిర్చారు. శాంతిదేవికి రూ.2.15 కోట్ల చెక్కులను అందజేసి సోదరులు వివాదాన్ని పరిష్కరించుకున్నారు.

రాష్ట్రం నుంచి పెద్దల సభకు సోనియా!

- వచ్చే మార్చిలో కాంగ్రెస్‌కు రెండు రాజ్యసభ స్థానాలు దక్కే చాన్స్
- వీటికితోడు ఎమ్మెల్సీ పదవుల కోసం పార్టీలో పోటాపోటీ
- ప్రియాంకగాంధీ రాయబరేలీలో లోక్‌సభకు పోటీచేస్తే.. సోనియా తెలంగాణ నుంచే రాజ్యసభకు!
- రాష్ట్రంలోని మరో స్థానం కోసం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పేరు తెరపైకి
- ఎమ్మెల్సీ పదవుల కోసం క్యూలో 20మందికిపైగా నేతలు
- అంతా పోటీచేసి ఓడినవారు, వివిధ కోటాల కింద అవకాశం కోరుతున్నవారే
- సాహిత్య రంగం నుంచి అందెశ్రీకి అవకాశం.. సీపీఐ, టీజేఎస్‌లకు ఎమ్మెల్సీలు ఈసారేనా?... ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఏ పదవి ఇస్తారన్న దానిపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాష్ట్రం నుంచి రాజ్యసభకు వెళ్లనున్నట్టు టీపీసీసీలో చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది మార్చిలో రాష్ట్రం నుంచి ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు కాంగ్రెస్ పార్టీకి దక్కనున్న నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. రాజ్యసభ స్థానాలతోపాటు రాష్ట్ర శాసన మండలిలో పలు సీట్లు ఖాళీ అవుతుండటంతో.. ఎమ్మెల్సీ సీట్ల కోసం కూడా రాష్ట్ర కాంగ్రెస్‌లో పోటీ పెరిగింది. మార్చి నాటికి రాజ్యసభ స్థానాలతోపాటు గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ సీట్లు, ఒక గ్రాడ్యుయేట్, మరో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ సీట్లు ఖాళీకానున్నాయి. సొంత పార్టీ నేతలతోపాటు అటు టీజేఎస్, ఇటు సీపీఐల నేతలు కూడా ఎమ్మెల్సీ సీట్లు, ఇతర పదవులను ఆశిస్తున్నారు.

ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుంటే..

సోనియా గాంధీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని.. లేదంటే తెలంగాణ నుంచే ఆమెను రాజ్యసభకు ఎంపిక చేయాలని కోరుతూ ఇటీవల టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) తీర్మానం చేసి అధిష్టానానికి పంపింది. సోనియా ప్రత్యక్ష ఎన్నికలకు సిద్ధంగా ఉంటే ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో పోటీచేసే అవకాశం ఉందని.. అక్కడ ప్రియాంకా గాంధీని పోటీకి పెడితే, సోనియా తెలంగాణకు మారవచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఈసారి సోనియా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చనే చర్చ ఉందని.. ఈ క్రమంలో ఆమెను తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని టీపీసీసీ ప్రతిపాదించినట్టు తెలిసింది. దీనితో రాష్ట్ర కాంగ్రెస్‌కు రానున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి రిజర్వ్ అయినట్టేనని.. మరో సీటు కోసం ఏఐసీసీలో కీలక భూమిక పోషిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా యువనేత చల్లా వంశీచంద్‌రెడ్డికి ఇవ్వవచ్చని చర్చ జరుగుతోంది. మరోవైపు రాజ్యసభ పోటీలో తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం పేరు కూడా వినిపిస్తోంది. ఆయనకు రాష్ట్రస్థాయిలో ఏదైనా పదవి ఇవ్వాలని, కుదరకపోతే రాజ్యసభకు ఎంపిక చేసే అంశాన్ని పరిశీలించాలని టీపీసీసీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఆయనకు ఏ చాన్స్ దక్కుతుందన్నదానిపై చర్చ జరుగుతోంది.

20మందికిపైగా ఆశావహులు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్ల కోసం కూడా పోటీ నెలకొంది. ప్రజా గాయకుడు అందెశ్రీతోపాటు పార్టీలోని 20 మందికి పైగా నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు టీజేఎస్, సీపీఐ నేతలకు ఇప్పుడే ఎమ్మెల్సీ సీట్లు ఇస్తారా, లేక భవిష్యత్తులో ఖాళీ అయ్యే స్థానాలను ఇస్తారా అన్నదానిపై స్పష్టత రాలేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతల విషయానికి వస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయకుండా సీట్లు త్యాగం చేసినవారు, పోటీ చేసి ఓడినవారు, వివిధ కోటాల కింద తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నవారు చాలా మంది ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్నారు. ఈ జాబితాలో షబ్బీర్‌అలీ, ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్, అలీ మస్కతి, మహేశ్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, మధుయాష్కీ, సంపత్‌కుమార్, చరణ్ కౌశిక్ యాదవ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. తుంగతుర్తి అసెంబ్లీ సీటును త్యాగం చేసిన అద్దంకి దయాకర్‌ను మంత్రి చేయాలనుకుంటే.. ఈసారి ఎమ్మెల్సీ కోటాలోనే ఆయనకు అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. లేదంటే వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ చేయించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. మహేశ్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్సీ ఖాయమనే చర్చ జరుగుతోంది. ఇక సాహిత్య రంగం నుంచి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అందెశ్రీ పేరు దాదాపు ఖరారైనట్టేనని తెలుస్తోంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా చిన్నారెడ్డి పేరు ఖరారు కావచ్చని సమాచారం. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరన్న దానిపై కాంగ్రెస్‌లో స్పష్టత రావడం లేదు. ఈ క్రమంలో ఎవరెవరికి పదవీ యోగం కలుగుతుందనేది ఉత్కంఠగా మారింది.

తగ్గిన అగ్నిప్రమాదాలు

- 2022లో 7,942 ప్రమాదాలు.. 2023లో 7,174
- శాఖ వార్షిక నివేదికలో వెల్లడించిన ఫైర్ డీజీ నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: గతేడాదితో పోలిస్తే 2023లో రాష్ట్రవ్యాప్తంగా అగ్నిప్రమాదాల సంఖ్యలో 9.67 శాతం తగ్గుదల నమోదైంది. 2022లో 7,942 ప్రమాదాలు నమోదుకాగా, 2023లో 7,174 అగ్నిప్రమాదాలు జరిగినట్టు అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపకశాఖ 2023 వార్షిక నివేదికను ఫైర్ డీజీ నాగిరెడ్డి శనివారం విడుదల చేశారు. తీవ్రమైన అగ్నిప్రమాదాలు 2022తో పోలిస్తే 2023లో 3.84 శాతం పెరిగినట్టు నివేదిక వెల్లడించింది. అగ్నిప్రమాదాల నియంత్రణ, నివారణపై రాష్ట్రవ్యాప్తంగా పదివేలకు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం 6,549 ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్స్)లు జారీ చేయగా... పలు రకాల అనుమతుల జారీ ద్వారా అగ్నిమాపక శాఖకు రూ.36.66 కోట్ల ఆదాయం సమకూరినట్టు నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 19 కొత్త ఫైర్‌స్టేషన్లను ప్రారంభించినట్టు తెలిపారు. 2022లో జరిగిన అగ్నిప్రమాదాల నుంచి 934 మంది ప్రాణాలు, రూ.723.14 కోట్ల విలువైన ఆస్తులు కాపాడగా, 2023లో జరిగిన అగ్నిప్రమాదాల నుంచి 2,093 మంది ప్రాణాలు, రూ.918.69 కోట్ల విలువైన ఆస్తిని కాపాడినట్టు నివేదికలో పేర్కొన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 2023లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదాల్లో ఎంత మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందన్న వివరాలను మాత్రం నివేదికలో వెల్లడించలేదు.

నివేదికలో పేర్కొన్న కీలక అంశాలు ఇలా..

అంశం	2022	2023
తీవ్రమైన అగ్నిప్రమాదాలు	104	108
మధ్యస్థ తీవ్రత కలిగినవి	135	150
స్వల్ప అగ్నిప్రమాదాలు	7,129	6,377
రెస్క్యూ కాల్స్	574	539
మొత్తం	7,942	7,174

బలమైన జాతి నిర్మాణమే ఐ ఫోకస్ లక్ష్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి




వేదికపై ముచ్చటిస్తున్న హరీశ్, కిషన్‌రెడ్డి

ఉప్పల్ (హైదరాబాద్): బలమైన జాతి నిర్మాణమే 'ఐ ఫోకస్'సంస్థ లక్ష్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు సభ్యులుగా ఉన్న ఈ సంస్థ 18 ఏళ్ల పూర్తి చేసుకోవడంతో సంస్థ సభ్యులకు ఆయన అభినందలు తెలిపారు. ఉప్పల్ భగాయత్ శిల్పారామంలో 'జయప్రద–2023'పేరిట శనివారం నిర్వహించిన ఐ ఫోకస్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలోని లేని యువత భారత్‌కు ఉందని, 2047 నాటికి స్వతంత్ర భారత్ వందేళ్లు పూర్తి చేసుకుంటుందన్నారు. అప్పటికి భారత్ ప్రపంచ దేశాలను శాసించే స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఐ ఫోకస్'శివానంద మూర్తి కలలు కన్న భారత్‌ను చూస్తామని, ఆ యజ్ఞంలో ఇక్కడి సభ్యులంతా భాగస్వాములుగా ఉంటారన్నారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసానికి కృషి చేస్తున్న ఐ ఫోకస్ సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. 18 ఏళ్ల క్రితం పిడికెడు మందితో ప్రారంభమైన ఈ సంస్థ నేడు 15 వేల మంది సభ్యులను సంపాదించుకుందన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఉద్యోగుల్లో సమర్థత, యువతలో చైతన్యం, నూరిపోయడం, వ్యాపారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఐ ఫోకస్ కృషి చేస్తోందన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి వస్తుండగా, ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో కిషన్‌రెడ్డి, హరీశ్‌రావు నాగోల్ మెట్రో స్టేషన్‌లో రైలు ఎక్కి గమ్యానికి చేరుకున్నారు.



మెట్రోలో ప్రయాణిస్తున్న హరీశ్ రావు



హైదరాబాద్‌కు చెందిన ఓ వాహనదారుడు మూడు రోజుల క్రితం గచ్చిబౌలి నుంచి ఔటర్ మీదుగా టీఎస్‌పీఏ (అప్పా) వరకు వెళ్లారు. నిబంధనల మేరకు ఈ రూట్‌లో ఒకసారి వెళితే రూ.20, వెళ్లివస్తే రూ.30 చెల్లించాలి. కానీ సదరు వాహనదారుడి ఖాతా నుంచి ఏకంగా రూ.80 కోత పడింది. దీనిపై సంస్థ ప్రతినిధులను నిలదీయగా 'సారీ' అంటూ చేతులు దులిపేసుకున్నారు.

కొద్దిరోజుల క్రితం మరో వాహనదారుడు గౌరెల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు వెళ్లాడు. నిబంధనల మేరకు రూ.20 తీసుకున్నారు. కానీ తిరిగి అదేరోజు ఘట్‌కేసర్ నుంచి గౌరెల్లికి తిరిగి రాగా ఏకంగా రూ.115 వసూలు చేశారు. నిబంధనల మేరకు రిటర్న్ జర్నీకి రూ.10 చార్జీ చెల్లించాలి. ఒకవేళ నిర్ణీత సమయం మించితే వన్‌వే జర్నీ కింద రూ.20 తీసుకోవాలి.

₹ ఔటర్‌పై కిలోమీటర్‌కు వాహనాలకు టోల్ చార్జీ ఇలా (రూ.లలో)..

కార్లు, తదితర తేలికపాటివి	మినీబస్సులు, లైట్ క్యారేజీలు	బస్సులు, లారీలు
2.25	3.65	6.46

కమర్షియల్ గూడ్స్	భారీ నిర్మాణ సామగ్రి యంత్రాల వాహనాలు
8.34	11.99

7 యాక్సిల్ కంటే పెద్దవైన భారీ కంటైనర్లు	14.58

ఔటర్‌పై టోల్ తీస్తున్నారు!

అడ్డగోలుగా టోల్ చార్జీ వసూలు చేస్తున్న నిర్వహణ సంస్థ

వాహనదారుల నుంచి ఫిర్యాదుల వెల్లువ

రూ.30 టోల్ చార్జీకిగాను రూ.80 వసూలు

విచారణ చేపడతామన్న హెచ్ఎండీఏ

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై టోల్ ట్యాక్స్ దోపిడీ జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా టోల్ చార్జీలను వసూలు చేస్తున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుట్టుగా వాహనదారుల ఖాతాల్లోంచి కొట్టేస్తున్నట్లు నిర్వహణ సంస్థకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గట్టిగా నిలదీసిన వాళ్లకు 25 రోజుల గడువులోపు తిరిగి చెల్లిస్తామంటున్నారు.. కానీ సకాలంలో ఖాతాలో జమ కావడంలేదని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. 158 కి.మీ. ఔటర్ మార్గంలో రోజూ వేలాది మంది వాహనదారులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. అధికంగా వసూలు చేసినట్లు గుర్తించిన వాహనదారులకు మాత్రమే తిరిగి చెల్లిస్తామని చెబుతున్నారు. కానీచాలామంది తమకు తెలియకుండానే మోసపోతున్నారు.

హెచ్ఎండీఏ నియంత్రణ ఏమైనట్లు..

జాతీయ రహదారులపై విధించే టోల్ చార్జీల నిబంధనలే హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్‌కు వర్తిస్తాయి. ఔటర్‌పై ప్రస్తుతం 21 ఇంటర్‌ఛేంజ్‌ల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రింగ్‌రోడ్డును ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు ప్రభుత్వం టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజుకిచ్చింది. ఐఆర్‌బీ అనుబంధ సంస్థ అయిన ఐఆర్‌బీ గోల్కొండ సంస్థ టోల్ చార్జీలను వసూలు చేస్తోంది. నిబంధనల మేరకు హెచ్ఎండీఏ అనుమతితోనే టోల్ చార్జీలను పెంచుకొనేందుకు ఐఆర్‌బీకి అవకాశం ఉన్నా సొంతంగా పెంచేందుకు అవకాశం లేదు. ఐఆర్‌బీ అడ్డగోలుగా టోల్ వసూలు చేస్తున్నప్పటికీ హెచ్ఎండీఏ చర్యలు తీసుకోకపోవడంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విచారిస్తాం

ఔటర్‌పై అధికంగా టోల్ వసూలు చేయడానికి వీల్లేదు. వాహనదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను విచారిస్తాం. ఎక్కువ డబ్బులు తీసుకున్నట్లు రుజువైతే తిరిగి వాళ్ల ఖాతాల్లో జమ అవుతాయి.

– బీఎల్ఎన్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండీఏ

టోల్ దోపిడీ దారుణం

టోల్ ట్యాక్స్ దోపిడీ దారుణంగా ఉంది. అవకతవకలను వాహనదారులు గుర్తించినప్పుడు మాత్రమే తిరిగి చెల్లిస్తామని చెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. కానీ చాలా మంది తమకు తెలియకుండానే నష్టపోతున్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

– కేతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి దేశాయ్, వాహనదారుడు




పొగమంచుతో జనజీవనం తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. శనివారం పొగమంచులో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఇలా కనిపించింది.

యాదాద్రి క్యూలైన్లలో ఏసీలు.. ఆలయ మాడ వీధుల్లో షెడ్లు ఏర్పాటు చేస్తాం

దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం యాదాద్రి ఆలయాన్ని సందర్శించారు. ఈఓ రామకృష్ణారావుతో కలిసి క్యూలైన్లు, మాఢవీధులు, ప్రసాద విక్రయశాల ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. క్యూలైన్లలో వెంటిలేషన్ సరిగా లేకపోవడంతో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పుడు సమస్య ఏర్పడుతోందన్నారు. ఇందుకోసం క్యూలైన్లలో ఏసీలు, అవసరమైన చోట వెంటిలేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులు కూర్చోవడానికి, నిల్చోవడానికి షెడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొండపైన మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు భక్తుల కోసం వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తామన్నారు.

టుడేస్ గ్రాఫిక్



ఈ యాప్‌లలో పెట్టుబడి వద్దు

నకిలీ ఫారెక్స్ ట్రేడింగ్ యాప్‌ల వివరాలు వెల్లడించిన ఆర్బీఐ

సాక్షి, హైదరాబాద్: ఆర్బీఐ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఫారెక్స్ ట్రేడింగ్ పేరిట ప్రకటనలు గుప్పిస్తున్న పలు నకిలీ యాప్‌ల వివరాలను ఆర్బీఐ వెల్లడించింది. ఆర్బీఐ వెల్లడించిన అనుమతి లేని ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల జాబితాలో అల్పరి ఇన్వెస్ట్–ఇన్వెస్ట్‌మెంట్స్, ఐక్యూ ఫారెక్స్–ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్, ఓలింప్ ట్రేడ్–ట్రేడింగ్ ఆన్‌లైన్‌లు ఉన్నాయి. అనుమతులు లేని యాప్‌లతో పెట్టుబడి పెట్టి మోసపోవద్దని ఆర్బీఐ హెచ్చరించింది. ఆర్బీఐ అనుమతి లేని అలాంటి సంస్థల వివరాలు తెలిస్తే వెంటనే సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లోగానీ, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లోగానీ తెలియజేయాలని కేంద్ర హోంశాఖ అధికారులు సూచించారు.

రేవంతన్నా.. నన్ను యాది మరువకు!



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కూలిపోయిన ఇంట్లో నివసిస్తున్న మహిళతో మాట్లాడుతున్న నాటి పీసీసీ చీఫ్, నేటి సీఎం రేవంత్‌రెడ్డి



ఆ దినం కూలిపోయిన నా ఇంటికి వచ్చినవు రేవంతన్నా. సగం కూలిపోయిన ఇంట్లోనే సంసారం ఎల్లదీస్తున్న. మన ప్రభుత్వం రాంగనే ఇల్లు కట్టిస్త అన్నవు. నన్ను జర యాది మరువకు అన్నా. అప్పటి సర్కారు నాకు ఇల్లు ఇయ్యలే. మీరన్నా మంజూరు జేసి ఇంత నీడ ఇయ్యుండ్రి.

– భిక్కనూరు లక్ష్మి, చిన్నమల్లారెడ్డి గ్రామం, కామారెడ్డి జిల్లా

అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఏడాది మార్చి 18న హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. తొలిరోజున కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి మీదుగా రాజంపేటకు యాత్ర నడుస్తుండగా, చిన్నమల్లారెడ్డి గ్రామంలో భిక్కనూరు లక్ష్మి అనే మహిళ తన ఇల్లు కూలిపోయిందని, ప్రభుత్వం మాకు డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేయగా, రేవంత్‌రెడ్డి ఆమె ఇంటికి వెళ్లి చూసి విస్తుపోయారు. కూలిన ఇంట్లోనే కాపురం ఎల్లదీస్తున్నమని ఆమె పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నీకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదని ఆ రోజు రేవంత్‌రెడ్డి లక్ష్మికి భరోసా ఇచ్చి ముందుకు కదిలారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో లక్ష్మి కుటుంబంలో సంతోషం వ్యక్తమైంది. ఈ సందర్భంగా 'సాక్షి' లక్ష్మిని పలకరించగా, రేవంతన్న ఇల్లు మంజూరు చేస్తానన్నాడని, తప్పకుండా తనకు మంజూరవుతుందని ధీమా వ్యక్తం చేసింది. మరీ సీఎం రేవంత్‌రెడ్డి ఆమె సొంతింటి కల ఎప్పుడు తీరుస్తారో వేచిచూద్దాం! –సాక్షి, కామారెడ్డి.

ఆటా సేవలు ప్రశంసనీయం: కిషన్‌రెడ్డి

నటుడు రాజేంద్రప్రసాద్‌కు జీవనసాఫల్య పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): అమెరికా తెలుగు సంఘం(ఆటా) మాతృభూమికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఇక్కడి రవీంద్రభారతిలో నిర్వహించిన ఆటా సేవా కార్యక్రమాల ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. అమెరికాలో ఉంటూ తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలు అనేకమందికి స్ఫూర్తిని ఇస్తున్నాయని పేర్కొన్నారు. నెలరోజులుగా తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన విద్య, వైద్యం, సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. అంతకుముందు వివిధ రంగాలలో సేవలందిస్తున్నవారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు కె.వెంకటరమణారెడ్డి, యశస్వినిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆటా అధ్యక్షుడు బొమ్మినేని మధు, ఎలక్టెడ్ ప్రెసిడెంట్ చల్లా జయంత్, పూర్వ అధ్యక్షుడు భీంరెడ్డి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఈటల రాజేందర్, జస్టిస్ కె. సురేందర్, జస్టిస్ ఎం.లక్ష్మణ్

రేయ్ అని పిలిచే హక్కు వారికే ఉంటుంది

- స్కూల్, కాలేజీ స్నేహితులపై ఈటల
- సైన్స్ కాలేజీలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

లక్డీకాపూల్ (హైదరాబాద్): చరిత్ర నిర్మాతలు ప్రజలేనని మాజీ ఎమ్మెల్యే, సైఫాబాద్ సైన్స్ కాలేజీ పూర్వ విద్యార్థి ఈటల రాజేందర్ చెప్పారు. శనివారం సైఫాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో జరిగిన మెగా అల్యూమ్ని వేడుకలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, ఎన్ఆర్ఐలు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ కాలేజీలో 1981 నుంచి 84 వరకు చదువుకున్నానని, కాలేజీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించారంటూ ఈటల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అరే అని పిలవగలిగే హక్కు స్కూల్, కాలేజ్ ఫ్రెండ్స్‌కు మాత్రమే ఉంటుందన్నారు. సైఫాబాద్ కాలేజీ ఇచ్చిన చైతన్యంతో పెరిగిన తనపై ఇప్పటివరకు ఎలాంటి మచ్చ లేదన్నారు. తాను బయాలజీ విద్యార్థినే కానీ ఆర్థికవేత్తను కాదన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర మొదటి ఆర్థిక మంత్రిగా తన ప్రసంగంలో మొదటిపేరాలో.. 'ఈ డబ్బు, బడ్జెట్ తెలంగాణ ప్రాంత ప్రజలు తమ రక్త మాంసాలతో కష్టపడ్డ చెమటతో కట్టిన డబ్బులు.. ఈ డబ్బుకు పేదల కన్నీళ్లకు పరిష్కారం చూపే బాధ్యత ఉంద'ని చెప్పానన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కె. సురేందర్, రాజస్తాన్ హైకోర్టు, న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి.రవీందర్, ఓయూ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, పూర్వ విద్యార్థులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈ.వెంకట్ నర్సింహారెడ్డి, రాచకొండ డీసీపీ ఇందిర ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



నింగికి ఎక్కుపెట్టిన ప్రయోగ వేదికపై పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్

రేపు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్

- నాలుగు దశల అనుసంధానం పూర్తి
- పీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో ఈ ప్రయోగం 60వది..

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా) : నూతన సంవత్సరం 2024, జనవరి ఒకటో తేదీ ఉదయం 9.10 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. నాలుగు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేసి.. ఎంఎస్‌టీ నుంచి ప్రయోగ వేదికకు అనుసంధానం చేశారు. ఈ ప్రయోగానికి సంబంధించి శనివారం ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డుకు అప్పగించారు. అనంతరం లాంచ్ ఆథరైజేషన్ సమావేశం నిర్వహించి రిహార్సల్స్ చేసి ప్రయోగసమయాన్ని, కౌంట్‌డౌన్ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆదివారం ఉదయం 8.10 గంటలకు.. అంటే ప్రయోగానికి 25 గంటల ముందు కౌంట్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో ఈ ప్రయోగం 60వది కావడం విశేషం.

260 టన్నుల బరువు..

పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్ 44.4 మీటర్లు పొడవు కలిగి ప్రయోగ సమయంలో 260 టన్నుల బరువుంటుంది. ఈ ప్రయోగాన్ని నాలుగు దశల్లో 21.55 నిమిషాల్లో పూర్తి చేస్తారు. రాకెట్ మొదటి దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో నింపిన 24.4 టన్నుల ఘన ఇంధనం, కోర్ అలోన్ దశలో నింపిన 138 టన్నుల ఘన ఇంధనంతో 109.40 సెకెండ్లను పూర్తి చేస్తారు. అనంతరం 41.9 టన్నుల ద్రవ ఇంధనంతో 261.50 సెకెండ్లకు రెండో దశ, 7.66 టన్నుల ఘన ఇంధనంతో 586.26 సెకెండ్లకు మూడో దశ, 1.6 టన్నుల ద్రవ ఇంధనంతో 1258.92 సెకెండ్లకు నాలుగో దశను పూర్తిచేస్తారు. అనంతరం నాలుగో దశలో ద్రవ ఇంధన మోటార్ 1315.92 సెకెండ్లకు(21.55 నిమిషాల్లో) ఎక్స్‌పోశాట్ అనే ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టి ప్రయోగాన్ని పూర్తి చేస్తారు. ఈ ప్రయోగంలో 469 కిలోల బరువు గల ఎక్స్‌పోశాట్ అనే ఖగోళ పరిశోధనలకు ఉపయోగపడే ఉపగ్రహాన్ని భూమికి 350 నుంచి 450 కి.మీ. ఎత్తులోని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.